
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-8-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 210 పేజీలు: 10+4 వెల: 8.00



బడా టెర్రరిస్టు బాగుఖాన్ హతం

ట్రంప్ అనారోగ్యంపై సోషల్ మీడియాలో వైరల్ 5


# చైనాలో ప్రధాని మోడీ

## ఏడేళ్ల తర్వాత బీజింగ్‌కు మొదటిసారి


టియాంజిన్ ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న అధికారులు

**బీజింగ్, ఆగస్టు 30:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ చైనా చేరుకున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత బీజింగ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా టియాంజిన్ ఎయిర్‌పోర్టులో ప్రధానికి రెడ్‌కార్పొట్ వేసి అక్కడి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 1 వరకూ.. రెండు రోజులపాటూ చైనాలో ప్రధాని పర్యటించనున్నారు. అక్కడి టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ పర్యటన సందర్భంగా తొలిరోజు 31న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోడీ ద్వైపాక్షిక చైనా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ప్రధాని మోడీ చైనాలో పర్యటించడం ఏడేళ్లలో ఇదే తొలిసారి. చివరిసారిగా 2018లో పర్యటించారు. తర్వాత చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత గత

>>2

# రాయలసీమను అగ్రగామి చేస్తా

## 2027 కల్లా పోలవరం పూర్తి

### ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

### వృథా జలాల సద్వినియోగంపై తెలంగాణ నేతలు యోచించాలి

### యేడాదిలోనే 10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఒయులు

### కుప్పంలో కృష్ణాజలాలకు సిఎం చంద్రబాబు జలహారతి


శనివారం కుప్పంలోని పరమసముద్రం వద్ద కృష్ణాజలాలకు జలహారతి ఇస్తున్న సిఎం చద్రబాబు

**కుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త:** ఒకప్పటి రత్నాలసీమ అయిన రాయలసీమను అన్ని రంగాల్లో అగ్రగామిగా చేస్తానని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం కుప్పం మున్సిపల్ పరిధి పరమసముద్రం వద్ద కృష్ణాజలాలకు ముఖ్యమంత్రి జలహారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో సిఎం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాయలసీమ అభివృద్ధి బ్లూప్రింట్ రూపొందించామన్నారు. గాలేరు -నగరి ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు ఇక్కడ ఉద్యానవన పంటల సాగుకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. డిఫెన్స్, ఏరోస్పేస్, గ్రీన్ హై డ్రో ప్రాజెక్టులను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించడంతో పాటు రోడ్లు, ఎయిర్‌పోర్టులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షనిజం ఉండేదని దాన్ని లేకుండా చేసి చూపించామన్నారు. రాయలసీమను రక్తపాతం చేయాలనేది వైఎస్సార్సీ ఆలోచన అని అది ఓ విషవృక్షం అని విమర్శించారు. రాజకీయాల ంటే రౌడీయిజం కాదని ప్రజలకు జవాబుదారీ అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో పోటీపడాలన్నారు. వైఎస్సార్సీ నేతలు మంచి పనుల్ని అడ్డుకుంటున్నారని ఎవరు అడ్డుపడినా తన సంకల్పాన్ని దెబ్బతీయలేరని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో రాయలసీమలో వైఎస్సార్సీకి 7సీట్లే వచ్చినా వారు మారలేదన్నారు. కుప్పంలో రప్పా.. రప్పా రాజకీయాలు చేశారని

>>2

# 100 గ్రామాల్లో 'మ్యాజిక్ డ్రైన్లు'

## రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు 1న ఒకేసారి శంకుస్థాపనలు



**విజయవాడ, ఆగస్టు30, ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లాకు 4 తక్కువ కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వంద గ్రామాల్లో ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రైన్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పారిశుధ్య సమస్య పరిష్కారానికి భూగర్భ జలాల పెంపుదలకు దోహదం చేసే డ్రైన్లకు సెప్టెంబరు 1న రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి శంఖుస్థాపనలు చేయనున్నారు. 100 గ్రామాల్లోనూ 77 కిలోమీటర్ల పొడవునా రూ.5.50 కోట్లతో మ్యాజిక్‌డ్రైన్ల పనులు చేపట్టనున్నారు. రాష్ట్రంలో ప్రయోగాత్మాకంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరం గ్రామంలో చేపట్టిన మ్యాజిక్ డ్రైన్‌తో సత్ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతానికి వంద గ్రామాల్లో చేపట్టి దశల వారీగా మిగిలిన చోట్ల డ్రైన్లు నిర్మించనున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులను ఇందుకోసం ఖర్చు చేయనున్నారు. సిమెంటు కాలువల నిర్మాణానికి కిలో మీటరుకు రూ.50 లక్షల వరకు ఖరవుతుంది. మ్యాజిక్ డ్రైన్ కిలోమీటరు పనులు రూ.7 లక్షలతో పూర్తి చేస్తారు.



న్యూఢిల్లీలో శనివారం అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్-25 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

# భవిష్యత్ పెట్టుబడి కేంద్రంగా అమరావతి

## కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ, ఆగస్టు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి భారత అభివృద్ధి చరిత్రలో కీలక పాత్ర పోషించబోతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రతిష్టాత్మకంగా న్యూఢిల్లీలో ప్రారంభమైన 17వ నారెడ్కో జాతీయ సదస్సులో శనివారం అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ 2025 బ్రోచర్ ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు ఆవిష్కరించారు. అమరావతిని భవిష్యత్‌లో రియల్‌ఎస్టేట్, మౌలిక సదుపాయాల ముఖ్య కేంద్రంగా ప్రదర్శించడానికి ఈ ఫెస్టివల్ ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ, ఈ ఫెస్టివల్ ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారులను ప్రపంచస్థాయి భాగస్వాములతో కలిపే వేదికగా మారుతుందని పేర్కొన్నారు. ఆధునిక పట్టణ రూపకల్పన, స్మార్ట్ మౌలిక వసతులు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో అమరావతి ఆదర్శ రాజధానిగా రూపుదిద్దుకుంటుందని ఆయనస్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ నిపుణులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ 2025లో నివాస, వాణిజ్య ప్రాజెక్టులతో పాటు ప్రభుత్వ దూరదృష్టి, పెట్టుబడి సౌహార్ద విధానాలు, సమగ్ర టౌన్‌షిప్ ప్రణాళికలు

>>2

# సగటు మనిషి ఆవేశమే జనసేన

## 11 యేళ్ల ప్రయాణంలో కుటుంబం, సినిమాల కంటే పార్టీ పైనే దృష్టి పెట్టా



విశాఖలో శనివారం జరిగిన సేనతో సేనాని సభలో డి.సిఎం పవన్

### వీర మహిళలకు 33 శాతం రిజర్వేషన్

### విశాఖ సభలో పార్టీ అధినేత, డి.సిఎం పవన్ కల్యాణ్

**విశాఖపట్నం, ఆగస్టు 30, ప్రభాతవార్త:** వాస్తగటు మనిషి ఆవేశం నుండి పుట్టిందే జనసేన పార్టీ అని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. శనివారం మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే సేనతో సేనాని బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. మూడు రోజులపాటు విశాఖలో నిర్వహించిన రాజకీయ సమావేశాలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ జనసేనపార్టీలో క్రియాశీలక కార్యకర్తలు రాజకీయంగా ఎదగడం కోసం త్రిసూల్ అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. త్రిశూలంఅంటే శక్తి, ధర్మం, రహస్యం. అలాగే క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు, నాయకత్వం, భద్రత కల్పించనున్నామని, దసరా నుంచి ఈనూతన కార్యక్రమం ప్రారంభించనున్నామని తెలియజేశారు. తాను రాజకీయంగా అడుగులు వేసిన తొలి రోజుల్లోనే అనేకమంది యువతీ, యువకులు తన వెంట నడిచారని, తనకోసం ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. నోవాటెల్ హోటల్లో పోలీసులు తనను నిలువరిస్తే మూడేళ్ల బిడ్డను చంకనెత్తుకొని ఒక వీర మహిళ రాత్రంతా బీచ్ ఒడ్డున తనకోసం కూర్చోవడం తనను ఎంతగానో కదిలించిందని పవన్ కళ్యాణ్ చెప్పారు. తనకు రాజకీయాలపై అవగాహన లేదని కొంతమంది పెద్దలు అంటుంటారు. అవగాహన లేకుండానే రాజకీయ పార్టీ పెట్టామా? రగిలే అగ్నిగుండం నుంచి పుట్టిన పార్టీ జనసేన అని పవన్ ఉద్ఘాటించారు. పార్టీ ఆవిర్భావం తర్వాత తను ఇతర విషయాలపై దృష్టి సారించలేకపోయానని, కార్యకర్తలతో కలిపి ఉద్యమాలు చేశానని రాజకీయంగా ఎన్నో

>>2



# ఇజ్రాయెల్ దాడుల్లో హూతీల ప్రధాని అహ్మద్ రహావీ హతం



**సనా, ఆగస్టు 30:** యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారుల స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులుచేస్తోంది. హూతీల నియంత్రిత ప్రాదేశిక ప్రాంతానికి ప్రధానిగా కొనసాగుతున్న అహ్మద్ అల్ రహావీని దళాలు హతమార్చాయి. హూతీలు ఈ మృతిని తాజాగా ధృవీకరించారు. ఈ వారం ఆరంభంలో రాజధాని సనా వ్యాప్తంగా ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో సుమారు 10 మంది మృతిచెందగా 100 మందికిపైగా గాయపడ్డారని హూతీనేతలు ప్రకటించారు. రాజధాని సనాలో హైతీ పాలకుల సైనిక స్థావరమే లక్షనయంగా వైమానిక దాడులునిర్వహించినట్లు ఇజ్రాయెల్‌ప్రకటించింది. ఈ దాడుల్లో ప్రముఖులందరినీ మట్టుబెట్టామని తెలిపింది. ఈ దాడుల్లో ప్రధాని అహ్మద్ ఆల్ రహావీతోపాటు పలువురు మంత్రులు మృతిచెందారని హూతీలు శనివారం వెల్లడించారు. ప్రభుత్వ కార్యకలాపాలు పనితీరును విశ్లేషించేందుకు మంత్రులతోప్రధాని సమావేశమైన సందర్భంగా ఈ దాడులుచేసారని, 2024ఆగస్టునుంచి రహావి హూతీల నియంత్రితప్రాంతానికి ప్రధానిగా ఉన్నట్లు హూతీనేతలు

>>2

# పి-4కు విస్తృత ప్రచారం

## పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అమలు చేస్తున్న పథకం

### మార్గదర్శకాలపై ఎలాంటి ఒత్తిడి లేదు

### ఈ పథకంతో ఎంతో తృప్తికలుగుతోంది: సిఎం చంద్రబాబు




**విజయవాడ, ఆగస్టు 30, ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అమలు చేస్తున్న జీరో పావర్టీ పీ4 పథకానికి మరింత విస్తృత ప్రచారం చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆ మేరకు ఆయన క్షేత్రస్థాయి నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతి నిధులకు, ఎంఎల్ఏలను, మంత్రులను ఆదేశించారు. పీ4 పథకంపై ఆయన లేఖా సందేశాలు వారందరికి అందాయి, సంపాదనతో కలగని సంతృప్తి సాయం చేస్తే కలుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. పీ4పథకం పరిధిలో రావాలని మార్గదర్శకులను ఎవ్వరిని ఒత్తిడి చేయడం లేదు. వారు స్వచ్ఛంధంగానే రావాల్సి ఉంటుంది. పారిశ్రామికవేత్తలను పెట్టుబడులు పెట్టాల్సిందిగా గతంలో కోరేవాడినని.. ఇప్పుడు పెట్టుబడులు పెట్టడంతో పాటు.. పేదలకు సాయం చేయాలని కూడా అడుగుతున్నానని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా ఉండాలని చంద్రబాబు పారిశ్రామిక వేత్తలను కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.."పీ4 కార్యక్రమం గురించి తలుచుకున్న ప్రతిసారి కొత్త ఉత్సాహం వస్తుంది. ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయగలం. నాది సుదీర్ఘ రాజకీయ జీవితం. జాతీయ స్థాయి రాజకీయాలపై ప్రభావం చూపించాం. ఉమ్మడి రాష్ట్రంలో, విభజన ఆంధ్రప్రదేశ్‌లో, జాతీయస్థాయి రాజకీయాల్లో చాలా క్రియాశీలంగా పని చేశాం. ఎన్నో సంస్కరణలు తెచ్చాను. కానీ ఎప్పుడూ కలగని తృప్తి.. పీ4 కార్యక్రమం ద్వారా కలుగుతోంది. సంస్కరణల వల్ల సమాజంలో చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు వందల కోట్ల రూపాయలతో పెట్టుబడులు పెడితే చాలు అవి అతి పెద్ద ప్రాజెక్టులుగా ఉండేవి.. కానీ ఇప్పుడు రూ.లక్షల కోట్ల ప్రాజెక్టులు

>>2



# కొడాలి నానికి బెయిల్ షరతుల నుంచి విముక్తి

**విజయవాడ, ఆగస్టు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నానికి నేటితో బెయిల్ షరతుల నుంచి విముక్తి లభించింది. ఆయన బెయిల్ షరతుల గడువు నేటితో పూర్తి అయింది. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు వస్త్ర దుకాణంపై దాడి కేసులో బెయిల్ పొందిన కొడాలి నానికు.. గుడివాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ప్రతి మంగళ, శనివారాల్లో సంతకాలు చేయాలని షరతులు విధించి కోర్టు బెయిల్‌మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కొడాలి నానిపై కోర్టుకు వెళ్లడంతో శనివారం ఒక్కరోజు సంతకాలు చేస్తే సరిపోతుందంటూ హైకోర్టు షరతుల్ని సడలించింది. అయితే, 2నెలలు సంతకాలు చేయాలన్న హైకోర్టు ఆదేశాలు కూడా నేటితో పూర్తి అవడంతో కొడాలి నాని ఇక స్టేషన్‌కు వెళ్లి సంతకాలు చేయాల్సిన పరిస్థితి లేకుండాపోయింది.

# తిరుమల బస్సుల్లో లేని 'స్త్రీ శక్తి'




## రోజుకు సగటున 25 వేల మంది మహిళల ప్రయాణం

### పథకం అమలు చేసే విషయం పరిశీలిస్తామన్న సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అమలుచేసిన ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం (జీరోఫేర్‌టిక్కెట్)తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో అమలుకు నోచుకోలేదు. ఈ హామీపై అటు వైసిపి నేతల్లో ఇటుమహిళ సంఘాల్లో తీవ్రవిమర్శలు వ్యక్తమయ్యాయి. ఘాట్‌రోడ్లలో స్త్రీశక్తిపథకం అమలుపై అధ్యయనం చేసి అమలుచేసే దిశగా పరిశీలిస్తామనే విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్టీసి ఎండి ద్వారాకాతిరుమలరావు సూచాయప్రాయంగా వెల్లడించారు. ఈ పథకం అమలై రెండు వారాలు గడుస్తున్నా తిరుమలకు మాత్రం స్త్రీశక్తి పథకం అమలుకావడం లేదు. ప్రతిరోజూ లక్షమందివరకు భక్తులు పలు రకాలుగా తిరుమలకు చేరుకుంటున్నా ఇందులో 25 వేల మంది వరకు మహిళ భక్తులు తిరుమల ఘాట్‌లో సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌బస్సుల్లో ప్రయాణంచేస్తున్నారనేది సమాచారం. ప్రస్తుతం తిరుపతి-తిరుమల, తిరుమల -తిరుపతి మధ్య ఘాట్‌లో తిరిగే ఆర్టీసి సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌బస్సులు, విద్యుత్ ఏసి బస్సుల్లో వర్తించడం లేదు. రాష్ట్రం నలుమూలల నుండి తిరుమలకు వస్తున్న మహిళ ప్రయాణీకులు ఎప్పటిలాగే టిక్కెట్ కొనుగోలుచేసి ఆర్టీసి బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. తిరుమలఘాట్‌లో నడిచే ఆర్టీసి బస్సుల్లో బస్సుఛార్జీ ఒక్కో ప్రయాణీకునికి 90రూపాయలు (ఒకవైపుప్రయాణం)వసూలుచేస్తున్నారు. తిరుగుప్రయాణంలోనూ (తిరుపతికి) 90 రూపాయలు టిక్కెట్ ధరగా అమల్లో ఉంది. ఎవరైనా భక్తులు రానుపోను (అప్, డౌన్)టిక్కెట్లు కొనుగోలుచేస్తే వీరికి 20 రూపాయలు ఆదా అయ్యి 160 రూపాయలతోనే టిక్కెట్ పొందిన భక్తులు తిరుమలకు చేరుకుంటే ఆ భక్తులు 72గంటల్లో (మూడురోజులపాటు )తిరుమల నుండి తిరుపతికి ఏ ఆర్టీసి బస్సుల్లోనైనా ప్రయాణించే సదుపాయం ఉంది. 12సంవత్సరాలు దాటిన పిల్లలకు 50రూపాయలు బస్సుటిక్కెట్ అమలులో ఉంది. రెండువైపులా టిక్కెట్ 100 రూపాయలు. రానుపోను టిక్కెట్ ఒకేసారి తీసుకుంటే వీరికి 10 రూపాయలు ఆదా అవుతుంది. ఇక విద్యుత్‌తో నడుస్తున్న ఆర్టీసి ఏసి బస్సుల్లో ఒక్కో ప్రయాణీకునికి

>>2

# నన్ను చంపాలని రౌడీ షీటర్ల కుట్ర

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తన వ్యక్తిగత ప్రమాదం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో సమావేశమైన ఆయ న, రౌడీ షీటర్లు తనను హత్య చేయాలని కుట్ర చేశారని తెలియజేశారు. ఇటీవల విడు దలైన ఒక వీడియోను చూసి షాక్‌కి గుర య్యానని అన్నారు. నెల్లూరులో రాజకీయా లు ఎంతో హుందాగా రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లాకు రాజకీయాలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని అలాంటిది ప్రశాంతంగా ఉన్న నెల్లూ రులో రౌడీలు బహిరంగంగా మాట్లాడటం ఆందోళన కలిగించిందన్నారు. ఈ కుట్ర గురించి మూడు రోజుల కిందటే పోలీసు అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ, తనకు తెలపలేదు అని ఆయన అన్నారు. ఈ కుట్ర పోలీసులకు తెలిసిన దానిపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రౌడీషీటర్లు నన్ను చంపితే

>>2



బీహార్‌లో శనివారం 'ఓటరు అధికార్ యాత్ర'లో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, ఎస్పీ అధినేత అఖిలేష్,ఆర్జేడీ నేత తేజస్వియాదవ్

## తిరుమల బస్సుల్లో లేని 'స్త్రీ శక్తి'

>> 110రూపాయలు ఛార్జీ వసూలుచేస్తున్నారు. తిరుపతి నుండి తిరుమలకు 40వేలమంది నుండి 50వేలమంది వరకు భక్తులు ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారనేది ఆర్టీసి అధికారుల సమాచారం. 2019లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అమాంతం బస్సు ఛార్జీలు విపరీతంగా పెంచారు. ఈ పెరిగిన ఛార్జీలు తిరుమల ఘాట్‌లో ప్రయాణీకులకు వర్తించింది. 18కిలోమీటర్ల ఘాట్‌లో ప్రయాణానికి 90రూపాయలు తిరుమలకు బస్సు టిక్కెట్ వసూలుచేస్తున్నారు. తిరుమలకు 450వరకు వివిధ డిపోలకు చెందిన ఆర్టీసి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రతిరోజూ నడుస్తున్నాయి.

**తిరుమల ఘాట్‌లో "స్త్రీశక్తి"తో ఇబ్బందులే!**

ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ నుండి ఎక్కడికైనా మహిళలు ఆధార్‌కార్డు, ఓటరుకార్డు,డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంతో చూపి ఉచితంగా ఆర్టీసి నడుపుతున్న పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేలా చూస్తారు. తిరుమల-తిరుపతి మధ్య ఘాట్‌లో నడిచే ఆర్టీసి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితప్రయాణం అమలుచేస్తే టిటిడిలో 6,700మంది ఉద్యోగులుండగా వారిలో 2,500నుండి 3వేలమంది వరకు మహిళ ఉద్యోగులు ఉన్నారు. ఐదారువందల మంది వరకు మహిళ ఉద్యోగులు తిరుమలలో విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తిరుపతిలో కాపురముంటూ తిరుమలలోనే పారిశుధ్యం, గదుల శుభ్రత,ఆరోగ్యవిభాగంలో పనిచేస్తున్న మహిళలు ఉన్నారు. ఇప్పుడు వీరందరికీ ఆయా ఏజెన్సీలు మూడునెలలకోసారి ఆర్టీసి బస్సుపాస్‌లు జారీచేస్తున్నారు .దీనికి సంబంధించిన నగదుమొత్తాన్ని వారి జీతం నుండి మినహాయింపు చేసుకుని పాస్‌లు మంజూరు చేయిస్తున్నారు. ఈ బస్సుపాస్‌లు కలిగిన ఉద్యోగులు, సిబ్బంది మొత్తం పలు సమయాల్లో తిరుమల-తిరుపతి, తిరుపతి- తిరుమల మధ్య ప్రయాణిస్తున్నారు. ఘాట్‌లో ఉచిత ప్రయాణం అంటే టిటిడిలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగినులతో ఆర్టీసికి నష్టం వస్తుందని ఆర్టీసి యూనియన్ వర్గాలు అభిప్రాయం. మరీ తిరుమల సప్తగిరి బస్సుల్లో "జీరోఫేర్" టిక్కెట్ మాట సందిగ్ధంగా మారింది. ఆర్టీసి అధికారులు మాత్రం ఈ విషయంపై అధికారికంగా జిఒ రాలేదని చెబుతున్నారు.

## కుప్పంకు జగన్ నీళ్లిస్తే చంద్రబాబు తన ఖాతాలో వేసుకున్నారు
### మాజీ మంత్రి అంబటి రాంబాబు

**విజయవాడ,ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి:** కుప్పంకు జగన్‌మోహన్ రెడ్డి నీళ్లిస్తే చంద్రబాబునాయుడు తన ఖాతాలో వేసుకుంటున్నాడని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎవరు మంచి పనిచేసినా అది తనదేనని క్రెడిట్ వేసుకోవడంలో చంద్రబాబు దిట్టని తెలిపారు. శ్రీశైలం నుండి కుప్పం 720 కిలోమీటర్లు ఉంటుందని, 15 నెలలకాలంలో 560 కిలోమీటర్ల కాల్వ తవ్వి నీళ్ల తీసుకెళ్లినట్లు చెబుతున్నారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉండగా చంద్రబాబు కప్పానికి ఎందుకు నీళ్ల తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. 14 ఏళ్లలో ఆ పని చేయలేదని, జగన్ చేస్తే తాను చేసినట్లు చెప్పుకుంటున్నాడని అన్నారు.

## పార్లమెంటు ఆవరణలో జగన్నాథ రథ చక్రాలు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** పార్లమెంటు ఆవరణలో ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాథ రథచక్రాలు పార్లమెంటు ఆవరణలో ఏర్పాటుకానున్నాయి. ఇందుకు సంబంధించి పార్లమెంటుస్పీకర్ ఓం బిర్లా ఆమోదించినట్లు జగన్నాథ రథ మందిర చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పధీ తెలిపారు. ఇందుకు సంబంధించి లోక్‌సభ స్పీకర్ జగన్నాథ మందిర సందర్శన సందర్భంగా ప్రతిపాదనను అందచేసామని ఇందుకు స్పీకర్ సంతోషంగా స్వాగతించారని ఆయన అన్నారు. ఇదే ప్రతిపాదనను అంతకుముందే ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ మాఝీ, న్యాయశాఖమంత్రి పృథ్వీరాజ్ హరిచందన్‌లతో కూడా చర్చించినట్లు ఆయన తెలిపారు. బలభద్ర రథం కూల్చివేసిన తర్వాత ఆ రథ చక్రాలు, అలాగే దేవిసుభద్ర రథం దర్పదలాన రథాన్ని పూర్తిగా వేరుచేసామని జగన్నాథుని రథం భాగాలను వేరుచేసే ప్రక్రియ ప్రారంభించామని చీఫ్ అడ్మినిస్ట్రేటర్ తెలిపారు. ఈ రథచక్రాలను వేరుచేసే కార్యక్రమం పూర్తిచేసిన తర్వాత ఢిల్లీ కొత్తపార్లమెంటు ఆవరణకు వీటిని అత్యంత భద్రత మధ్య తరలిస్తామని, పార్లమెంటు ఆవరణలో నిర్దేశిత ప్రాంతంలో ఈ జగన్నాథ రథచక్రాలను ఏర్పాటుచేసే విధంగా స్పీకర్ తమకు అంగీకారం తెలిపినందున విశ్వవిఖ్యాత జగన్నాథ రథచక్రాలు ఇకపై పార్లమెంటు ఆవరణలో కూడా దర్శనమిస్తాయని ఆయన అన్నారు.

## నిరంతరాయంగా 9 రోజులు భరతనాట్య ప్రదర్శన
### 216 గంటల ప్రదర్శనతో ప్రపంచ రికార్డు సాధించిన విదుషి దీక్ష

**ఉడిపి(కర్ణాటక), ఆగస్టు 30:** ప్రముఖ భరత నాట్యకళాకారిణి విదుషి దీక్ష నిరంతరాయంగా 216 గంటలపాటు నృత్యప్రదర్శన ఇచ్చి కొత్త ప్రపంచ రికార్డును నమోదుచేసింది. గతంలో 170 గంటల రికార్డును కూడా ఆమె అధిగమించారు. ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభించిన ఈ రికార్డు ఆగస్టు 30న ముగిసింది. తొమ్మిదిరోజులపాటు నిరంతరాయంగా నృత్యంచేసిన మారథాన్ తర్వాతనే ఈ ప్రదర్శన జరిగింది. బ్రహ్మావర్ తాలూకాలోని ముండింజిడ్డుకు చెందిన దీక్ష భరత నాట్యంలో గొప్ప శిఖరాలను చేరుకోవాలనిచాలాకాలంగా ఆకాక్షంతో ఉంది. ఈ దీక్షతోనే ఆమె కఠినమైన తొమ్మిదిరోజుల లక్ష్యాన్ని పూరినతచేసేలా పురికొలిపింది. ఈనెల 28వ తేదీకల్లా ఆమె 170 గంటలప్రదర్శన పూర్తిచేసింది. మంగళూరుకు చెందిన రెమోనా ఎవెట్ పెరేరా నెలకొల్పిన గత రికార్డును బ్రేక్‌చేసింది. పెరేరా 170 గంటలపాటు నృత్యప్రదర్శనచేసి గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయింది. ఇపుడు దీక్ష రికార్డుప్రయత్నానికి ఉడిపి మాజీ ఎమ్మెల్యే కె.రఘుపతిభట్ మార్గదర్శకత్వంలో మణిపాల్‌లోని రత్న సంజీవకలామండల మద్దతు పుష్కలంగా లభించింది. శనివారం దీక్షను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ ఘనంగా సత్కరించారు. ఈరోజు ఉడిపిలో ఉండటం నాకు చాలా సంతోషంగా ఉందని, ఇక్కడి ఆలయాన్ని సందర్శించడకూడా నా చిరకాల స్వప్నం అని అన్నారు.

## పెట్టుబడి కేంద్రంగా అమరావతి

>> ప్రదర్శించబడతాయని తెలిపారు. దేశం నలుమూలల నుంచే కాక విదేశాల నుంచి కూడా పెట్టుబడిదారులు, అభివృద్ధిదారులు, ఎన్ఆర్ఐలు, విధాన నిర్ణేతలు హాజరవుతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గోతు సిరీష, ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి. సూర్య ప్రవీణ్, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫ్ రాజ్ అహ్మద్, నారెడ్కో జాతీయ అధ్యక్షుడు జి. హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. చక్రధర్, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ,రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పారుచూరి తదితరులు హాజరయ్యారు.

## శివశంకర్ ఐఎఎస్‌ను ఎపికి కేటాయిస్తూ కేంద్రం ఆదేశాలు!

**విజయవాడ, ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి:** లోనీ తేటి శివశంకర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలంటూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు కేంద్ర పరిపాలన శాఖ చేసింది. తక్షణమే శివశంకర్‌ను రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు. జారీ చేసింది.దీంతో ఆంధ్రాకు రావాలనే ఆకాంక్షతో న్యాయపోరాటం చేస్తున్న తేటి శివశంకర్ ఆకాంక్ష నేరవేరబోతుంది.

## రౌడీ షీటర్ల కుట్ర

>>డబ్బు ఇస్తామనడం వల్ల, ఎవరు వారికి డబ్బు ఇస్తా రో బయటపడాలనన్నారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపి నిజాన్ని వెలికితీయాలని పోలీసు శాఖను కోరారు. నాపై ఈ హత్య కుట్ర వెనుక ఎవరు న్నారు తెలియకపోయినా వైసిపి నాయకులు దొంగ ఎవరంటే భుజాలు చందంగా వ్యవహరిస్తున్నారని వైఎస్ఆర్సిపి సోషల్ మీడియాలో సాక్షి ఛానల్‌లో పత్రికలో అడ్డగోలు రాతలకు రాస్తున్నారని విమర్శించారు. ప్రజలకు జవాబిదారి తరంగా ఉండాల్సిన వైసీపీ నేతలు అసెంబ్లీకి రాకుండా తప్పించుకుంటున్నారని, తిరుగుతూ ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. రాజకీయాల్లో పార్టీ కోసం కుటుంబ సభ్యులను కూడా ఎదురుదాడి చేయడం వైఎస్ఆర్సిపి నాయకుల డిఎన్ఏలో ఉందని తీవ్రంగా విమర్శించారు. బెదిరింపులకు భయపడనని, విద్యార్థి నాయకుడిగా ఉండగా రౌడీలను ఎదుర్కొన్న అనుభవం తనదని చెప్పారు. వైసిపి పార్టీ నుంచి బయటకు వచ్చిన సమయంలో కూడా తాను, తన కుటుంబ సభ్యులు బెదిరింపులకు గుంయ్యారని వివరించారు.బండికి కట్టి తీసుకుపోయి హత్య చేస్తా అని బెదిరింపులు వచ్చినప్పటికీ లెక్క చేయలేదు అన్నారు, కార్యకర్తల కోసం ఎంతటి ప్రమాదమైనా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. తనపై ఎన్ని వీడియోలు అయినా వైసీపీ సోషల్ మీడియాలో ఉంచినా,కార్యకర్తలు, ప్రజలు తనపై విశ్వాసంతో ఉన్నారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న చంద్రబాబును చూసి వైసీపీ నేతలు అసహనానికి గురవుతున్నారని వ్యాఖ్యానించారు. తనను చంపితే డబ్బు ఇస్తామన్న వారి ఎవరో పోలీసు శాఖ గుర్తించాలి అని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేసారు.

## వారం - వర్జ్యం

31-08-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
అష్టమి రా.12.58
అనూరాధ సా.5.27
వర్జ్యం : రా.11.35-1.21
దు.సా.4.39-5.29
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాలలో ఉన్న మీవారికి సహాయసహకారాలు అందిస్తారు.

**వృషభం:** నూతన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. మిత్రులనుండి శుభవార్తలు అందుకుంటారు.

**మిథునం:** ఇంటర్వ్యూలలో, పోటీ పరీక్షలలో విజయంసాధిస్తారు. ఊహించని అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి.

**కర్కాటకం :** సంఘంలో గౌరవ ప్రతిష్టలు పొందుతారు. ఇంటా బయటా అనుకూల వాతావరణం లాభిస్తాయి.

**సింహం:** నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగులు పదోన్నతులు పొందుతారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

**తుల :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.

**వృశ్చికం:** ఆర్థికపరమైన లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి.

**ధనుస్సు:** భూములు, ఇళ్లు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**మకరం:** కుటుంబసభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. ఋణాలు తీరుస్తారు.

**కుంభం:**ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తిచేస్తారు. బంధువలనుండి శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** సకుటుంబంగా వివాహాది శుభకార్యాలకు హాజరవుతారు. చర్చాగోష్టులలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాయలసీమను అగ్రగామి చేస్తా

>> పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజలు రప్పారప్పా చేశారని పేర్కొన్నారు. తాను ఏ పని కావాలన్నా తమ ఇంటిదైవం శ్రీవెంకటేశ్వరస్వామికి చెప్పుకుని బుల్లెట్‌లా దూసుకుపోతానని వెనుతిరిగే ప్రసక్తే ఉండదన్నారు. దివంగత ఎన్టీఆర్ సిఎంగా ఉన్నపుడు సీమకు సముద్ర జలాలు తేవాలని సంకల్పించారన్నారు. పాతికేళ్ల క్రిత ం రాయలసీమ ప్రాంతంలో పదేళ్లు పంట చేస్తే రెండేళ్లు మాత్రమే చేతికందేదని ఎడారి ప్రాంతంగా ఉండేదన్నారు. 1999లో తాను హంద్రీ-నీవా ప్రాజెక్టును ప్రారంభించానని పేర్కొన్నారు. 2014-19లో రాయలసీమ ప్రాజెక్టులకు 12500కోట్లు వ్యయం చేశామన్నారు. రైతులకు నీళ్ల ఇస్తే కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ప్రతి ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తమదేనన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసేది ఎన్డీయే ప్రభుత్వం అన్నారు. కృష్ణాజలాలతో 6లక్షల ఎకరాల పంటసాగుకు 32లక్షల మందికి తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లను ముందుచూపుతో నీటిని నింపుతామన్నారు.

**వృథా జలాలపై తెలంగాణా నేతలు ఆలోచించాలి**

ఏటా 1630టిఎంసిల మేర గోదావరి, 600టిఎంసిల మేర కృష్ణాజలాలు సముద్రం పాలవుతున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ జలాలను వాడుకుంటే ఎపి, తెలంగాణాల్లో రాష్ట్రాల్లో కరువు ఉండదన్నారు. ఈ అ ంశంగా తెల ంగాణా నేతలు ఆలోచించాలని పేర్కొన్నారు. బనకచర్ల - పోలవరం ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం జరగదని పేర్కొన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజె క్టును 2027నాటికల్లా పూర్తి చేస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. 2020నాటికే పోలవరం పూర్తి కావాల్సి ఉండేదన్నారు. ప్రాజెక్టు దయాఫ్రంవాల్ వైఎస్సార్సీ పాల నలో కొట్టుకుపోగా మరలా 1000కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వంశధార, పెన్నా పనుల అనుసంధానం చేయడ ం తమ జీవిత ఆశయమని పేర్కొన్నారు.

**సూపర్ సిక్స్ సూపర్‌హిట్ చేశాం**

రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను సూపర్‌హిట్ చేశామని సిఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పెన్షన్లు, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, మెగా డిఎస్సీ, మహిళలకు దీపం పథకంలో ఉచిత సిలిండర్లు, స్త్రీ శక్తి పథకంలో ఉచిత బస్సు ప్రయాణాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏడాది పాలనలోనే 10లక్షల కోట్ల ఎంఒయులు వివిధ పరిశ్రమలతో కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా కుప్పం ప్రాంతంలో దాదాపు 4వేలకోట్లతో ఏర్పాటయే పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామికవేత్తలతో ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సమక్షంలో ఎంఒయులు జరిగాయి. కార్యక్రమాల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర విద్య,మౌలిక వసతుల కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడ సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో

# పి-4కు విస్తృత ప్రచారం

>> వస్తున్నాయి. ఆర్థిక సంస్కరణల వల్లే ఇది సాధ్యమైంది. 1995లో టెక్నాలజీలో వచ్చిన సంస్కరణల ద్వారా ఫలాలను అందిపుచ్చుకున్నాం. ఆర్థిక సంస్కరణలను కొందరు అందిపుచ్చుకున్నారు. కొందరు వెనుకబడ్డారు. సంస్కరణలను అందిపుచ్చుకున్న వారు ఉన్నత స్థానానికి చేరారు. అంబేద్కర్, ఎన్టీఆర్, అబ్దుల్ కలాం, మోదీ వంటి వారు సామాన్య కుటుంబాల్లోనే పుట్టారు. నాతో సహా అనేక మంది సాధారణ మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చారు. నాడు సమాజం నుంచి ఎంతో సహకారాన్ని అందుకున్నాం.. ఉన్నతస్థితికి చేరాం. ఇప్పుడు అసమానతలు లేని సమాజం కోసం భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది. ఉన్నత స్థానంలో ఉన్నవారు చేసేది చిన్న సాయమే కావచ్చు.. పేదరికంలో ఉన్నవారికి ఆ సాయమే అతి పెద్ద ఆలంబనగా ఉంటుంది." అని చంద్రబాబు చెప్పారు.మాటలు చెప్పడం కాదు.. చేతల్లో చేసి చూపించాలనే ఉద్దేశంతో నేను కూడా 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. మార్గదర్శిగా నిలిచాను. బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు నా సహచర మార్గదర్శకులతో పోటీ పడతా. ఇప్పటి వరకు 10,81,281 మంది కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. అనేక సంస్కరణలు వచ్చినా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా.. ఇంకా పేదరికం ఉంటూనే ఉంది. పేదరిక నిర్మూలన చేపట్టాలనే ఆలోచన నుంచే పీ4 పుట్టింది. ఎంత సంపాదించినా ఇక్కడే వదిలి పెట్టి వెళ్లాలి.. అందుకే గివ్ బ్యాక్ పాలసీని అమలు చేయగలిగితే...సమాజానికి మరింత మంచి చేసిన వాళ్లు అవుతారు. పేదరికంలో ఉన్నవాళ్లకి చేయూతనివ్వాలి.. వాళ్లకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలి. సరైన సమయంలో గైడ్ చేయగలిగితే.. పేదరికంలో ఉన్న వాళ్లు కూడా మంచి స్థాయికి వెళ్లడానికి అవకాశం కల్పించినవారవుతారు. ప్రాధాన్యత క్రమంలో బంగారు కుటుంబాలకున్న అవసరాలపై సర్వే చేయించాం. ప్రభుత్వం వైపు నుంచి చాలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పింఛన్ ఇస్తున్నాం, తల్లికి వందనం ఇచ్చాం, దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఆర్థిక సాయం చేస్తున్నాం. అలాగే ఆగస్టు 15వ తేదీ నుంచి స్త్రీ శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందివ్వనున్నాం. ప్రభుత్వ పరంగా మేం చేయాల్సిందంతా చేస్తున్నామన్నారు.ఉన్నత స్థితిలో ఉన్నవారు కూడా బాధ్యత తీసుకుంటే దత్తత కుటుంబాల్లో స్కిల్స్ పెంపొందించడం ద్వారా వారి ఆదాయాన్ని రెట్టింపు చేయవచ్చు. బంగారు కుటుంబాలను కూడా మీ కుటుంబాలుగా భావించి సాయం చేయండి." అని చంద్రబాబు కోరారు.

సమాజంలో మనతో ఉన్నవాళ్లు.. పేదరికంతో ఇబ్బందులు పడుతూ ఉండడం మంచిది కాదు. అవనిగడ్డలో ఓ పారిశుధ్య కార్మికురాలు కూడా మార్గదర్శిగా ఉండేందుకు ముందుకు వచ్చి.. ఓ పేద వృద్ధురాలిని ఆదుకునేందుకు సిద్ధమైంది. నేను ఎవర్ని బలవంతం పెట్టడం లేదు. బాధ్యతగా చూడాలనే చెబుతున్నాను. సాయం చేయడంలో రకరకాలు ఉంటాయి.. ఇటీవల కాలంలో కొందరు టీచర్లు ముందుకు వచ్చారు. చదువు చెప్పడం ద్వారా పేదల ఎదుగుదలకు తోడ్పడతామని చెబుతున్నారు. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని కోస్పాన్సర్స్ విధానాన్ని తెస్తున్నాం. ఆర్థిక సాయంచేసే వారు చేస్తారు.విజ్ఞానాన్ని అందించేవారు కూడా ఆ దిశగా కృషి చేస్తారు. ఉమ్మడి ఎపికి విజన్ 2020 రూపకల్పన చేశాను. నన్ను విమర్శించారు. కానీ ఇప్పుడు ఆ విజన్ నిజమైంది. లక్ష్యంతో పని చేస్తే ఏదైనా సాధ్యం. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలుగువారిని ప్రపంచంలో అగ్రభాగాన నిలబెట్టే ఆలోచనలు చేస్తున్నాం. దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. త్వరలోనే భారత్ ప్రపచంలో మూడో పెద్ద ఎకానమీగా ఎదగబోతోంది. భవిష్యత్తులో భారత దేశం ఎకానమీలో నెంబర్1 స్థానంలో ఉంటుంది. అభివృద్ధి ఫలాలు అందరికి అందాలనే ఉద్దేశంతో సంస్కరణలు అమలు చేస్తున్నాం." అని చంద్రబాబు వివరించారు.



చైనాలోని టియాంజిన్‌లో శనివారం ప్రధానమంత్రి మోడీకి స్వాగతం పలుకుతున్న కళాకారులు

# చైనాలో ప్రధాని మోడీ

>> సంవత్సరం అక్టోబరులో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యాక ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధ్యాల పునరుద్ధరణ జరిగింది. నేరుగా విమాన సర్వీసులు, కైలాస్ మానససరోవర్ యాత్రను పునరుద్ధరించేందుకు ఈ సంవత్సరం జూన్‌లో ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ ఎస్ఇఒ సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాలకు చెందిన దాదాపు 20 మందికిపైగా ప్రపంచ నాయకులకు ఆహ్వానం అందింది.

# మనిషి ఆవేశమే జనసేన

>> ఒడిదుడుకులు ఎదుర్కొని ఇంత ఎత్తుకు ఎదిగానని ఆయన చెప్పారు. 12 సంవత్సరాల తర్వాత తన పార్టీ, క్యాడర్ తలెత్తుకునేలా చేశానని ఆయన చెబుతూ పార్టీ ఆవిర్భావంలో కేవలం 150 మంది కార్యకర్తలు మాత్రమే ఉండే వారిని ఇప్పుడు 12 లక్షల మంది క్రియాశీలక సభ్యులతో పార్టీని నడిపిస్తున్నామని పవన్ కళ్యాణ్ చెప్పారు. ప్రత్యర్థి పార్టీ తనపై ఎన్ని కుట్రలు పండినప్పటికీ వాటిని తట్టుకొని బలం పెంచుకున్నానని పవన్ కళ్యాణ్ వివరించారు. కాలం, సహనం తన రాజకీయ ఎదుగుదలకు కారణమని అన్నారు. పార్టీని స్థాపించినప్పుడు తన పార్టీ గురించి దేశమంతా మాట్లాడుకుంటుందని అనుకోలేదని,కార్యకర్తలు, వీర మహిళలు,మేధావులు ఇచ్చిన ప్రోద్బలమే ఇందుకు కారణం అని పవన్ తెలియజేశారు. తుపాకీ పట్టుకుంటేనే సమాజం బాగుపడుతుంది అనుకోవటం సరికాదు. దానికి శాంతియుత మార్గాలు కూడా ఉన్నాయని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. గత పాలకుల చంపుతామని అనేకసార్లు తనను బెదిరించారు.

ఇప్పుడు వారిని ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పవన్ కళ్యాణ్ నొక్కి వక్కాణించారు.ప్రజల పట్ల అంకితభావం కలిగిన వారు మాత్రమే రాజకీయాలకు రావాలని అప్పుడే నాయకుల అవుతారని పవన్ చెబుతూ అలాంటి భావజాలం ఉన్నవారు ముందుకు వస్తే వారిని రాజకీయంగా ఎదిగేలా చేస్తానని చెప్పారు. నాయకులు కావాలనుకునేవారు ఇందుకు సిద్ధపడాలని పవన్ పిలుపునిచ్చారు. కాగా ఇకపై తాను సెంటర్ ఆఫీసులో కూర్చుని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకులను మానిటర్ చేస్తానని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత పాలకులు రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారని వారిని ఎదుర్కొనేందుకే జనసేన పార్టీని స్థాపించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నామని, ఈ పథకాలను ప్రజలకు కార్యకర్తలు వివరించాలని మనోహర్ సూచించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 450 కోట్ల రూపాయలతో ఋషి కొండపై ప్యాలస్ ను నిర్మించారని, ప్రజాధనం, పర్యావరణాన్ని నాశనం చేసి ఇంత భవంతిని నిర్మించటం అవసరమా అని మనోహర్ ప్రశ్నించారు.

## ఇజ్రాయెల్ దాడుల్లో హూతీల ప్రధాని అహ్మద్ రహావీ హతం

>> వెల్లడించారు. ఇరాన్‌మద్దతు ఉన్న హూతీ తిరుగుబాటుదారులు గాజా యుద్ధంనేపథ్యంలో పాలస్తీనియన్లకు మద్దతుగా ఇజ్రాయెల్‌పై దాడులుచేస్తోంది.

ఎర్రసముద్రంలో వాణిజ్యనౌకలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు పలు సందర్భాల్లో యెమెన్‌లోని హూతీలస్థావరాలపై భీకరదాడులుచేసాయి.

## అమరావతిలో సిఆర్డీఏ, నిక్‌మార్ ఆధ్వర్యంలో హెచ్ఎస్ఇఎం వర్క్‌షాప్ విజయవంతం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 30:** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపి సిఆర్డీఏ) ఆధ్వర్యంలో ఆగస్టు 29, 30 తేదీల్లో 'నిర్మాణ ప్రాజెక్టులలో ఆరోగ్య భద్రత, పర్యావరణ అంశాల నిర్వహణ(హెచ్ఎస్ఇఎం) పై అమరావతిలోని ఎస్ఆర్ఎంయూనివర్సిటీలో జరిగిన ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని నిక్‌మార్ యూనివర్సిటీ (ఎన్ఐసిఎంఎఆర్)తో సిఆర్‌డిఏ అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించే కృషిలో భాగంగా ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు తదితర భాగస్వాములకు నైపుణ్య వృద్ధిని అందించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఆగస్టు 30న జరిగిన కార్యక్రమంలో సిఆర్‌డిఏ కమిషనర్ కె. కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మొత్తంగా 165 మందికి పైగా అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిలో సిఆర్‌డిఏ అధికారులు, సిబ్బంది, పిజి ఎంసి ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, పిఎంసి ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల సిబ్బంది, రాజధాని పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఉన్నారు. కార్యక్రమంలో భాగంగా హాజరయ్యారు. అనంతరం భద్రతా ప్రతిజ్ఞ చేశారు. వర్క్‌షాప్‌లో కమిషనర్ మాట్లాడుతూ.. రాజ ధాని నిర్మాణంలో వరల్డ్ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఫండింగ్ సంస్థల నిబంధనలు, ప్రమాణాలను తప్పనిసరిగా పాటించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ అధికారులు, నిపుణుల నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి తోడ్పడిన హైదరాబాద్ నిక్‌మార్ యూనివర్సిటీ వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమగ్రమైన శిక్షణ షెడ్యూల్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన నిక్‌మార్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ డీన్ డా. సర్బేష్ మిశ్రా గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వర్క్‌షాప్ నిర్వహణకు సహకరించిన యూనివర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. రెండు రోజుల కార్యక్రమంలో చట్టపరమైన, నియంత్రణాత్మక ఫ్రేమ్‌వర్క్, మేనేజ్‌మెంట్ సిస్టమ్ అభివృద్ధి, భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించే విధానం తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డా. సర్బేష్ మిశ్రా, ఎం. కామరాజన్, ప్రొఫెసర్ విష్ణు నంబూదిరి, ఇండస్ట్రీ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీకర్ ఈ అంశాలపై సెషన్లను నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో పాల్గొనే ప్రతీ ఒక్కరి ఆరోగ్య భద్రత, పని ప్రాంతాలలో సమగ్రమైన భద్రత, పర్యావరణ సహితంగా ప్రాజెక్టు నిర్వహణప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.



## జపాన్ ప్రధాని దంపతులకు మోడీ స్పెషల్ గిఫ్ట్!

**టోక్యో, ఆగస్టు 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల జపాన్ పర్యటన శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాకు భారతీయ కళానైపుణ్యానికి, జపాన్ సంస్కృతికి అద్దం పట్టేలా ఒక అపురూపమైన బహుమతిని అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విలువైన మూన్‌స్టోన్ (చంద్రకాంత శిల)తో తయారు చేసిన రామెన్ గిన్నెల సెట్‌ను, వెండి చాప్‌స్టిక్‌లను ఆయన బహూకరించారు. ఈ బహుమతిలో జపాన్ సంప్రదాయ ఆహార పద్ధతులైన దొన్‌బురి, సోబాలను స్ఫూర్తిగా తీసుకున్నారు. ఈ సెట్‌లో ఒక పెద్ద బ్రౌన్ మూన్‌స్టోన్ గిన్నె, నాలుగు చిన్న గిన్నెలు, వెండి చాప్‌స్టిక్‌లు ఉన్నాయి. ఈ గిన్నెల తయారీకి వాడిన మూన్‌స్టోన్‌ను ఆంధ్రప్రదేశ్ నుంచి సేకరించడం విశేషం. ప్రధాన గిన్నె కింద భాగంలో రాజస్థాన్‌కు చెందిన సంప్రదాయ 'పార్చిన్ కారీ' శైలిలో మక్రానా మార్బుల్‌పై రత్నాలతో అలంకరణ చేశారు. అలాగే, జపాన్ ప్రధాని భార్యకు మోదీ కశ్మీరీ పశ్మీనా శాలువాను బహూకరించారు.

లడఖ్‌లోని చాంగ్‌తాంగి మేక ఉన్నితో కశ్మీరీ చేనేత కళాకారులు తయారు చేసిన ఈ శాలువా ఎంతో ప్రసిద్ధి చెందింది. దీనితో పాటు పూలు, పక్షుల డిజైన్లతో కూడిన అందమైన పేపియర్‌మాచే బాక్స్‌ను కూడా అందించారు. ఈ బహుమతులు కశ్మీర్ వారసత్వానికి, కళాత్మకతకు నిదర్శనంగా నిలుస్తాయి. అంతేకాకుండా ప్రధానిమోడీ జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో కలిసి కలిసి టోక్యో నుంచి సెందాయ్ నగరానికి వెళ్లారు. ఈ ప్రయాణాన్ని ప్రధాని ఆస్వాదించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.



## సామూహిక వినాయక నిమజ్జనాలను విజయవంతం చేద్దాం

### - తిరుపతిలో వినాయక కమిటీ ర్యాలీ

**తిరుపతి,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో వెయ్యికిపైగా కోలువు దీర్చిన వినాయకుని విగ్రహాలను ఐదవరోజు ఆదివారం (నేడు) సామూహిక నిమజ్జనం జరిపేందుకు వరసిద్దివినాయక మహోత్సవ కమిటీ పిలుపునిచ్చింది. ఈ విగ్రహాల నిర్వాహకులు మండపాల నుండి నిర్ణీత సమయంలోనే ఊరేగింపుగా భజనలతో. భక్తిపాటలతో బయలుదేరాలని కోరారు. సామాహిక వినాయక విగ్రహాల నిమజ్జనం విజయవంతం చేయాలని కోరుతూ తిరుపతి.

## సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల కట్టడి



**- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన - డిజిపి హారీష్‌కుమార్ గుప్తా**

**తిరుమల,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీసులు సాంకేతికతను విని యోగించుకుని చాలావరకు నేరాలను కట్టడి చేయగలుగుతున్నారని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్‌గుప్త తెలిపారు. ప్రధానంగా విపరీత మవుతున్న సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా పోలీసులు పనితీరు బావుందన్నారు. ప్రజలు సులభంగా మోసగాళ్ళ మాటలకు నమ్మి మోసపోతున్నారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ మోసగాళ్ళకు చెక్‌పెట్టేలా చర్యలు తీసు కుంటున్నామన్నారు. రెండు రోజుల తిరుపతి,తిరుమల పర్య టనలో భాగంగా శనివారం ఉదయం డిజిపి హరీష్ కుమార్‌గుప్త శ్రీవారి ఆలయం లోనికి చేరు కున్నారు. ఆలయ మహా ద్వారం వద్ద తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్‌ఒ మురళీ కృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, సిఐ విజయ కుమార్ స్వాగతం పలికారు. ఆలయం లోనికి చేరుకున్న డిజిపి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం తిరుమలలో ఇరవైరోజుల్లో మొదలుకా నున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భద్రత, భక్తులకు సేవలపై సమీక్షించారు.

## తిరుమల సమాచారం

### తిరుప్పావై ఉపన్యాసాలకు ఆహ్వానం



**తిరుమల,ఆగస్టు 30ప్రభాత వార్తప్రతినిధి:** పవిత్రమైన ధనుర్మాసంలో టిటిడి దేశంలోని వివిధ అనుబంధ ఆలయాల్లో తిరుప్పావై ఉపన్యాసాలు చేసేందుకు వైష్ణవ సిద్దాంతం తెలిసిన పండితుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టిటిడి తెలిపింది. అంగీకారపత్రాలు కూడా అందజేయాలని తెలిపింది. టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా ధనుర్మాసంలో తిరుప్పావై ఉపన్యాసాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1వతేదీ నుండి 30వతేదీ సాయంత్రం లోపు "ప్రత్యేక అధికారి, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు,టిటిడి తిరుపతి"అనే చిరునామాకు దరఖాస్తులు, అంగీకారపత్రాలు పంపాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు ప్రాజెక్టు కార్యాలయం 9676120226, 8978734947 నంబర్లద్వారా సంప్రదించాలని టిటిడి తెలిపింది.

## చేనేతకు చేయూత.. వస్త్ర వైభవానికి ప్రతీక

**విజయవాడ,ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ సంప్రదాయాల్లో పట్టు వస్త్రాలు ప్రత్యేక ముద్రను సంతరించుకున్నాయని ప్రముఖ సామాజిక సేవకురాలు.విజయవాడ ఎంపీ సతీమణి కేశినేని జానకీ లక్ష్మీ అన్నారుఎంతోమంది కళాకారులు తమ కళా నైపుణ్యంతో రూపొందించిన పట్టు వస్త్రాలకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వేదికైందని, నేతన్నలే నేరుగా అమ్మకాలు నిర్వహించడం ద్వారా బయటికంటే తక్కువ ధరకు వినియోగదారులకు అందుబాటులోకి వస్తున్నాయని శేనకీ లక్ష్మీఅన్నారు. ఆంధ్ర చేనేత, జౌళి శాఖ సహకారంతో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఆధ్వర్యంలో స్థానిక ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన సిల్క్ ఎక్స్‌పోను శనివారం పార్లమెంటు సభ్యులు కేశినేని జానకీ లక్ష్మీ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పట్టు వస్త్రాల స్టాళ్లను తిలకించారు. అనంతరం సభ ఆమె మాట్లాడుతూ వస్త్రాభిమానులను అలరించేలా ఏర్పాటుచేసిన ఎక్స్‌పోతో బెనారసి, పశ్చిమబెంగాల్ బొటిక్ ఐటెమ్స్, టస్సార్ కాంత, చందేరి, కోటా, రాజ్‌కోట్ పటోలా, గద్వాల్, కళంకారి, కాంచీపురం, వెంకటగిరి, ఉప్పాద జాంధానీ.. ఇలా వివిధ కళాత్మక వస్త్రాలను ఒకే వేదికపై వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. దేశ వ్యాప్తంగా 14 వీవింగ్ క్లస్టర్ల పరిధిలోని కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అత్యద్భుతమైన డిజైన్లకు ఈ ప్రదర్శన చిరునామాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను నగర వస్త్ర ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో నిర్వాహకులు,

సెంట్రల్ సిల్క్ బోర్డు విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ గ్యాలరీ సెప్టెంబర్ 2వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని.. ఈ ప్రదర్శనకు పెద్దఎత్తున వస్త్ర ప్రియులు వస్తున్నారని.. 100 శాతం చేనేత వస్త్ర ఉత్పత్తులకు ఇది వేదిక అని తెలిపారు. వివాహాలు, దసరా, దీపావళి వంటి పండగల నేపథ్యంలో ఈ ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. దేశంలో ఒక్కో ప్రాంత కళాకారులది ఒక్కో అద్భుత శైలి అని.. అన్ని ప్రాంతాల కళాకారుల చేతిలో తయారైన వస్త్రాలను ఒకేచోట అందుబాటులో ఉంచడం ద్వారా ఆయా ప్రాంతాల నేత కళాకారులను ప్రోత్సహించడంతో పాటు వస్త్ర ప్రియులకు తక్కువ ధరల్లో మంచి వస్త్రాలను అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. ఇలాంటి వస్త్రాలకు మద్దతివ్వడం ద్వారా మన ఘన చేనేత వైభవాన్ని భావి తరాలకు వారసత్వ సంపదగా అందించేందుకు వీలవుతుందని వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో బ్రాండ్ అంబాసిడర్ పి.దీపిక, మహిళా పారిశ్రామికవేత్త సజ్జా మంజుల పాల్గొన్నారు.

## పదవీవిరమణకు ముందే అనారోగ్యంతో టిటిడి ఎఇఒ మృతి

**తిరుపతి,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని కొలువులో సేవాభావంతో అంకితభావంగా సుదీర్ఘకాలం విధులు నిర్వహించి, శేషజీవితాన్ని ఆనందంగా గడపాల్సిన ఓ టిటిడి ఉద్యోగి పదవీవిరమణకు రెండురోజులు ముందే అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ ఉదంతం శనివారం వెలుగుచూసింది. టిటిడిలో కపిల తీర్థం ఆలయంలో ఎఇఒగా కోనేటి సుబ్బరాజు విధులు నిర్వహిస్తున్నాడు. స్వామివారి పట్ల అచంచల భక్తివిశ్వాసాలు కలిగి ఉండేవాడు. భక్తుల పట్ల కూడా ఆయన మాటతీరు ఎంతో ఆప్యాయంగా ఉండేది. అంతేగాక ఆయన జీవితం కూడా నాటకరంగంలో ఎన్నో అద్భుతమైన ఘట్టాలు ప్రదర్శించాడు. కళాకారుడుగా కూడా ఉన్న సుబ్బరాజు రంగస్థలనటుడుగా ఎందరో కళాకారులకు ఆదర్శంగా నిలిచాడు. ఆయన చికిత్సపొందుతూ గురువారం రాత్రి అనారోగ్యంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబసభ్యులుతెలిపారు.

## పెరుగుతున్న శివయ్య హుండీల రాబడి

**శ్రీకాళహస్తి,ఆగస్టు 30 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరుని హుండీల రాబడి పెరుగు తుంది.ఈ నేపథ్యంలో ఆగస్టు నెల లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించారు.నెల రోజులకు హుండీల ద్వారా వచ్చిన కానుకలను యూనియన్‌బ్యాంకు సహాయంతో ఇఒ డి.బాపిరెడ్డి,డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డిల పర్యవేక్షణలో మందుకొట్టు మండపం లో లెక్కించారు. నగదు రూపంలో రూ.1,82,17,085లు వచ్చినట్లు ప్రకటించారు. కాగా రాహుకేతుదోష నివారణ పూజలకు ఉపయోగించే వెండి నాగపడగల రూపంలో 510. 600 కిలోలు వచ్చినట్లు ప్రకటించారు. అలాగే అమెరికాకు చెందిన డాలర్లు 65 మలేషియా కరెన్సి 119 నోట్లు, ఖత్తర్‌కు చెందిన నోట్లు 30,కెనాడాకుచెంది నకరెన్సి 19న ఓట్లు ఇతర దేశాలకు చెందిన 32 వెరసి 265 నోట్లు వచ్చినట్లు వివరించారు.లెక్కింపులను ఎఇఓలు విద్యాసాగర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి,హేమామాలిని, రవి, శ్రీహరి, నాగభూషణంయాదవ్, విజయ సారధి, లావణ్య సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందని ఇఓ బాపిరెడ్డి వివరించారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చే వారిలో 60శాతం వరకు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వస్తున్నారన్నారు. ఇక్కడకు వచ్చే భక్తులకు సత్వర,సుదర్శనం ఏర్పాటు చేస్తున్నామన్నారు.బస సదుపాయాలతో పాటు సకల సదుపాయాలు కల్పిస్తున్నామని ఇఓ బాపిరెడ్డి వివరించారు. రాబోవు రోజులు ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తిరుమల తరహాలో తీర్చి దిద్దుటకు చర్యలు తీసుకుంటున్నామని ఇఓ బాపిరెడ్డి వివరించారు.

## మరో 4వేల మంది యాత్రికులకు అన్ని హంగులతో వేంకటాద్రి నిలయం వసతి

**తిరుమల,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తులకు అదనంగా మరో 4వేలమందికి వసతి కల్పించేందుకు పిఎసి 5(యాత్రికుల వసతి సముదాయం) వేంకటాద్రి నిలయం సిద్ధమైంది. ఈ వసతి సముదాయం భవనంలో దాదాపు ఐదువేలమంది వరకు సర్దుబాటు చేసుకునే దిశగా విశాలమైన హాళ్ళు, చంటి పిల్లలకు పాలుత్రాగించే ప్రత్యేక గదులు, అన్నప్రసాద వితరణ కేంద్రం ఉన్నాయి. శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులకు వేంకటాద్రి నిలయం యాత్రికుల ఉచిత సముదాయం అందుబాటులోకి రానుంది. ఈ భవనాన్ని శనివారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ నాయుడు మాట్లాడుతూ వేంకటాద్రి నిలయం యాత్రికుల ఉచిత సముదాయం తుదిదశ పనులు జరుగుతున్నాయన్నారు. 102కోట్ల రూపాయల వ్యయంతో ఐదు అంతస్థులు ఉచిత సముదాయాన్ని నిర్మించడం జరిగిందన్నారు. 2018లో అప్పటి టిటిడి బోర్డు నిర్ణయం మేరకు పిఎసి 5 నిర్మాణంపై నిర్ణయం తీసుకుని ఈ పనులు సాగాయన్నారు. ఇందులో 2,500మంది యాత్రికులకు అదనంగా వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. మరో వెయ్యిమంది వరకు సర్దుబాటు చేసుకునేలా విశాలమైన హాళ్ళు, డార్మిటరీలు, లాకర్లు ఉన్నాయన్నారు. 216 మరుగుదోడ్లు, 216 స్నానపు గదులు, రెండు కల్యాణకట్టలు, జలప్రసాదాలు, ప్రధమచికిత్సా కేంద్రాలు, అన్నప్రసాద భవనం సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం తిరుమలలో 45వేలమంది భక్తులకు మాత్రమే వసతి సదుపాయం కల్పించే వీలుందన్నారు. వేంకటాద్రినిలయం అందుబాటులోకి వస్తే 3వేలమంది వరకు భక్తులు ఇక్కడ విశ్రాంతి,వసతి పొందే వీలుకలుగుతుందన్నారు.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు ,భద్రత కల్పించడం జరిగిందన్నారు. ఎంతో అద్భుతంగా ఈ భవనం నిర్మాణం చేపట్టారన్నారు. అనంతరం పిఎసి 5లోని మరుగుదోడ్లు, గదులు, లాకర్లను, కల్యాణకట్టలను స్వయంగా ఛైర్మన్ నాయుడు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ సత్యనారాయణ, ఇఇలు వేణుగోపాల్, శ్రీనివాసరావు, సుధాకర్, డిప్యూటీ ఇఒలు రాజేంద్ర, సోమన్నారాయణ, డిఇ చంద్రశేఖర్,, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒ సురేంద్ర ఉన్నారు.

### నాగార్జున విశ్వవిద్యాలయంలో పబ్లిక్ పాలసీ కోర్సు దరఖాస్తుల గడువు పొడిగింపు

**విజయవాడ, ఆగస్టు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రవేశాల డైరెక్టర్ డా. పి. బ్రహ్మాజీ రావు ప్రకటించిన ప్రకారం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎం.ఏ. పబ్లిక్ పాలసీ (బి.ఏ.+ఎం.ఏ.) కోర్సు కోసం దరఖాస్తుల సమర్పణకు గడువును 2025-26 విద్యాసంవత్సరానికి పొడిగించారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ సమన్వయంలో అమలు అవుతున్న ఈ వినూత్న కార్యక్రమం, ఇంటర్మీడియేట్ (+2) అనంతరం సివిల్ సర్వీసెస్ (యు పి ఎస్ సి ), ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవ్వదలచిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడింది. ఈ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులు పబ్లిక్ పాలసీ, గవర్నెన్స్, సంబంధిత రంగాలలో గట్టి విద్యా పునాదిని అందిపుచ్చుకోవడంతోపాటు, సమకాలంలోనే పోటీ పరీక్షలకు కూడా సిద్ధమయ్యే అవకాశం పొందుతారు. పునః సవరించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల సమర్పణకు లేట్ ఫీజు లేకుండా గడువు సెప్టెంబర్ 6, 2025 వరకు.

## ఆంధ్రప్రదేశ్ డ్రా ఆఫ్ లాట్స్ ద్వారా 466 బార్ల కేటాయింపు

**విజయవాడ, ఆగస్టు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త బార్ పాలసీ 2025-28 ప్రకారం 466 బార్లకు (388 ఓపెన్ + 78 రిజర్వ్) డ్రా ఆఫ్ లాట్స్ శనివారం ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయి, ఎంపికైన వారికి సమాచారం అందించబడింది. అయితే 37 ఓపెన్ బార్లు, 3 రిజర్వ్ బార్లకు నాలుగు కన్నా తక్కువ దరఖాస్తులు మాత్రమే రావడంతో, వీటికి దరఖాస్తుల గడువును సెప్టెంబర్ 1, 2025 సాయంత్రం 6 గంటల వరకు పొడిగించారు. ఈ బార్లకు డ్రా ఆఫ్ లాట్స్ సెప్టెంబర్ 2, 2025 ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నారు. దరఖాస్తులు రాని బార్లకు తిరిగి ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే బార్ పాలసీని ప్రకటించి, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 924 బార్లను కేటాయించింది. అందులో ఓపెన్ కేటగిరీకి 840, రిజర్వ్ కేటగిరీ (గీత్ కులాలకు)కి 84 బార్లు కేటాయించారు. బార్ల కేటాయింపును పారదర్శకత కోసం లాటరీ విధానం ద్వారానే చేపడుతున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా జిల్లా ప్రొహిబిషన్ , ఎక్సైజ్ అధికారులు ఓపెన్ కేటగిరీకి ఆగస్టు 18, 2025న, రిజర్వ్ కేటగిరీకి ఆగస్టు 20, 2025న గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసి దరఖాస్తులను ఆహ్వానించారు. దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 29, 2025 వరకు నిర్ణయించారు. ఆ గడువు నాటికి ఓపెన్ కేటగిరీకి 1,698, రిజర్వ్ కేటగిరీకి 567 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఓపెన్ కేటగిరీలో 388 బార్లకు 1,657, రిజర్వ్ కేటగిరీలో 78 బార్లకు 564 దరఖాస్తులు సరైనవిగా తేలి, డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించడానికి అర్హత పొందాయి.

జిల్లావారీగా కేటాయింపులు ఇలా ఉన్నాయి: అనంతపురం 12, అనన్తమయ్య 8, బాపట్ల 4, చిత్తూరు 5, అంబేద్కర్ కోనసీమ 1, తూర్పు గోదావరి 9, ఎలూరు 10, గుంటూరు 52, కాకినాడ 4, కృష్ణా 30, కర్నూలు 19, నంద్యాల 18, నెల్లూరు 19, శ్రీ సత్యసాయి 7, శ్రీకాకుళం 21, తిరుపతి 26, విశాఖపట్నం 72, విజయనగరం 14, పశ్చిమ గోదావరి 18, వైఎస్ఆర్ కడప 14.కేటాయించారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

**ఇ-టెండర్ ప్రకటన నం. 29-2025 తేది: 28.08.2025**

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఇంజనీర్/సమన్వయం/గుంతకల్ వారు క్రింది పనులకు ముగింపు తేదీ మరియు సమయం: 24.09.2025 15.00గం. వద్ద ఇ-టెండర్‌లు కోరుతున్నారు.

1. టెండర్ నం: Engg-GTL-West-1916. పని వివరణ : గుంతకల్ డివిజన్: DMM-GY & KPD-TPTY సెక్షన్‌లు : DEN/వెస్ట్ పరిధి క్రింద SSE/P/ATP, CTO & TPTY సెక్షన్‌లలో 4700m పొడవుకు యార్డ్ డ్రైన్‌ల ప్రతిపాదన. ప్రకటిత విలువ (రూ)లో : 4,73,23,832.48. బయానా (రూ): 3,86,600.00.
2. టెండర్ నం: Engg-GTL-West-1917. పని వివరణ : గుంతకల్ డివిజన్: SW-I: SSE/PWAY/ATP పరిధి: వివిధ యార్డ్‌లలో భద్రతా సంబంధిత యార్డ్ అభివృద్ధి & స్థాయి పెంపుదల పనుల ప్రతిపాదన. SW-II: SSE/PWAY/KLU పరిధి: వివిధ యార్డ్‌లలో భద్రతా సంబంధిత యార్డ్ అభివృద్ధి & స్థాయి పెంపుదల పనులు. ప్రకటిత విలువ (రూ)లో : 2,91,17,988.88. బయానా (రూ): 2,95,600.00.
3. టెండర్ నం: Engg-GTL-West-1918. పని వివరణ : గుంతకల్ డివిజన్: SW-I: SSE/PWAY/PAK పరిధి: వివిధ యార్డ్‌లలో భద్రతా సంబంధిత యార్డ్ అభివృద్ధి & స్థాయి పెంపుదల పనుల ప్రతిపాదన. SW-II: SSE/PWAY/CTO పరిధి: వివిధ యార్డ్‌లలో భద్రతా సంబంధిత యార్డ్ అభివృద్ధి & స్థాయి పెంపుదల పనులు. ప్రకటిత విలువ (రూ)లో : 3,69,84,599.28. బయానా (రూ): 3,34,900.00.
4. టెండర్ నం: Engg-GTL-West-1919. పని వివరణ : గుంతకల్ డివిజన్: SW-I: SSE/PWAY/KRY పరిధి: వివిధ యార్డ్‌లలో భద్రతా సంబంధిత యార్డ్ అభివృద్ధి & స్థాయి పెంపుదల పనుల ప్రతిపాదన. SW-II: SSE/PWAY/MPL పరిధి: వివిధ యార్డ్‌లలో భద్రతా సంబంధిత యార్డ్ అభివృద్ధి & స్థాయి పెంపుదల పనులు. SW-III: SSE/PWAY/KCI పరిధి: వివిధ యార్డ్‌లలో భద్రతా సంబంధిత యార్డ్ అభివృద్ధి & స్థాయి పెంపుదల పనులు. ప్రకటిత విలువ (రూ)లో : 1,78,86,320.78. బయానా (రూ): 2,39,400.00.

సవరణ ఏవైనా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేయబడును.
డివిజనల్ రైల్వే మేనేజర్/పనులు/ గుంతకల్.

**ఇ-టెండర్ ప్రకటన నం. S&T/14/ 2025 తేది: 29.08.2025**

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ సిగ్నల్ మరియు టెలికమ్యూనికేషన్స్ ఇంజనీర్ (నిర్వహణ) దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ వారు 23.09.2025 యొక్క 15.00 గం. వరకు క్రింది పనికి ఇ-టెండర్లు (ఓపెన్) కోరుతున్నారు.

1. టెండర్ నం: 01-SNT-14-2025. పని వివరణ (సిగ్నల్ మరియు టెలికాం పని) గుంతకల్ డివిజన్-వివిధ లోకేషన్‌లు రైల్వే స్టేషన్‌ల వద్ద వీడియో సర్వైలెన్స్ సిస్టమ్ (VSS) యొక్క రిప్లేస్‌మెంట్ మరియు పెంపుదల మరియు స్టేషన్ మాస్టర్ రూమ్స్/ రిలే రూమ్స్ వద్ద (74 స్టేషన్‌లు) వీడియో రికార్డింగ్ సిస్టమ్ యొక్క ఏర్పాటు. పని యొక్క ప్రకటిత టెండరువిలువ (రూ): 3,08,17,226.00. బయానా (రూ): 3,04,100.00. పూర్తి చేయు కాలం : 12 నెలలు.
2. టెండర్ నం: 02-SNT-14-2025. పని వివరణ (సిగ్నల్ మరియు టెలికాం పని) (1) (i) HX స్టేషన్ వద్ద ABSS పనుల దృష్టిలో పాత IOCL భవనం (ఫేజ్-II) యొక్క నవీకరణ & ఎస్కలేటర్‌లు, లిఫ్ట్‌లు, వెయిటింగ్ హాల్ నిర్మాణం కొరకు ప్రతిపాదిత S&T పనులు II) పూర్తి COP తో HX స్టేషన్ స్థాయి పెంపుదల కొరకు S&T ఆమరికల యొక్క ఏర్పాటు. (2) (I) CTO స్టేషన్ వద్ద ABSS పనుల దృష్ట్యా (ఫేజ్-II) ఎస్కలేటర్‌లు & లిఫ్ట్‌లు, స్టేషన్ భవన నిర్మాణం కొరకు ప్రతిపాదిత S&T పనులు. II) CTO స్టేషన్ వద్ద గూడ్స్ ఏరియాకు FOB 12m యొక్క విస్తరణతో సంబంధించి S&T ఏర్పాట్లు. (3) RC స్టేషన్ వద్ద ABSS పనుల దృష్ట్యా (ఫేజ్-II) ఎస్కలేటర్‌లు & లిఫ్ట్‌లు, స్టేషన్ భవన నిర్మాణానికి ప్రతిపాదిత S&T పనులు. (4) YG స్టేషన్ వద్ద ABSS పనుల దృష్ట్యా (ఫేజ్-II) ఎస్కలేటర్‌లు & లిఫ్ట్‌లు, స్టేషన్ భవన నిర్మాణానికి ప్రతిపాదిత S&T పనులు. పని యొక్క ప్రకటిత టెండరువిలువ (రూ): 3,25,82,544.22. బయానా (రూ): 3,12,900.00. పూర్తి చేయు కాలం : 12 నెలలు.
3. టెండర్ నం: 03-SNT-14-2025. పని వివరణ (సిగ్నల్ మరియు టెలికాం పని) గుంతకల్ డివిజన్‌లో LC125 (ZPL-PSPY) మరియు LC21 (CCI-MGB) LC19 (VKI-YLK), మిడ్ సెక్షన్ మ్యాన్‌డు LC గేట్‌ల యొక్క ఇంటర్‌లాకింగ్ ప్రతిపాదన. పని యొక్క ప్రకటిత టెండరువిలువ (రూ): 1,93,71,554.50. బయానా (రూ): 2,46,900.00. పూర్తి చేయు కాలం : 12 నెలలు.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్.

**టెండర్ నం. GTL-EM-28-2025-26 తేది: 28.08.2025**

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/ గుంతకల్ వారు కింది పనులకు ఇ-టెండర్‌లు కోరుతున్నారు.

1. టెండర్ నం : GTL-EM-28-2025-26, పనిపేరు : ఆదోని ABS ఫేజ్-II క్రింద స్టేషన్ స్థాయి పెంపుదలకు ప్రతిపాదన. 1) స్టేషన్ బిల్డింగ్ యొక్క మొదటి అంతస్తు నిర్మాణం. 2) విద్యుత్-M పనులు. 3) డిజిటల్ ప్రదర్శన బోర్డ్‌లు, S&T పనులు. 4) విద్యుత్-TRD పనులు. 5) పూర్తి COP ఏర్పాట్లు. 6) స్థానిక కళాకృతులు. 7) దివ్యాంగ టాయిలెట్స్-విద్యుత్ ఏర్పాట్లు. సుమారు విలువ : రూ.5,22,15,159.65/-.

ముగింపు తేదీ మరియు సమయం : 19.09.2025, 15.00 గంటలకు.

ఇతర వివరాలు మరియు టెండర్ బిడ్డింగ్ కోసం http://www.ireps.gov.inకు లాగిన్ చేయండి. టెండర్ యొక్క సవరణ ఏదైనా ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండర్ డాక్యుమెంట్‌ను టెండరుదారులు http://www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

గమనిక: ఈ ఇ-టెండర్‌లో పాల్గొనదానికి/బిడ్ చేయడానికి, టెండరుదారు చెల్లుబాటు అయ్యే DSC (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్)ను కలిగి ఉండాలి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్.
A1310

తదుపరి టెండరు నిబంధనలు /వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.



**ALL INDIA COUNCIL FOR TECHNICAL EDUCATION**
(A Statutory Body of the Government of India)
Nelson Mandela Marg, Vasant Kunj, New Delhi-110070
Ph. No.: 011-29581000, Website:www.aicte.gov.in

**AICTE POST GRADUATE (PG) SCHOLARSHIP SCHEME 2025-26**

Online proposals are invited from **AICTE approved Institutions** for the **Post Graduate Scholarship** through DBT to the students admitted in **AICTE approved Institute/programs and within approved intake** of M.E./M.Tech./M.Des. for the 1st year students of the academic year 2025-26 having gained qualifying marks with valid GATE/CEED score.

Detailed advertisement having guidelines/instructions/FAQs and procedure for online registration and eligibility of the student is available at link: **https://pgscholarship.aicte.gov.in/**

All eligible students are informed that the AICTE PG Scholarship Portal will be opened on **1st September, 2025** and they can upload their information on the AICTE PG portal by **15th December, 2025.** Also it is requested to the institutions shall complete the procedure of student documents verification on or before **31st December, 2025** on AICTE PG Scholarship portal.

**Advt. No.** SAGB (StdC)/AICTE/08(02)/2025 — **Member Secretary AICTE**
cbc21300/12/0010/2526



**ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్**
నెల్లూరు మెయిన్ బ్రాంచ్ , 16/3, ఆర్ ఆర్ వీధి, నర్తకి ప్లాజా ఎదురుగా, నెల్లూరు - 524001.
ఫోన్. 0861-2328559, E-Mail : iob0064@iob.in

**స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన**

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, నెల్లూరు బ్రాంచ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు వారు తేది:30-06-2025 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.57,78,427,17 పై (అక్షరాల యాభై ఏడు లక్షల డెబ్బై ఎనిమిది వేల నాలుగు వందల ఇరవై ఏడు రూపాయల పదిహేడు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్ వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, నెల్లూరు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి వారిచే స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/అధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" పద్ధతి పై తేది.01-10-2025న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క నెం.54) క్రింద బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్తుల అమ్మకము. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను "ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది" అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com. నందు గల ఇ-వేలం ప్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

**ఋణగ్రహీత/తనఖాదారు పేరు మరియు చిరునామా: శ్రీ జయంత్ కుమార్ గుంటకట్ల,** తండ్రి : జి. ఆనందం, ఫ్లాట్ నెం.304, శ్రీ అనిత అపార్ట్‌మెంట్స్, డిడి కాలనీ, అహోబిళ మట్ వెనుక, హైదరాబాద్, తెలంగాణ - 500013. **శాశ్వత/లోకల్ చిరునామా: శ్రీ జయంత్ కుమార్ గుంటకట్ల,** తండ్రి : జి. ఆనందం,ఫ్లాట్ నెం.101, మొదటి అంతస్తు, లోటస్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అల్లిపురం ఏరియా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 524002. **ఆఫీస్ చిరునామా: శ్రీ జయంత్ కుమార్ గుంటకట్ల,** తండ్రి : జి. ఆనందం, రోల్ నెం.39797, మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, తిరుపతి బ్రాంచ్, 603, మసీదు వీధి, వివి మహల్, మున్సిపల్ ఆఫీస్ దగ్గర, తిరుపతి - 517501, ఆంధ్రప్రదేశ్.

NPA తేది.25.02.2025 — డిమాండ్ నోటీసు తేది : 01.03.2025

డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : తేది.01.03.2025 నాటికి రూ.55,75,590.17/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్వాధీనత నోటీసు తేది: 19-06-2025

స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: తేది.19.06.2025 నాటికి రూ.56,56,992.17/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

**స్థిరాస్తుల వివరములు:**

ప్రైమ్ సెక్యూరిటీ : ఐటమ్ నెం.1: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, అల్లిపురం ఏరియా, సర్వే నెం.9, సబ్ డివిజన్ ఎస్.నెం.9/బి లోని ఎ.3.31 సెంట్లు విస్తీర్ణం లే అవుట్ ప్లాన్‌గా మారినది, దీనిలో ప్లాట్ నెం.17 (విస్తీర్ణం 36 అంకణముల మరియు 8 చ॥అ॥లు), ప్లాట్ నెం.18 (విస్తీర్ణం 35 అంకణములు) మరియు ప్లాట్ నెం.19 (విస్తీర్ణం 35 అంకణములు), మొత్తం విస్తీర్ణం 106 అంకణములు మరియు 8 చ॥అ॥లు లేదా 848.888 చ॥గ॥ల స్థలం. హద్దులు: తూర్పు : మన్నవ మంగారావు గారికి చెందిన స్థలం, దక్షిణం : ప్లాట్ నెం.20, పడమర : 30 అ॥ల వెడల్పు లే అవుట్ రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నెం.16.
ఈ హద్దులలోని మొత్తం విస్తీర్ణం 106 అంకణములు మరియు 8 చ॥అ॥లలోని 6.04 అంకణములు లేదా 48.32 చ॥గ॥ల అవిభాజ్యపు విస్తీర్ణం అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

ఐటమ్ నెం.2: పైన తెలిపిన ఐటమ్ నెం.1 లో తెలిపిన 6.04 అంకణములు లేదా 48.32 చ॥గ॥ల అవిభాజ్యపు వాటాతో "లోటస్ రెసిడెన్సీ" అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తు నందు కామన్ ఏరియాతో కలిపి 1250 చ॥అ॥ల విస్తీర్ణంతో గల ఆర్‌సిసి నివాస ఫ్లాట్ నెం.101 యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : కామన్ కారిడార్ కొంతమేర మరియు ఈ ఫ్లాట్‌కు మరియు ఫ్లాట్ నెం.102కు మధ్య గల ఉమ్మడి గోడ కొంతమేర.
ఈ హద్దులలోని "లోటస్ రెసిడెన్సీ" అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తు నందు కామన్ ఏరియాతో కలిపి 1250 చ॥అ॥ల విస్తీర్ణంతో గల నివాస ఫ్లాట్ నెం.101 అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

రిజర్వుధర: రూ.40,38,000/- ధరావత్తు ధర : రూ.4,03,800/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.20,000/-

వేలం తేది మరియు సమయం: తేది.01-10-2025, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 5 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను, తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని 30-09-2025, సాయంత్రం 4.00 గంటలలోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన పేర్కొన్న సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం ద్వారా వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బ్యాంకుకు తెలిసిఉన్నంత వరకు ఎలాంటి ఋణభారములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది.15-09-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది:30-08-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.30-09-2025, సా॥ 4.00 గం॥ల వరకు

* ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ :https://baanknet.com లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in మరిన్ని వివరముల కొరకు: బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, నెల్లూరు మెయిన్ బ్రాంచ్, 16/3, ఆర్ ఆర్ వీధి, నర్తకి ప్లాజా ఎదురుగా, నెల్లూరు - 524001. ఫోన్. 0861-2328559, E-Mail : iob0064@iob.in లేదా సర్వీస్ ప్రొవైడర్ : M/s. Bank Asset Auction Network, రిజిస్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వడాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వడాలా ఈస్ట్, ముంబయి - 400037, email: support.BAANKNET@psballiance.com (Website: https://baanknet.com) (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 28-08-2025, ప్రదేశం : నెల్లూరు — సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

# పంటలు వరదపాలు

ఈ యేడు ప్రకృతి వైపరీత్యం కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో లక్షలాది ఎకరాల పంట నీట మునిగి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా వివిధ రకాల చేతికి వచ్చిన పంటలు నీటి పాలుకాగా, తాజాగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పెద్ద మొత్తంలో పంటలకు నష్టం వాటిల్లింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ వర్షాల కారణంగా పలు జిల్లాల్లో వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, అరటి, మిర్చి వంటి పంటలకు నష్టం వాటిల్లింది. నీరు నిలిచిపోవడం, వరదలతో పంటలు కొట్టుకుపోవడం, పొలాల్లో ఇసుక మేటలు వేయడం వంటి కారణాలతో రైతులు అపార నష్టాన్ని ఎదుర్కొంటున్నారు.



రెండు రాష్ట్రాల్లో గత నాలుగు రోజులుగా అత్యంత భారీ వర్షాలు పడ్డాయి. భారీ వర్షాలతో రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. కొన్నిచోట్ల కట్టలు తెగిపోయి. దీంతో చెరువులు, వాగులు, వంకలు పొంగిఊరిమీద, పొలాల మీద, చేపల చెరువుల మీద పడ్డాయి. ఎక్కడికక్కడ వరదనీటిలో పంటలు కొట్టుకుపోయాయి. పలుచోట్ల పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో వేలాది మంది రైతులకు తీరని నష్టం మిగిలింది. పొలాల్లోనే నీళ్లు నిలవడంతో పంటలు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. దెబ్బతిన్నపంటలో ప్రధానంగా వరి, పత్తి, కూరగాయల తోటలు అత్యధికంగా ఉన్నాయి. పత్తిపూత దశలో ఉండటం, వరినాట్లు పూర్తయిన నేపథ్యంలో వర్షాలు, వరదల ప్రభావం వీటిపైతీవ్రంగా చూపించాయి. పత్తి కాత దశలో ఉండగా, పెసర చేన్లు చాలావరకూ చివరి దశలో ఉన్నాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వర్ష బీభత్సం అన్నదాతకు అపారనష్టాన్ని మిగిల్చింది. ఈ సంవత్సరం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నాటి నుంచి నాలుగు దఫాలుగా వర్షాల కారణంగా పంటలు నీట మునగగా, రైతులకు తీరని నష్టం వాటిల్లింది. తెలంగాణలో వరదల నేపథ్యంలో వివిధ జిల్లాల్లో 12 మంది మృత్యువాతపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.10 లక్షల ఎకరాల్లోని పంటలకు నష్టం జరిగినట్టు తెలుస్తున్నది. దీంతో వేలాది మంది రైతులకు తీరని నష్టంమిగిలింది. ఇందులో 1.80 లక్షల ఎకరాల్లోని పత్తిచేలు నీట మునిగాయి. అలాగే మరో 1.30 లక్షల ఎకరాల్లో వరిచేలు వరద ముంపునకు గురైంది. రాష్ట్రంలోని మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, కొత్తగూడెం, జనగాం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట్, ములుగు, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హన్మకొండ తదితరజిల్లాల్లో అత్యధికంగా పంటలు నీట మునిగాయి. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 5 లక్షలకు పైగా ఎకరాల్లో పంట నీట మునిగినట్లు అంచనా వేస్తున్నారు. భారీ వరదలు ప్రవహించడంతో పొలాల్లో ఇసుక మేటలు వేసింది. పొలాల్లోనే నీళ్లు నిలవడంతో పంటలు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. కామారెడ్డి, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో పంటలు నామారూపాల్లేకుండా పోయాయి. ఎక్కడ చూసినా పంటపొలాల్లో నీళ్లు, ఇసుక దిబ్బలే కనిపిస్తున్నాయి. భారీ వరదలకు చాలాచోట్ల పంట కొట్టుకుపోయింది. వర్షాలతో పూతకొచ్చిన పత్తి పాడైపోతున్నది. మిగిలిన పంట చేలల్లో రోజుల తరబడి వర్షపు నీరు నిలిచి, పత్తి ఎర్రబారి దిగుబడి తగ్గుతుంది. వర్షాలు మరికొన్ని రోజులు వస్తే పంటపై గులాబీ పురుగు సోకే ప్రమాదం ఉంది. ఓవైపు వర్షాలు, మరోవైపు గులాబీ పురుగుతో పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిర్మల్‌జిల్లాలోని ముజ్గి, తాంశ, చిట్యాల్ మంజులాపూర్ శివారులో దాదాపు 100 ఎకరాల వరకు వరిపంట నీట మునిగింది. అలాగేసోన్ మండలం కడ్తాల్‌లో స్వర్ణ వాగు ఉప్పొంగడంతో పొలాల్లోకి భారీగా వరద నీరు చేరుకున్నది. కుంటాల మండలంలోని వెంకూర్ శివారులో పత్తి, సోయా పంటలు పూర్తిగా నీట

సిహెచ్ వి వి రఘుబాబు

మునిగాయి. జిల్లాలో చాలాచోట్ల వరితో పాటు, పత్తి, సోయా, మక్క పంటలు నీట మునిగాయి. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో వరద నీటితో వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. భూపాలపల్లి జిల్లాలోని మోరంచవాగు పరీవాహక ప్రాంత పంట పొలాలన్నీ వరదనీటిలోనే మునిగాయి. పలిమెల మండలం లెంకలగడ్డలో వేసిన ఎకరం మిరపనారు కొట్టుకుపోయింది. ఖమ్మం జిల్లాలోని పెద్ద చెరువు కింద



పంట పొలాలన్నీ పూర్తిగా నీటమునిగాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 15,686ఎకరాల్లో పంటల నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. సంగారెడ్డి జిల్లాలో 2,000 ఎకరాలు, మెదక్‌లో 6,341 ఎకరాలు, సిద్దిపేటలో 7,345 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. చిన్నశంకరంపేట శివారులో పంట పొలాలు పూర్తిగా నీట ముగినిగాయి. నిజాంసాగర్ దిగువ అనేక గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. నందిగామలోని పౌల్ట్రీ ఫాంలో 10వేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. మంచిర్యాల జిల్లాలో నాట్ల దశలో ఉన్న వరి వరదల్లో కొట్టుకు పోగా, ఏపుగా పెరుగుతున్న పత్తిపంట పూర్తిగా నీట మునిగింది. వికారాబాద్ జిల్లాలో 7,781 మంది రైతులకు చెందిన 13,126 ఎకరాల్లో పంటలు వరదపాలయ్యాయి. భీమిని, తాండూరు, మందమర్రి, నెన్నెల, వేమనపల్లి, కన్నెపల్లి, కోటపల్లి, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, కాసిపేట, హాజీపూర్, చెన్నూరు, జైపూరు, జన్నారం మండలాల్లో 3,215 మంది రైతులకు చెందిన 4,964 ఎకరాల వరి పంట నీటమునగగా, 4,538 మంది రైతులకు చెందిన 8,107 ఎకరాల పత్తి చేలలో నీరు నిలిచింది. అలాగే 13 మంది రైతులకు చెందిన 35 ఎకరాల మిర్చి, 15 మందికి చెందిన 20 ఎకరాల కూరగాయల సాగు సైతం వర్షార్పణం అయింది. వర్షాల కారణంగా వరికి ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.4,96,40,000 నష్టం వాటిల్లగా, పత్తి పంటకు ఎకరాకు రూ.15వేల చొప్పున మొత్తం రూ.12 కోట్ల 16లక్షల 5వేలవరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఒక్క పాత మంచిర్యాలలోనే సుమారు 100ఎకరాలకుపైగా పత్తి పంట నీట మునిగింది. అయితే ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణలో 2.20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కామారెడ్డిలో 77 వేల ఎకరాలు నష్టపోయినట్లు గుర్తించారు. ఆగస్టు నెలలో కురిసిన భారీవర్షాలు రాష్ట్రవ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం కలిగించాయని తెలిపింది. మొత్తం 28 జిల్లాల్లో 2.20లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 1.43,304 మంది రైతులు నష్టపోయా అత్యధికంగా కామారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పంటల నష్టం ఎక్కువగా నమోదైంది. కామారెడ్డి జిల్లాలోనే 77,394 ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లాలో 23,169 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 21,276 ఎకరాలు, నిజామాబాద్‌లో 18,417 ఎకరాలు, ఆసిఫాబాద్ జిల్లాలో 15,317ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. ఆ తర్వాత అత్యధికంగా నష్టపోయిన జిల్లాల్లో మంచిర్యాల, ఖమ్మం, నిర్మల్, సూర్యపేట, సిద్దిపేట సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, గద్వాల, పెద్దపల్లి, వనపర్తి, భూపాలపల్లి, మహబూబ్‌నగర్, ములుగు, సిరిసిల్లా, నాగర్ కర్నూల్, నల్గొండ, జగిత్యాల రంగారెడ్డి, కరీంనగర్, మేడ్చల్, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఉన్నాయి. పంట పొలాల్లో ఇసుక మేట వేసింది. జిల్లాల వారీగా చూస్తే వరి పంట అత్యధికంగా దెబ్బతింది. మొత్తం 1.09లక్షల ఎకరాలు వరి నీటమునిగింది. పత్తి 60వేల ఎకరాలు నష్టం చవిచూసింది. మొక్కజొన్న 16వేల ఎకరాలు, వేరుశనగ 20వేల 900 ఎకరాల్లో దెబ్బతింది. సోయాబీన్, టమాట, మిర్చి, మినుములు, ఇతర పంటలు కూడా గణనీయంగా దెబ్బతిన్నాయి. పంట నష్టానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపనుంది. కేంద్ర సాయంతో పాటు, రాష్ట్రప్రభుత్వం కూడా కొంత కలిపి రైతులకు సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి, విశాఖపట్నం, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాలను వర్షాలు వణికించాయి. వాగులు, వంకలు పోటెత్తుతున్నాయి. ప్రమాదకర ప్రవాహాలకు అనేకగ్రామాల మధ్యరాకపోకలు స్తంభించాయి. పంటలు నీటమునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గుంటూరు, విజయవాడ నగరాల్లోని ప్రధాన రహదారులపై 2 అడుగులకుపైగా నీరు ప్రవహించింది. భారీవర్షాల దృష్ట్యాపల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మునిగిన లోతట్టు ప్రాంతాలు వర్షాలకు ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. 3వంతెనల మార్గం, కంకరగుంట, ఆర్‌యూబీ వంతెన మార్గాల్లో నీరు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. శంకర విలాస్‌వంతెన కూల్చివేత వల్లరాకపోకలు లేక జనం అవస్థలు పడ్డారు. నగరంలోని అనేక లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీలను వరద ముంచెత్తింది. ఏటీఅగ్రహారం, చుట్టుగుంట, శ్రీరామ్‌నగర్, హనుమాన్ నగర్ కాలనీ వాసులు ముంపులో చిక్కుకున్నారు. వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, రైతుబజార్‌లోకి నాలుగు అడుగుల మేర నీరుచేరింది. ఇక జిల్లాలోని తుళ్లూరు మండలం పెదపరిమివద్ద కోటేళ్లవాగు పొంగి పెదపరిమి తుళ్లూరు మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాలడుగులో పొలాలు తటాకాలను తలపిస్తున్నాయి. నల్లపాడులో రైతుల రెక్కలకష్టం నీటిముని గింది. దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర మండలాల్లో పొలాల్లోకి వరదచేరింది. పొన్నూరు నియోజకవర్గంలోనూ వర్షం వణికించింది. వర్షాలకు యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని, పంట నష్టం నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి టెలికాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించా రు. బాపట్లజిల్లాలోనూ విస్తారంగా వర్షాలు కురిశాయి. భట్టి ప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల్లో పొలాలు చెరువులుగా మారాయి. కొమ్మమూరు కాల్వకు

# మరో 'వంగ' సమరం!

పశ్చిమ బెంగాల్

ఎన్నికలొస్తున్నాయనుకునేసరికి ఏ పార్టీకైనా గుర్తుకు వచ్చేది ఓటరే. ఎంత రాజకీయమైనా ఆ ఓటరు చుట్టూనే తిరుగుతూంటుంది. ఓటు, ఓటరు అనే రెండు మాటలే వేద మంత్రంలా వినిపిస్తూంటాయి. బీహార్‌లో దృశ్యం చూస్తే అన్ని రాజకీయ పార్టీలు ఎలా ఓటు చుట్టూ తిరుగుతున్నాయో బాగా అర్థమవుతుంది. కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీఓటరు అధికార యాత్ర నిర్వహిస్తూ అధికార ఎన్డీయే గుండెల్లో గుబులు పుట్టిస్తుంటే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా అదే రాగం అందుకొని తాము కూడా ఓటరు చైతన్య యాత్రలు నిర్వహిస్తామంటూ ప్రకటించడం ఇప్పుడు సంచలనాత్మకంగా మారింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరుగబోతుండగా, బెంగాల్‌లో వచ్చే సంవత్సరం మధ్యలో జరుగనున్నాయి. ఇంకా తగినంత వ్యవధిఉన్నా, గతవారం సిఇసి తీసుకొన్న ఓ చర్య ఆమె తక్షణమే ఆందోళన ప్రకటించేట్లు చేసిందనిపిస్తుంది. అందుకే ఓటర్లలో 'చైతన్యం' కోసం మమత ఇప్పటినుంచే నడుం బిగించినట్లు కనిపిస్తుంది. బీహార్‌కు, బెంగాల్‌కు మధ్య తేడాలు చాలానే ఉన్నాయి. అక్కడ బిజెపిపై విపక్ష కాంగ్రెస్ తిరగబడుతోంది. ఇక్కడ బిజెపిపై అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) సమరశంఖం పూరిస్తోంది. అందువల్ల యుద్ధం ఒకేలా కనిపించినా, విధానాల్లో వ్యత్యాసం ఉంటుంది. అక్కడ సిఎం నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జెడి(యు)నే గాక ఎన్డీయే కూటమిని అధికారం నుంచి తొలగించి ఈసారి ఎలాగైనా కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడానికి రాహుల్ ముమ్మరంగానే ప్రయత్నిస్తున్నారు. బెంగాల్‌లో బిజెపి అధికారంలో లేదు కనుక, ప్రధాన విపక్షంగా ఉన్న ఆ పార్టీ ముందుకు రాకుండా కళ్లెం వేయడానికి అధికార టిఎంసితరఫున సాక్షాత్తు మమతే బరిలోకి దిగు తున్నారు. 'అవాస్తవిక ఓటర్ల'ను జాబితాలనుంచి తొలగించడానికి 500 టీమ్‌లను రాష్ట్రానికిసిఇసి పంపిస్తున్నదని తెలియగానే బిజెపి కుట్రను ఎదుర్కొనడానికి ఆమె ఈ వ్యూహం రూపొందిం చినట్లు కనబడుతోంది. బీహార్‌లో రాహుల్ నిర్వ హిస్తున్న ఓటరు అధికార యాత్ర ప్రభావం గణ నీయంగానే

ఎ.వి.వి ప్రసాద్

కనిపిస్తుండడంతో మమత కూడా అదే తరహా యాత్ర జరుపనున్నారనే విషయం దీనితో స్పష్టమవుతోంది. టిఎంసి విద్యార్థి విభాగం 'తృణమూల్ ఛాత్ర పరిషత్' స్థాపక దినోత్సవం సందర్భంగా గత గురువారం (28, ఆగస్టు) ఆమె ఈ ప్రకటన చేస్తూ బిజెపి కుట్రలు తమ రాష్ట్రంలో సాగనివ్వబో మంటూ ప్రతిజ్ఞ కూడా చేశారు. నిజానికి బీహార్ లో మాదిరే పశ్చిమ బెం గాల్ లోను 'అక్రమ ఓట ర్లు' అధికంగానే ఉన్నారనే ఆరోపణలున్నాయి. రోహింగ్యాలు, అఫ్గాన్, బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారు బెంగాల్ లో అక్రమ ఓటర్లుగా చెలామణి అవుతున్నారని ఇసి గతంలోనే చెప్పింది. అందుకే బీహార్ తరహాలో ఇక్కడ కూడా 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నిర్వహించాలని ఇసి నిర్ణయించింది.



మమతా బెనర్జీ

బీహార్‌లో 'సర్'ద్వారా దాదాపు 65లక్షల అక్రమ ఓటర్లను తొలగించినట్లు ఇసి ప్రకటించగానే బెంగాల్ ముఖ్యమంత్రిలో ఆందోళన మొదలైంది. బీహార్ ఓటర్ల తొలగింపు వివాదం సుప్రీం కోర్టు దాకా వెళ్లడం, తొలగించిన ఓటర్ల జాబితాను ఇసి ప్రకటించడం జరిగాయి. ఆ వివాదం ఇంకా రగులుతూనే ఉంది.'బల ప్రయోగంతో మాత్రమే ఎవరూ విజయం సాధించలేరు. మీ సీక్రెట్లను మేమూ బహిర్గతం చేస్తా'మంటూ మమత గత వారం సమావేశంలో ఓ సవాల్ కూడా విసిరారు. 'ప్రజల ఆశీస్సులతో మేం అధికారం లోకి వచ్చాం, కుట్రలు చేసి కాదు' అంటూ నిశితంగానే విమర్శించారు. 'బిజెపికి లాలీపాప్ లామారితే ఇసి ఉనికే ప్రశ్నార్థకమవుతుంది' అంటూఎన్నికల సంఘానికి ఓ హెచ్చరిక కూడా విసిరారు. ఇదంతా చూస్తుంటే రానున్న ఎన్నికలకు ఆమె సమర భేరి మోగించినట్లుగానే స్పష్టమవుతుంది. బీహార్‌లో 'ఓట్ల చోరీ'కి పాల్పడుతున్న బిజెపి ఆటలు బెంగాల్‌లో సాగనివ్వబోమంటూ మరో చురక వేశారు. బీహార్, బెంగాల్‌లో కనిపిస్తున్న అలజడే తమిళనాడులో కూడా దర్శనమిస్తోంది. తమ రాష్ట్రంలో కూడా ఓట్లను కొల్లగొట్టడానికి బిజెపి కుట్రలు పన్నుతున్నదనీ, ఆ పార్టీ ఆట కట్టించడానికి తమ వద్ద భారీ వ్యూహాలే ఉన్నాయనీ అక్కడి సిఎం స్టాలిన్ కూడా పది రోజుల క్రితమే ప్రకటించారు. తమిళనాట కూడా వచ్చే సంవత్సరమే ఎన్నికలు జరుగనున్నాయి. బీహార్‌లో 'సర్'ను ప్రయోగించిన సిఇసి బెంగాల్‌తో పాటు తమిళనాడుపై కూడా ఆ అస్త్రాన్ని ప్రయోగించనుండడంతో అక్కడా ఆందోళనకర పరిస్థితే నెలకొని ఉంది. సర్ నిర్వహణ కోసం ఎలోక్టరల్ రిజిస్ట్రేషన్ అధికారులను (ఇఆర్‌ఒ) నియమించాలంటూ రాష్ట్రఎన్నికల సంఘానికి సిఇసి గతవారమే ఆదేశాలిచ్చింది. అయితే ఇఆర్‌ఒలను రాష్ట్రసిఎస్ ఆదేశాల మేరకు నియమించవలసి ఉంటుంది. కానీ సిఎస్ సాధారణంగా ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారమే నడుచుకుంటూ ఉంటారు గనుక బెంగాల్‌లో ఈ'ఓటరు వడపోత' కార్యక్రమం ఏ మేరకు ప్రశాంతంగా సాగుతుందో చూడవలసి ఉంది. బీహార్‌లో ఉన్నది 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం గనుక సిఇసి ఆదేశాల మేరకు తేలికగానే 'సర్' నిర్వహించారు. కానీ బెంగాల్‌లో అధికారంలో ఉన్నది బిజెపికి వ్యతిరేకమైన టిఎంసి ప్రభుత్వం గనుక సర్ నిర్వహణ ఎలా కొనసాగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైపెచ్చు ముఖ్యమంత్రి స్వయంగా ఓటరు చైతన్య యాత్ర ప్రకటించడంతో సిఇసి ఆదేశాలు ఎంత వరకు పూర్తిగా అమలవుతాయనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ అధికారుల బదలీలు కూడా ఎక్కువగానే జరుగుతూంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 'సమన్వయం' ఉంటే అవన్నీ తేలికే. లేనిచోట రోజూ ఉప్పు, నిప్పులా వాతావరణం మారిపోతుంది. మమత గతవారం ప్రకటించిన 'సమరం' ఎటు తిరుగుతుందో చూడాలి. ●

# ఇక నేనే అధ్యక్షుణ్ణి!

అమెరికా

ఓ పక్క సుంకాలతో ప్రపంచ దేశాలను వణికిస్తున్న ట్రంప్ మరోవైపునుంచి నోబెల్ శాంతి పురస్కారం కోసం లాబీయింగ్‌ల వంటి వాటితో అత్యంత బిజీగా గడుపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకున్నట్లుగానే ఆయన వారసుడొచ్చేసాడు. 78 ఏళ్ల ఏడునెలల వయసులో ఉన్న ట్రంప్ మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటే తాను ముద్దుగా పిలుచుకునే 'మాగా' సాధనకు తన వారసుడిగా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ పనిచేస్తారని ప్రకటించినట్లుగానే అమెరికా వైస్ ఇప్పుడు అవసరమైతే అధ్యక్షపదవి చేపడతానంటూ బహిరంగంగానే ప్రకటించేసారు. దీనికంతటికీ కారణం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉందని, ఆయనకు సిరల వ్యాధి ఉందని, తరచూ కరచాలనాలు చేయడంవల్లనే వచ్చిందని చెపుతున్నా వృద్ధాప్యసమస్యలు కూడా ట్రంప్‌ను చుట్టుముడుతున్నట్లు తెలుస్తోంది. అయినా ఇప్పటికీ ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, శ్వేతసౌధంలో వచ్చిన సంస్కరణలు తనకు ముచ్చటేసాయని చెప్పిన యుఎస్ వైస్‌జెడివాన్స్ అత్యవసరం అయితే అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు కూడా వెనుకాడనని చెప్పడాన్ని చూస్తుంటే గ్రాండ్ ఓల్డ్ పార్టీ (జిఒపి) రిపబ్లికన్లలో ఇపుడు నాయకత్వ మార్పుపైనా చర్చలుజరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు ట్రంప్ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన వాన్స్ తదనంతరం ఆయనకు వీరవిధేయుడిగా మారిపోయారు. పైగా అక్కడి ఆంగ్లమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నారని, ఆయనతో కలిసి పనిచేసేవాళ్ల ఆయనకంటే చిన్నవారేనని చెపుతూ అందరికంటే ఎక్కువ సేపుపనిచేసే ట్రంప్ అందరికంటే ముందే నిద్రలేచి పనుల్లో నిమగ్నం అయిపోతారన్నారు. ఏదేని అనుకోని భయంకర విషాదం చోటుచేసుకుంటే అధ్యక్షపదవిలోకి వచ్చేందుకు తాను సిద్ధమేనని స్పష్టంచేసారు. అమెరికా చరిత్రలో 41 ఏళ్ల పిన్నవయసులోనే 50వ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వాన్స్‌లో ఆ నాయకత్వ లక్షణాలు కూడా పుష్కలంగానే ఉన్నాయని చెప్పవచ్చు. దీనికంతటికీ కారణం దక్షిణకొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్‌తో చర్చలు జరిగిన సమయంలో అధ్యక్షుడు ట్రంప్ చేతికి పెద్ద గాయం

గన్ని మోహన్

కనిపించింది. దీనితో ప్రపంచ మీడియా ట్రంప్ ఆరోగ్యంపై పలు కథనాలు ప్రచురించాయి. వయోభారం కూడా మీదపడుతున్నది. రెండు మూడునెలలు ఆగితే ట్రంప్ 79ఏళ్ల వయసులోకి వచ్చేస్తారు. నిజానికి ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ ఆస్ప్రిన్ అత్యధికంగా వినియోగించడంవల్ల ఈ గాయం ఏర్పడినట్లు శ్వేతసౌధం కూడా వివరణ ఇచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ ప్రజల మనిషి అని అమెరికా చరిత్రలో ఇతర అధ్యక్షులకంటే ఎక్కువగా ఆయన ప్రతిరోజూ అమెరికన్లను, ప్రపంచదేశాధినేతలను కలుసుకుంటూ వారితోకరచాలనం చేస్తుంటారని ఆందోళన చెందాల్సి న పనిలేదంటూట్రంప్ అనారోగ్యాన్ని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా వివరణ ఇచ్చి సర్దుబాటు ప్రయత్నం చేసారు.



జెడివాన్స్


ఈ ఏడాది గత జూలైలోనే ఒక పర్యాయం ట్రంప్ కాళ్లపై కనిపించిన వాపు ఆయన ఆరోగ్యంపై అనుమానాలను మరింత పెంచింది. ఆ సమయంలోనే వైట్‌హౌస్ వైద్యుడు డాక్టర్ సీన్ బార్బబెల్లా ఆయనకు 'క్రానిక్ వీనస్ ఇన్సఫిషియెన్సీ' అనే వ్యాధి ఉందని నిర్ధారించారు. 70ఏళ్లకంటే ఎక్కువ వయసున్న వారిలో సహజంగా కనిపించే ఒకవ్యాధి అని ఈవ్యాధి సిరల్లో రక్తప్రసరణ సరిగాలేకపోవడంవల్ల వస్తుందని వివరించారు. ఈ నెలారంభంలోనే ఒక ఫిజియో థెరపిస్టు మాట్లాడుతూ కంజెసివ్ హార్ట్ ఫెయిల్యూర్, క్రానిక్ కిడ్నీ డిసీజ్‌లు వంటివాటితో ట్రంప్ బాధపడుతున్నారని, కేవలం ఏడాదిలోపు ఇవి నివారించుకోవడం ఆయనకు కష్టమేనన్న నివేదిక ప్రకటించారు. రెండేళ్ల క్రితం ట్రంప్ కరోనరీ కాల్షియం స్కోరు 133గా ఉందని, దీనివల్ల ఆయనకు కరోనరీ ఆర్టరీ డిసీజ్ ముప్పు సూచిస్తుందని కార్డియాలజిస్టులు సైతం వెల్లడించారు. అయితే వైట్‌హౌస్ వైద్యులు తమ నివేదికలో ఎలాంటి గుండెజబ్బులు లేవని నిర్ధారించారు. ఈ వివరణలతో ట్రంప్ ఆరోగ్యంపై వస్తున్న కథనాలకు తాత్కాలిక తెరపడినప్పటికీ తాజాగా ఉపాధ్యక్షుడు వాన్స్ చేసిన ప్రకటనతో మళ్లీ అగ్రరాజ్యం అధ్యక్షుడి ఆరోగ్యంపై అనుమానాలు పెరిగాయి. దీనికితోడు ట్రంప్ ఇటీవలికాలంలో మీడియా ముందుకు రావడంలేదు. ఇవన్నీ కూడా ఆయన ఆరోగ్యంపై చర్చలకు మరింత ఊతం ఇచ్చాయి. ఇక రెండుసార్లు అధ్యక్షపదవిచేపట్టిన తర్వాత అమెరికాకు యువతరం బాధ్యతలు తీసుకోవాలని అక్కడి పౌరుల ప్రధానకాంక్షగా కూడా ఉంది. ఉపాధ్యక్షుడుగా 200 రోజులు పూర్తిచేసిన తన పదవీకాలం ఒక గొప్ప అనుభవం అని 'దిబెస్ట్ ఆన్‌ది జాబ్ ట్రైనింగ్' అని అభివర్ణించిన వాన్స్ ఒకవేళ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాల్సి వస్తే ఆయనకు పోటీకూడా లేకుండాపోలేదు. విదేశాంగ మంత్రి మార్కో రుబియో, మార్క్ రుట్టే వంటి వారు పోటీలో ఉన్నా ఆనాడు ఉపాధ్యక్ష పదవికి ట్రంప్ స్వయంగా వాన్స్‌పేరును ఎంపిక చేసుకుని ప్రకటించారు. దీనికితోడు వాన్స్ కూడా తనదైన శైలిలో ట్రంప్‌పాలన తీరుకు ఎక్కడా భిన్నత్వంలేకుండా కొనసాగిస్తూ వచ్చారు. భారత్ పర్యట నతోపాటు జి20, జి7 వంటి దేశాలతో నెరపిన సంబంధాలు, ఆపై ఉక్రెయిన్ యుద్ధ విరమణకు ట్రంప్‌తో కలిసి జరిపిన సంప్రదింపులు, చర్చలు వాన్స్‌లోని రాజకీయ పరిణతిని చాటిచెప్పాయి. ప్రస్తుతం ట్రంప్ ఆరోగ్యంపై జరుగుతున్నచర్చల క్రమంలో రిపబ్లికన్లు అధ్యక్షుడిని మార్చాల్సి వస్తే ఇక ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌నే ఎంపికచేస్తారన్న భావన కూడా వ్యక్తం అవుతోంది. అందువల్లనే విషమపరిస్థితి వస్తే అధ్యక్షపదవి చేపట్టేందుకు తానుసిద్ధమేనని ప్రకటించడంతో వాన్స్‌కు అధ్యక్షపదవిపై బలమైన వాంఛఉన్నదని ఆయన మనోగతం చెప్పకనే చెపుతోంది. ఈపరిణామాలన్నింటి దృష్ట్యా భవిష్యత్తు అమెరికా అధ్యక్షుడు జేమ్స్ డేవిడ్ వాన్స్ అయినా ఆశ్చర్యపోనవసరంలేదు. ●

# ప్రగతి పథంలో పయనం - విచ్ఛిన్నకర కుట్రల పట్ల అప్రమత్తం

రెండువేల ఇరవైఐదు, రెండువేల ఇరవై ఆరు ఆర్థిక సంవత్సరానికి భారతదేశ జిడిపి 6.4 శాతానికి చేరుతుందన్న అంచనా. ప్రత్యేకించి కోవిడ్19 తరువాత కూడా ఆర్థిక ప్రగతిని కొనసాగిస్తూ తన వ్యూహాత్మక చొరవలతో నిలకడైన ఆర్థిక ప్రగతి, స్థిరమైన అభివృద్ధితో భవిష్యత్ ప్రపంచ దృశ్యాన్ని ఆవిష్కరించడంలో కీలక పాత్రధారిగా నిలుస్తోంది. ప్రపంచ వృద్ధికి గణనీయంగా దోహదపడుతూ 2027నాటికి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి సిద్ధంగా ఉంది. గ్లోబల్ సౌత్‌తో సంబంధాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారిస్తూ ఆధునిక సాంకేతిక పురోగతులు భౌగోళిక రాజకీయ మార్పులకు అనుగుణంగా సమ్మిళిత, స్థిరమైన వృద్ధిని పెంపొందిస్తోంది. ఆర్థికాభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత వృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా మానవాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి నిరుద్యోగం వంటి సమస్యల పరిష్కారానికి అనేక చొరవలు చేపడుతోంది. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి దేశంలోని అధిక సంఖ్యాకులు మధ్య ఆదాయ వర్గానికి చేరుకునేలా ప్రజా పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వాణిజ్య సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడంపై నిరంతరం దృష్టి సారిస్తోంది. స్వదేశీకరణకు ప్రాధాన్యం, వ్యూహాత్మక విధాన సంస్కరణలు, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేక్ ఇన్ ఇండియా చొరవ, పెరిగిన దేశీయ డిమాండ్, డిజిటల్ పరివర్తన వంటి అంశాలతో పాటు బలమైన ప్రభుత్వ మద్దతుతో ప్రైవేటు రంగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజిటల్ సేవలు, తయారీ, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలు గత దశాబ్ద కాలంలో గణనీయమైన పురోగతిని సాధించాయి. ఎలక్ట్రానిక్స్ తయారీ (ముఖ్యంగా మొబైల్ ఫోన్లు), ఫార్మాస్యూటికల్స్, ఆర్థిక సాంకేతికత, ఇకామర్స్ ఎలక్ట్రిక్ వాహనాలు కీలకవృద్ధి రంగాలలో ఉన్నాయి. అదనంగా, 2014 నుండి ప్రైవేట్ రంగం రక్షణ, అంతరిక్షం, మౌలిక సదుపాయాలు లాజిస్టిక్స్ వంటిరంగాలలో గణనీయమైన అభివృద్ధినిసాధిస్తోంది. తమ ఉత్పత్తులు సేవల ఎగుమతుల ద్వారా అనేక కీలక రంగాలు గణనీయమైన విదేశీ మారక ద్రవ్య ఆర్జనతో జాతీ యాదాయానికి దోహదపడుతున్నాయి. నైపుణ్య మానవ వనరులు, పోటీధరలు, ప్రభుత్వ మద్దతు వ్యూహాత్మక వాణిజ్య భాగస్వామ్యాలు వంటి అంశాల ద్వారా ఇది సాధ్యమవుతోంది. మేక్ ఇన్ ఇండియా ప్రోడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి పథకాలతో 2024 ఆర్థిక సంవత్సరంలో ఇంజినీరింగ్ వస్తువుల (యంత్రాలు, ఆటోమోటివ్ భాగాలు, మరియు లోహంతో సహా విస్తృత శ్రేణి ఉత్పత్తులు) ఎగుమతి 109.32 బిలియన్ అమెరికా డాలర్లతో స్థిరంగా భారతదేశపు అగ్ర ఎగుమతులలో ఒకటిగా ఉంది. ముడి చమురు నికర దిగుమతిదారుగా ఉన్నప్పటికీ, భారతదేశం గణనీయమైన శుద్ధి సామర్థ్యంతో డీజిల్, గ్యాసోలిన్ విమాన ఇంధనం వంటి శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను నెదర్లాండ్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సింగపూర్‌లకు ఎగుమతి చేస్తుంది. బంగారం, వెండి ఆభరణాల తయారీలో రాణిస్తున్న భారతదేశం వజ్రాల కటింగ్, పాలిషింగ్‌లో తన నైపుణ్యంతో ప్రపంచ కేంద్రంగా బాసిల్లుతూ ప్రధానంగా అమెరికా, హాంకాంగ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలకు వజ్రాలు, బంగారు ఆభరణాలు ఎగుమతి చేస్తోంది. ప్రపంచ ఫార్మసీగా పేరొందిన భారతదేశం జెనరిక్ ఔషధాల అతిపెద్ద సరఫరాదారుగా మాత్రమే కాక ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే 60 శాతం వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తుంది. అంతేకాదు, కోవిడ్19 సమయంలో 160దేశాలకు

యేచన్ చంద్రశేఖర్

కోవిడ్ వ్యాక్సిన్లు, ఔషధాలు సరఫరా చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఔషధాల ఎగుమతుల విలువ 30 బిలియన్ అమెరికా డాలర్లను దాటింది. సాంప్రదాయ వస్తువుల ఎగుమతి కాకపోయినా, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, సమాచార



సాంకేతిక (ఐటి)కన్సల్టింగ్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ వంటి సేవలు దేశానికి గణనీయమైన ఆదాయాన్ని ఆర్జిస్తాయి. భారతదేశ నైపుణ్య మానవ వనరులు, తక్కువ జీతభత్యాలు ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఐటిఆధారిత సేవలను కోరుకునే ప్రపంచ కంపెనీలను ఆకర్షిస్తుంది. ఈ ఎగుమతుల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12.48 వృద్ధి రేటుతో 224.40 బిలియన్ అమెరికా డాలర్లు ఆర్జించింది. ఆత్మనిర్భర్ భారత్ ప్రోత్సాహం నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ.23,622 కోట్లకు (సుమారు 2.76 బిలియన్ అమెరికా అమెరికా డాలర్లు) చేరుకుంది. భారతదేశ అంతరిక్ష ఆర్థికవ్యవస్థను గణనీయంగా విస్తరించాలనే లక్ష్యంలో భాగంగా ప్రైవేట్ అంతరిక్ష సంస్థలను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రు.1,000 కోట్ల ప్రత్యేక వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు వంటి చొరవలను చేపట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, అంతరిక్ష కార్యకలాపాల కోసం భారతదేశ వాణిజ్య విభాగం, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్, రు.3,026.09 కోట్ల ఆదాయాన్ని నివేదించింది. 202425 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం మొత్తం వస్తువులు సేవల ఎగుమతులు రికార్డు స్థాయిలో 824.90 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకున్నాయని టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వస్త్రాలు, దుస్తుల ఎగుమతుల ద్వారా 37.70 బిలియన్ అమెరికా డాలర్ల ఆదాయం చేకూరింది. జాతీయ ఖజానాకు గణనీ యంగా దోహదపడే విభిన్న శ్రేణి పరిశ్రమలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచ వాణి జ్యంలో కూడా కీలక పాత్ర పోషిస్తోయి. క్వెస్ కార్ప్ నివేదిక ప్రకారం, 2025 నాటికి భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ నిపుణులు 4లక్షలు దాటారని అంచనా. ఈ సంఖ్య అమెరికా, చైనా కంటే అత్యధికం. ప్రపంచమంతా ఇంటర్నె ట్‌తో తలమునకలవుతున్న వేళ, ప్రజలు డిజిటల్ ప్రపంచం తో అనుసంధానం అయ్యేందుకు, అధికార, అనధికార వ్యక్తిగత సమాచార మార్పిడికి సంభాషించేందుకు మొబైల్ డేటా అత్యంత కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత చౌకగా మొబైల్ డేటా అందించే దేశంగా భారతదేశం నిలుస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి రోజు అత్యల్ప లావాదేవీల నుండి అత్యధిక లావాదేవీలు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) ద్వారా జరుగుతున్నాయి. మార్చి 31, 2025 నాటికి, రికార్డుస్థాయిలో రూ. 24.77 ట్రిలియన్ల విలువ గల 19.78 బిలియన్ లావాదేవీలు నమోదయ్యాయి. మార్చి 2024తో పోలిస్తే ఇది లావాదేవీల పరంగా 36 శాతం విలువ పరంగా 25 శాతం అధికం. ఉమ్మడిగా అమెరికా, చైనా యూరప్‌లలో ఇన్ని లావాదేవీలు జరగలేదు. ఈ విధానం చిన్న, చితక వీధి వ్యాపారులనుండి భారీ వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే వారికి ఎంతో ఉపయుక్తం. పలు అంచనాల ప్రకారం జూలై2025 నాటికి, మహిళల యాజమాన్యంలోని వ్యాపారాల మొత్తం సంఖ్య 15.7మిలియన్లకు పైగా ఉంది. 2025 ప్రారంభంలో, క్రియాశీల స్టార్టప్‌లలో దాదాపు7,000 కంటే ఎక్కువ వెంచర్‌లు (7.5 శాతం) మహిళల నేతృత్వంలోనివే. భారతదేశం ఫిన్‌టెక్ రంగంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనడంతో మన ఫిన్‌టెక్ సామర్థ్యానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోంది. 90 బిలియన్ అమెరికా డాలర్ల విలువైన 26 యునికార్న్‌లకు నిలయమైన భారతదేశ సెమీకండక్టర్ మార్కెట్ 13శాతం వృద్ధితో 2030 నాటికి 103 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకుంటుందని భారతదేశ ఎలక్ట్రానిక్స్ సెమీకండక్టర్ అసోసియేషన్ అంచనా. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎఫ్‌ఎంసిజి ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతు న్న నేపథ్యంలో ఇకామర్స్ వేగంగా వృద్ధి చెందుతోంది. 2030నాటికి మార్కెట్ విలువ 325 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ప్రపంచ దేశాలను ఆశ్చర్యంలో ముంచెత్తుతూ అనూహ్యమైన ఆర్థిక ప్రగతితో భారతదేశం ముందుకుసాగుతున్న వేళ పలు అంతర్గత బాహ్యశక్తులు విచ్ఛిన్నకర కుట్రలతో ప్రగతికి ఆటంకం కలిగించి దేశంలో అస్థిరతను సృష్టించే కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఇటువంటి సందర్భాలలో దేశ ప్రజలంతా అప్రమత్త తను ప్రదర్శించి, విచ్ఛిన్నకర శక్తుల కుట్రలను భగ్నం చేసి, సంఘటితంగా దేశ సమగ్రతను,

# బడా టెర్రరిస్టు బాగుఖాన్ హతం

## నియంత్రణ రేఖ వద్ద భద్రతా బలగాల కాల్పుల్లో మరో ఉగ్రవాది కూడా కాల్చివేత



బాగుఖాన్ (ఫైల్)

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్ పోలీసులకు 25 ఏళ్లుగా కొరకురాని కొయ్యగా మారిన గజ టెర్రరిస్టు, కాశ్మీర్‌లోకి వంద మందికి పైగా చొరబాటుదారులను పంపించిన బాగుఖాన్ (50) భద్రతా బలగాల ఎదురు కాల్పుల్లో హతమయ్యాడు. హ్యూమన్ జీపిఎస్‌గా పేరొందిన బాగుఖాన్ పాక్ ఉగ్రవాద సంస్థ హిజ్బుల్ ముజాహిద్దీన్‌కు చెందిన టాప్ కమాండర్లలో ఒకడు. పాకిస్తాన్‌లోని లాహోర్‌కు చెందిన ఈ ఉగ్రవాది 30 ఏళ్లుగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో వుంటూ సరిహద్దు నియంత్రణ రేఖ వెంబడి చొరబాటుదారులను భారత్‌లోకి అక్రమంగా పంపడంలో దిట్టగా పేరుగాంచాడు. ఇప్పటి వరకు ఇతను వంద మందికి పైగా పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. పాక్ ఆక్రమిత ప్రాంతం సరిహద్దులో గల నౌషేరా, బందిపోరా, గురెజ్ సెక్టార్ల గురించి బాగు ఖాన్‌కు పూర్తి అవగాహన వుంది. ఎలాంటి కఠినమైన పరిస్థితులు ఎదురైనా, ఎంతటి కఠిన మార్గాలలో అయినా ఉగ్రవాదులను భారత్‌లోకి చొరబడేందుకు అనువైన పరిస్థితులను కల్పించడంలో ఇతను దిట్టగా పేరొందాడు. ఈ క్రమంలోనే ఇతన్ని భద్రతా బలగాలు హ్యూమన్ జీపీఎస్‌గా పిలుస్తుంటారు. దీంతో పాటు ఇతన్ని పాక్ ఉగ్రవాదులు సముందర్ చా చాగా కూడా పిలుస్తుంటారు. అనేకసార్లు ఇతను ఉగ్రవాదులను పంపే క్రమంలో జరిగిన కాల్పుల్లో తప్పించుకున్నాడు. కాగా తాజాగా ఈ నెల 23 వ తేదీన నౌషేరా సెక్టార్ ప్రాంతంలో మరోసారి ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు యత్నిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సైన్యంతో పాటు బిఎస్ఎఫ్ బలగాలు ఆపరేషన్ నిర్వహించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన బాగుఖాన్ బృందం కాల్పులకు దిగగా సైన్యం కూడా ఎదురు కాల్పులకు దిగింది. ఈ సందర్భంగా ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. మృతుల్లో ఒకరిని మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టు బాగుఖాన్‌గా గుర్తించామని సైన్యం శనివారం ఎక్స్ ద్వారా వెల్లడించింది. బాగుఖాన్‌తో పాటు చనిపోయిన మరో ఉగ్రవాదిని ఇంకా గుర్తించలేదు. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పైశాచిక దాడి తరువాత భద్రతా బలగాల కాల్పుల్లో 23 మంది టెర్రరిస్టులు హతమయ్యారు. వీరిలో 12 మంది పాక్ దేశస్తులు కాగా తొమ్మిది మంది స్థానిక ఉగ్రవాదులుగా సైన్యం వెల్లడించింది.




## భార్య వదిలేస్తే జాక్‌పాట్ కొట్టిన భర్త

### రాత్రికిరాత్రే కోటీశ్వరుడు

**న్యూజెర్సీ, ఆగస్టు 30:** అమెరికాలోని న్యూజెర్సీకి చెందిన మైక్ వీర్‌స్కీకి ఉద్యోగం లేదన్న కారణంతో భార్య విడాకులు ఇచ్చిన కొద్ది రోజులకే, అతడికి ఏకంగా రూ.2,280 కోట్ల లాటరీ తగలడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉద్యోగంలేదని, ఆర్థిక అవసరాలు కూడా తీర్చలేని భర్త ఎందుకని వీర్‌స్కీ నుంచి భార్య విడిపోయి వెళ్లిపోయింది. మైక్ వీర్‌స్కీకి గత 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే, అతడికి సరైన ఉద్యోగం లేదు. కనీస అవసరాలు కూడా తీర్చడం లేదని, బయటకు తీసుకువెళ్లడం లేదని భార్య తరచూ గొడవ పడేది. పదిహేనేళ్ల పాటు ఈ గొడవలు కొనసాగాయి. చివరికి విసిగిపోయిన ఆమె ఇక నీతో కలిసి జీవించలేను అంటూ విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. భార్య వదిలి వెళ్లిన తర్వాత మైక్ జీవితం ఊహించని మలుపు తిరిగింది. అతడు కొనుగోలు చేసిన ఓ లాటరీ టికెట్‌కు భారీ జాక్‌పాట్ తగిలింది. దాని విలువ అక్షరాలా 273 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 2,280 కోట్లు). దీంతో అతడు రాత్రికి రాత్రే కోటీశ్వరుడుగా మారిపోయాడు. ఈ వార్త కాస్తా సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. నెటిజన్లు దీనిపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. విడాకులు ఒక జాక్‌పాట్, లాటరీ రెండో జాక్‌పాట్ నువ్వు డబుల్ జాక్‌పాట్ కొట్టావు బ్రదర్ అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం తెలిసి నీ మాజీ భార్య కచ్చితంగా తిరిగి వస్తుంది చూడు అని మరికొందరు జోస్యం చెబుతున్నారు. మొత్తానికి, మైక్ వీర్‌స్కీ కథ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.




## బీహార్ 'సర్' తరహాలోనే తమిళనాడులోను ఓట్ల చోరీ

### అనుమానం వ్యక్తంచేసిన సిఎం స్టాలిన్

**చెన్నై, ఆగస్టు 30:** తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ కేంద్ర ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. 'ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో రాష్ట్రంలో ఓట్లను అక్రమంగా తొలగించే కుట్ర జరగవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీహార్‌లో జరిగిన తరహాలోనే ఇక్కడ కూడా ఓట్లచోరీకి పాల్పడే అవకాశాలు ఉన్నాయని, పార్టీ శ్రేణులు, ముఖ్యంగా బూత్ స్థాయి ఇన్‌ఛార్జులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయనపిలుపునిచ్చారు. డీఎంకే న్యాయవిభాగం కార్యదర్శి, ఎంపీ ఎన్ఆర్ ఇళంగో కుమార్తె వివాహ వేడుకలో స్టాలిన్ తన భార్య దుర్గా స్టాలిన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని అన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం, కేంద్రంలోని పాలకపక్షానికి అనుకూలంగా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో జరిగిన ఓట్ల చోరీ ఎంతటి తీవ్ర ప్రభావం చూపిస్తోందో అందరికీ తెలుసని అన్నారు. బీహార్‌లో ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించిన నిరసన ర్యాలీలో తాను కూడా పాల్గొన్నానని, దానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని స్టాలిన్ తెలిపారు. అలాంటి పరిస్థితి తమిళనాడులో పునరావృతం కాకుండా డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్షాల నాయకులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అధికారులు ఏవైనా తప్పులు చేయడానికి ప్రయత్నిస్తే వారిని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చర్యలను అడ్డుకునేందుకు ఎన్ఆర్ ఇళంగో న్యాయపోరాటం చేశారని ఈ సందర్భంగా స్టాలిన్ ప్రశంసించారు. ఈ వివాహ వేడుకకు కాంగ్రెస్ సీనియర్‌నేత పి.చిదంబరం, డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రి సామినాథన్, ఎంపీ తిరుచ్చి శివా తదితర ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## సుంకాలు అమల్లోనే ఉన్నాయి..

### కోర్టు తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన




**వాషింగ్టన్, ఆగస్టు 30:** వివిధ దేశాలపై అమెరికా విధించిన సుంకాలు అమలులోనే ఉన్నాయని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం సోషల్ మీడియాలో స్పష్టం చేశారు. సుంకాలు చట్టవ్యతిరేకమంటూ అప్పీల్స్ కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వివరణ ఇచ్చారు. సుంకాలు చట్ట వ్యతిరేకమన్న న్యాయస్థానం తీర్పుపై సుప్రీం కోర్టులో సవాల్ చేసేందుకు ట్రంప్ సర్కారుకు కొంత గడువు ఇచ్చింది.'అన్ని సుంకాలు అమలులోనే ఉన్నాయి. సుంకాలు తొలగించాలంటూ అప్పీల్స్ కోర్టు అసంబద్ధమైన తీర్పు ఇచ్చింది. కానీ తుదకు విజయం అమెరికాదే. ఈ సుంకాలను తొలగిస్తే దేశానికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఆర్థికంగా మనం బలహీనపడతాం. మనం ధైర్యంగా నిలబడాలి' అని ఆయన తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు.

వాణిజ్య లోటు, ఇతర దేశాలు తమపై అన్యాయంగా విధిస్తున్న సుంకాలను అమెరికా ఇక ఎంతమాత్రం సహించదని ట్రంప్ స్పష్టం చేశారు. మిత్ర దేశమైనా ప్రత్యర్థి దేశమైనా అమెరికా కంపెనీలు, రైతులు, ఇతరులకు వాణిజ్యపరమైన అడ్డంకులు సృష్టిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. సుంకాలు రద్దు చేసిన కోర్టు తీర్పును అంగీకరిస్తే అమెరికా నాశనం అవుతుందని హెచ్చరించారు.

మేడ్ ఇన్ అమెరికా ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, అమెరికా ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఇతర దేశాలపై సుంకాల విధింపు తప్పనిసరి అని ట్రంప్ వాదిస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టి దాదాపు 7 నెలలు అవుతోంది. రెండోసారి అధికారంలోకి వచ్చాక డొనాల్డ్ ట్రంప్ సుంకాలనే ప్రధాన ఆయుధంగా మలుచుకున్నారు. సుంకాల బెదరింపుతో పలు దేశాలను లొంగదీసుకుని డీల్స్ కుదుర్చుకునే ప్రయత్నం చేయడం, లొంగని దేశాలపై భారీగా సుంకాలను పెంచడం చేస్తున్నారు. దీనిపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికాలోనే ట్రంప్ సర్కారు నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రస్తుతం భారత్, బ్రెజిల్ ఉత్పత్తులపై ట్రంప్ సర్కారు ఏకంగా 50 శాతం సుంకం విధిస్తోంది.

## ట్రంప్ అనారోగ్యంపై సోషల్‌మీడియాలో వైరల్



**వాషింగ్టన్, ఆగస్టు 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు వెల్లువెత్తాయి. శనివారం 'ఎక్స్' వేదికగా 'ట్రంప్ ఈజ్ డెడ్' అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉండటం కలకలం రేపింది. ఈ హ్యాష్‌ట్యాగ్‌తో వేలాది పోస్టులు వెలువడటంతో 79యేళ్ల ట్రంప్ ఆరోగ్య పరిస్థితిపై జరుగుతున్న ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసినట్టయింది. ఈ వదంతులకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయి. ఆగస్టు 27న ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఒకవేళ ఏదైనా విషాదం సంభవిస్తే, బాధ్యతలు చేపట్టేందుకు నేను సిద్ధంగా ఉన్నాను' అని అన్నారు. అయితే, అదే సమయంలో అధ్యక్షుడు ట్రంప్ చాలా చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నారని కూడా ఆయన పేర్కొన్నారు. ట్రంప్ రాత్రింబవళ్లు ఎంతో ఉత్సాహంగా పని చేస్తారు. ఆయన ఆరోగ్యం చాలా బాగుంది అని వాన్స్ వివరించారు. అయినప్పటికీ, ఆయన చేసిన 'విషాదం' అనే వ్యాఖ్యను పట్టుకుని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఊపందుకుంది. కొన్ని నెలలుగా ట్రంప్ ఆరోగ్యంపై వివిధ రకాల వార్తలు వస్తున్నాయి. జూలైలో ఆయన చేతిపై గాయపు మచ్చలు, కాళ్ల వాపులతో కనిపించడం చర్చనీయాంశమైంది. ఇటీవలి కాలంలో మళ్లీ అలాంటి చిత్రాలే బయటకు రావడం, వాటిని మేకప్‌తో కప్పిపుచ్చే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు రావడంతో అనుమానాలు బలపడ్డాయి. దీనికితోడు, ఆయన కొంతకాలంగా బహిరంగంగా కనిపించడం లేదనే ప్రచారం కూడా ఈ వదంతులకు కారణమైంది. అయితే, ఈ ప్రచారంలో వాస్తవం లేదని తెలుస్తోంది. ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో చురుగ్గానే ఉన్నారు. ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో శనివారం తెల్లవారుజామున 3:40 గంటలకు కూడా ఒక పోస్ట్ చేశారు. వాషింగ్టన్ కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 6:40 గంటల సమయానికి ఆయన ఆ పోస్టు పెట్టారు.


## నిరసన తెలిపిన బిజెపి కేడర్‌కు మిఠాయిలు పంచిన రాహుల్




**పాట్నా, ఆగస్టు 30:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన రాజకీయ యాత్రలో ఓ అనూహ్య చర్యతో అందరినీ ఆశ్చర్యపరిచారు. బీహార్‌లో తనకు వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న వారికి ఆయన స్వయంగా మిఠాయిలు అందించారు. వోటర్ అధికార్ యాత్ర నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీకి భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) కార్యకర్తల నుంచి నిరసన ఎదురైంది. ఇటీవల రాహుల్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన తల్లిని ఉద్దేశించి కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వారు నల్ల జెండాలు ప్రదర్శించారు. అయితే, నిరసనకారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేయకుండా రాహుల్ గాంధీ వారి వద్దకు మిఠాయిలు పంపించి సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించారు. ఈ నిరసనల మధ్యే రాహుల్ గాంధీ తన యాత్రను కొనసాగించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పాటు ఎన్నికల సంఘం కూడా కలిసి దేశంలో ఓట్లను దొంగిలిస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. బీహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఈ యాత్ర దేశవ్యాప్త ఉద్యమంగా మారుతుందని ఆయన స్పష్టంచేశారు. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యల వీడియో వైరల్ కావడంతో బీజేపీ తీవ్రంగాస్పందించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ, సత్యం, అహింస గెలుస్తాయి, అసత్యం, హింస నిలబడవని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది దళితులు, మైనారిటీలు, మహిళలదని, కానీ మోదీ ప్రభుత్వం గెలుపు కోసం ఓట్లను దొంగిలిస్తోందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో ఒక్క ఓటు కూడా దొంగతనానికి గురికాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఎనిమిదినెలల్లో 841 మంది ఉరితీత

### ఇరాన్‌లో అత్యంత కఠినంగా ఉరిశిక్షలు అమలు




**టెహ్రాన్, ఆగస్టు 30:** ఇరాన్‌లో మరణశిక్షల అమలు ఆందోళనకర స్థాయిలో పెరిగిపోయిందని ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అసమ్మతి గళాలను, వ్యతిరేకతను అణచివేసేందుకు అక్కడి ప్రభుత్వం ఉరిశిక్షలను ఒక ఆయుధంగా ప్రయోగిస్తోందని ఆరోపించింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆగస్టు 28 వరకు కేవలం ఎనిమిది నెలల వ్యవధిలోనే ఇరాన్‌లో కనీసం 841 మందికి మరణశిక్ష అమలు చేశారని యూఎన్ మానవ హక్కుల విభాగం (ఓహెచ్‌సీహెచ్ఆర్) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఉరిశిక్షల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు యూఎన్ నివేదిక స్పష్టం చేసింది. కేవలం జులై నెలలోనే 110 మందిని ఉరితీశారని, ఇది గతేడాది జులైలో నమోదైన సంఖ్యకు రెట్టింపు కంటే ఎక్కువని తెలిపింది. మరణశిక్షకు గురైన వారిలో మహిళలు, ఆఫ్ఘనిస్థాన్ పౌరులతో పాటు బలోచ్, కుర్దులు, అరబ్బుల వంటి మైనారిటీ వర్గాల వారు అధికంగా ఉన్నారని పేర్కొంది. పారదర్శకత లేకపోవడం వల్ల వాస్తవ మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఐరాస ప్రతినిధి రవీనా షమ్దాసాని అన్నారు. మైనారిటీలు, వలసదారులనే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆమె వివరించారు. ఇరాన్‌లో బహిరంగంగా ఉరితీయడాన్ని కూడా ఐక్యరాజ్య సమితి తీవ్రంగా ఖండించింది. ఈ ఏడాది ఇప్పటివరకు ఏడు బహిరంగ ఉరిశిక్షలు నమోదయ్యాయని పేర్కొంది. ఇలాంటి చర్యలు ప్రజల్లో, ముఖ్యంగా వాటిని చూడవలసి వస్తున్న చిన్నారులలో తీవ్ర మానసిక క్షోభకు కారణమవుతాయని షమ్దాసాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మరో 11 మంది ఉరిశిక్ష ప్రమాదంలో ఉన్నారని ఐరాస తెలిపింది. వీరిలో ఆరుగురిపై ప్రవాస ప్రతిపక్ష సంస్థ పీపుల్స్ ముజాహిదీన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇరాన్ (ఎంఈకే) తో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 'సాయుధ తిరుగుబాటు' అభియోగాలు మోపారు. మిగిలిన ఐదుగురిని 2022 నాటి నిరసనల్లో పాల్గొన్నందుకు దోషులుగా నిర్ధారించారు. వీరిలో కార్మిక హక్కుల కార్యకర్త షరీఫే మహమ్మది కూడా ఉన్నారు.

ఆమెకు విధించిన మరణశిక్షను గతవారమే ఇరాన్ సుప్రీంకోర్టు ఖరారు చేసింది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ ఈ విషయంపై స్పందిస్తూ, ఇరాన్ తక్షణమే మరణశిక్షలపై తాత్కాలిక నిషేధం (మారిటోరియం) విధించాలని డిమాండ్ చేశారు. "మరణశిక్ష జీవించే హక్కును కాలరాస్తుంది. దీనివల్ల అమాయకులను ఉరితీసే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది" అని షమ్దాసాని తెలిపారు. గత ఏడాది ఇరాన్‌లో 850 మందికి పైగా మరణశిక్ష అమలు చేసినట్లు మానవ హక్కుల సంస్థలు నివేదించగా, ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరగడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది.



## మాజీ ఎమ్మెల్యే పింఛన్‌కు జగదీప్ ధన్‌ఖడ్ దరఖాస్తు

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** పదవీ కాలం మిగిలి ఉన్నప్పటికీ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తూ జగదీప్ ధన్‌ఖడ్ తీసుకున్న అనూహ్య నిర్ణయం దేశరాజకీయాల్లో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన మాజీ ఎమ్మెల్యే పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా అందుకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. ధన్‌ఖడ్ గతంలో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో అజ్మేర్‌లోని కిషన్‌గడ్ నుంచి కాంగ్రెస్ తరపున విజయం సాధించారు. ఆ సమయంలో రూల్స్ కమిటీకి సభ్యుడిగానూ పనిచేశారు. నిబంధనల ప్రకారం రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే రూ.35వేల పింఛన్‌కు అర్హులు. అలాగే వయసు ఆధారంగా ఆ మొత్తంలో పెంపు ఉంటుంది. 70 ఏళ్ల దాటిన మాజీ సభ్యుడికి 20 శాతం అదనపు పింఛను అందుతుంది. అదే 80 యేళ్ల దాటితే అది 30 శాతంగా ఉంటుంది. మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ప్రస్తుత వయసు 74 యేళ్లు. దాంతో ఆయనకు రూ.42వేల వరకు పింఛన్ లభించనుంది. ఈ పింఛన్ దరఖాస్తు అందిందని రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్ వాసుదేవ్ దేవనాని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ధన్‌ఖడ్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. లోక్‌సభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. 2003లో బిజెపిలో చేరారు. 2019 నుంచి 2022 మధ్య పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022ఆగస్టులో ఉపరాష్ట్రపతిగా నియమితులైన ధన్‌ఖడ్ రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉండగానే అనూహ్యంగా వైదొలిగారు. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

## దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం, శత్రుత్వం ఉండదు..

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం , శత్రుత్వం అంటూ ఏమీ ఉండదని, అలాగే శాశ్వత మిత్రులు కాని, శత్రువులు కాని ఉండరని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. కేవలం ఆ దేశానికి ఉపయోగపడే శాశ్వత ప్రయోజనాలే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రక్షణరంగంలో ఆత్మనిర్భరత సాధించడం అత్యావశ్యకమని ఓ జాతీయ మీడియా సదస్సులో అన్నారు. పహల్గాం ఉగ్రదాడి - ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రధాని మోడీ చైనా పర్యటన నేపథ్యంలో భారత్ అనుసరిస్తోన్న వైఖరిని వెల్లడించారు. ప్రపంచం వేగంగా మారుతోంది. అదే సమయంలో కొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి. మహమ్మారులు, ఉగ్రవాదం, ప్రాంతీయ ఘర్షణలు వంటి వాటితో ఈ శతాబ్దం అత్యంత సవాలుతో కూడి ఉందని అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో మన వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా, ఆత్మనిర్భరత అనేది అత్యావశ్యకం. మనకు శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు. శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. భారత్ ఎవరినీ శత్రువుగా పరిగణించదు. మన రైతులు, వ్యాపారవేత్తల ప్రయోజనాలే మనకు ముఖ్యం. ప్రస్తుతం మారుతున్న భౌగోళిక రాజకీయాల కారణంగా రక్షణ పరంగా విదేశాలపై ఆధారపడడం సరైన ఎంపిక కాదని స్పష్టమవుతోంది. స్వావలంబన అనేది మన ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అత్యవసరం. 2014లో మన రక్షణ రంగం ఎగుమతుల విలువ రూ.700 కోట్లు. ఇప్పుడది రూ.24వేల కోట్లకు చేరింది. ఈ గణాంకాలు చూస్తుంటే భారత్ ఒక కొనుగోలుదారుగానే మిగలకుండా ఎగుమతిదారుగా మారుతుందని వెల్లడవుతోంది. ఇక మన బలగాలు స్వదేశీ పరికరాలతో లక్ష్యాలపై కచ్చితత్వంతో చేసిన దాడులు దూరదృష్టి, సమన్వయానికి నిదర్శనం. అలాంటి సన్నద్ధత లేకపోతే ఏ మిషన్ విజయవంతం కాదు అని మంత్రి పేర్కొన్నారు. భారత్‌ను మిత్ర దేశం అంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల మోత మోగించారు. రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు గతంలో విధించిన 25 శాతానికి అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించారు. అవి ప్రస్తుతం అమలవుతున్నాయి. ఈ తరుణంలోనే ఏడేళ్ల తర్వాత తొలిసారి ప్రధాని మోడీ చూనా పర్యటనకు వెళుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## సంక్షిప్తంగా..

### ఉక్రెయిన్ పార్లమెంట్ మాజీ స్పీకర్ ఆండ్రీ పరుబీ దారుణ హత్య



**కీవ్, ఆగస్టు 30:** ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ఆపేందుకు ఓవైపు చర్చలు జరుగుతున్నా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం రోజు రోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. గత రెండురోజులుగా మాస్కో, కీవ్‌పై భారీ దాడు లకు పాల్పడుతోంది. ఈ క్రమంలో ఉక్రెయిన్ పార్లమెంట్ మాజీ స్పీకర్ ఆండ్రీ పరుబీ దారుణ హత్యకు గురైనట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు.లివివ్ ప్రాంతంలో ఆండ్రీ పరుబీని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి నట్లు తెలిపారు. నిందితుల కోసం అధికారులు తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారన్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధిస్తామన్నారు. మరోవైపు డొనెట్స్క్ ప్రాంతంలోని ఓ గ్రామాన్ని తమ దళాలు అధీనంలోకి తీసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఉక్రెయిన్ క్షిపణి, విమానయాన సంస్థలతో పాటు, సైనిక, వైమానిక స్థావరాలపై కచ్చితమైన దాడులు చేస్తున్నట్లు పేర్కొంది. కాగా రాత్రి రష్యా జరిపిన సముద్ర డ్రోన్‌దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

### భారత్ మిసైల్ దాడులతో సీజ్‌ఫైర్‌కు దిగొచ్చిన పాకిస్థాన్: నర్మదేశ్వర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** ఆపరేషన్ సిందూర్‌కు సం బంధించిన వివరాలను వెల్లడించిన ఎయిర్ స్టాఫ్ వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ. ఆపరేషన్ సిందూర్‌తో భారత బలగాలు అత్యంత కచ్చితత్వంతో పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని లక్ష్యాలను ఛేధించాయి. దీంతో దాయాది కాళ్లబేరానికి వచ్చింది. అందుకోసం వైమానికదళం 50 కంటే తక్కువ ఆయుధాలనే ప్రయోగించిందని ఆయన వెల్లడించారు. 'యుద్ధాన్ని ప్రారంభించడంసులభమే. ముగించడం అంత సులువైన పనికాదు. దానిని దృష్టిలో పెట్టుకుని మన బలగాలను సంసిద్ధంగా ఉంచాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా మోహరింపులు చేపట్టాం' అని ఆయన వెల్లడించారు. నియంత్రణరేఖ వెంట నాలుగు రోజులపాటు ఖచ్చితమైన లక్ష్యాల తో చేసిన మిసైల్‌దాడులతో మే 10నపాకిస్థాన్ సీజ్‌ఫైర్‌కు దిగొచ్చిందని పేర్కొన్నారు.

### తొక్కిసలాట బాధితులకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం



**బెంగళూరు, ఆగస్టు 30:** ఐపీఎల్ 2025 టైటిల్ గెలిచిన సంబరాల్లో జరిగిన ఘోర విషాదంపై దాదాపు మూడు నెలల మౌనం తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) యాజమాన్యం ఎట్టకేలకు స్పందించింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది అభిమానుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు శనివారం అధికారికంగా వెల్లడించింది. 'ఆర్సీబీ కేర్స్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ద్వారా తెలిపింది. జూన్ 4న మా హృదయాలు ముక్కలయ్యాయి. మా ఆర్సీబీ కుటుంబంలోని 11 మంది సభ్యులను కోల్పోయాం. వారి లేని లోటును ఏ సాయమూ పూడ్చలేదు. కానీ ఒక తొలిఅడుగుగా, వారి కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున అందిస్తున్నాం. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదు. కరుణ, ఐక్యత, నిరంతర సంరక్షణకు ఇదొక వాగ్దానమని ఆర్సీబీ యాజమాన్యం పేర్కొంది.

## రూ.500లకు కక్కుర్తిపడ్డ కానిస్టేబుల్, లాయర్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లోని ఝూన్సీలో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. నేరస్తులకు ఎస్కార్టుగా వుండే ఓ కానిస్టేబు ల్, మరో మహిళా లాయర్ కేవలం 500 రూపాయలకు కక్కుర్తి పడి ఓ నేరగాడికి ఫోన్ ఇవ్వగా, అతను ఈ ఫోన్‌తో ఏకంగా ఓ బడా వ్యాపారికి ఫోన్ చేసి తనకు వెంటనే కోటి రూపాయలు డబ్బులు కావాలని, లేకుంటే చంపేస్తానని బెదిరించాడు.

తనకు వచ్చిన బెదిరింపు కాల్‌ను వీరేంద్ర రాజ్‌పుత్ అనే వ్యాపారి రికార్డు చేసి దీనిని జిల్లా పోలీసు అధికారులకు ఇచ్చి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా చూశాడు. దీంతో ఈ ఘటన యుపి వ్యాప్తంగా సంచలనం రేపింది.

# శాఖల మధ్య సమన్వయ లోపం - విద్యార్థులకు శాపం

## విద్యార్థుల పరిస్థితి త్రిశంకు స్వర్గం - ప్రభుత్వం స్పందించి జీవో విడుదల చేయాలి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త** సుమారు ఏడు సంవత్సరాల పాటు మూత పడ్డ శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో నిర్వహిస్తున్న స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభించుటకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పాలకులు చుట్టు ప్రదక్షిణలు చేసి సాధించారు. మూడేళ్ళ పాటు (రూ.120కోట్లు) నిధులు ప్రభుత్వమే భరించుటకు ఒప్పించారు. ఈ నేపధ్యంలో ఈ కళాశాల నిర్వహణను అనంతపురంలోని జేయన్‌టియుకు అప్పగించుటకు ఆ యూనివర్శిటి నిర్వాహకులు కూడా హాజరై ప్రకటించారు. ఈ నేపధ్యంలో రెండవ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలకు అనుమతించారు. ఈ నేపధ్యంలో 68 మంది ఇక్కడ చేరటానికి ఆప్షన్స్ ఇచ్చారు. అయితే కౌన్సెలింగ్ సమయంలో 37 మంది చేరటానికి సుముఖత చూపారు. రాష్ట్రంలోని ఇతర కళాశాలల్లో తరగతులుకూడా ప్రారంభ మయ్యాయి. అయితే శ్రీకాళహస్తి కళాశాలలో మాత్రం ఇంకా ఎటూ తేలని పరిస్థితి చోటు చేసుకుంది. శాసనసభ్యుడు అనుమతి అయితే సాధించారు. ఆన్‌లైన్లో విద్యార్థులు చేరటానికి సుముఖత చూపారు. అయితే జేయన్‌టియుకు



శ్రీకాళహస్తిలోని ఇంజనీరింగ్ కళాశాల

అప్పగించినట్లు దానికి సంబంధించిన ఒప్పందాలపై ఎంఒయులు జరగాల్సి ఉంది. ప్రభుత్వం ఈ మేరకుజిఓ జారి చేయాల్సి ఉంది. కానీ ఎందుకో ఆ ప్రక్రియ అమలు జరగలేదు. ఇతర కళాశాలల్లో తరగతులు ప్రారంభం అయి జరుగుతుంటే ఇక్కడ ఆప్షన్ ఇచ్చి చేరిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జేయన్‌టియు ఉపాధ్యాయ బృందం ఇక్కడకు రావాల్సి ఉంది. ఇందుకు ప్రభుత్వం ఒప్పందాలు జరపాలి. ఉత్తర్వులు జారి చేయాల్సి ఉంది. ఈ కళాశాల ఇంత కాలం దేవాదాయశాఖ పరిధిలో సాగింది. ఇక పై అనంతపురానికి చెందిన జేయన్‌టియు సారధ్యంలో నిర్వహించబడుతుందని 'కోడ్ కూడా' ఇచ్చారు. అయితే ఈ మేరకు ప్రభుత్వం ఒప్పందం చేస్తూ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రతిపాదన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్ద ఎపెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖలు కలసి ముఖ్యమంత్రి వద్ద చర్చించాల్సి ఉంది. దీనికి సంబంధించి ఉద్యోగుల మాటేమిటి? ఆర్థిక పరిస్థితి ఏమిటి? ఎలా నిర్వహిస్తారు. అనే అంశాలపై ఒప్పందం జరగాల్సి ఉంది. శ్రీకాళహస్తిలోని ఇంజనీరింగ్ కళాశాలను జేయన్‌టియు తీసుకుందని తెలియటంతో రెండవ కౌన్సెలింగ్ లో 68 మంది ఆప్షన్‌లు ఎపెట్టారు. వారిలో 37 మంది చేరటానికి సిద్ద మయ్యారు. అయితే ఇక్కడ చోటు చేసుకున్న సందిగ్దంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జేయన్‌టియు నిర్వాహాకులేమో ప్రభుత్వం జివో జారి చేస్తే తాము ముందడుగు వేస్తామని మౌనం వహించారు. ఇక్కడ జేయన్‌టియు వారు అడుగుపెడితే కౌన్సెలింగ్‌లో అవకాశం రాని వారు మరో 70 మంది వరకు చేరటానికి సిద్దంగా ఉన్నట్లు సమాచారం. కానీ రోజులు గడుస్తున్న కొద్ది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంలో జాప్యం చేస్తుండటంతో 'భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా' మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపాలి.

# వైభవోపేతంగా సింహాచల వరాహ లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణం

## - వాసవి మార్కెట్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనమైన నిర్వహణ



సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణంలోప్రముఖులు

**విజయవాడ.ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి:** సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో శోభాయమానంగా జరిగింది. గణపతి ఉత్సవ కమిటీ వాసవి మార్కెట్ ఆధ్వర్యంలో సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్త జననీరాజనాల నడుమ జరిగింది. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం ఎదురుగా పట్టణ రథం సెంటర్‌లో వేద మంత్రాల నడుమ భక్తుల సందోహం మధ్య కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవాన్ని ప్రధాన అర్చకులు శ్రీమాన్ కే. సీతారామాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు శ్రీమాన్ నృసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సహస్రనామార్చన, నీరాజనం, మంత్రపుష్పములు, లక్ష్మీనారాయణ సుదర్శన హోమం వంటి వైదిక కర్మలు ఘనంగా జరిగాయి. కదలి ఫలములు, పుష్పాలతో స్వామివారి అలంకారం భక్తులను ఆకట్టుకుంది. కళ్యాణ మహోత్సవంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), శ్రీరామ్ చిన్నబాబు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి మండల కృష్ణకుమారి, కూటమి నేతలు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు కూడా భక్తి శ్రద్ధలతో స్వామివారి కళ్యాణాన్ని వీక్షించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం వేద పండితులు ప్రముఖులను దృశ్యాలువాతో సత్కరించారు. వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై కళ్యాణం దర్శించుకున్నారు.

గణపతి ఉత్సవాల మధ్య భాగంగా జరిగిన ఈ కళ్యాణ మహోత్సవం నందిగామ పట్టణాన్ని ఆధ్యాత్మిక ఉత్సాహంతో నింపింది. వేలాది మంది భక్తులు స్వామివారి కళ్యాణాన్ని వీక్షించి ఆధ్యాత్మికానందం పొందారు. నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుని మండపం వినాయక చవితి సందర్భంగా భక్తులను ఆకర్షిస్తోంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ గణేష్ మండపం సంప్రదాయ శోభతో, ఆకర్షణీయమైన అలంకరణలతో భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందిస్తోంది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ (తెదేపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పభుత్వ విప్,ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య జగ్గయ్యపేట శాసనసభ్యులు రామ్ రాజగోపాల్ (తాతయ్య) ఈ భారీ గణనాథుని మండపాన్ని దర్శించి, ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవినేని ఉమామహేశ్వరరావు గణపతి దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలు భక్తులలో ఆధ్యాత్మిక భావనలను, సామాజిక సామరస్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు చేసిన ఏర్పాట్లను అభినందిస్తూ, ప్రజలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేతంగిరాల సౌమ్య గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, విఘ్నేశ్వరుడు అన్ని విఘ్నాలను తొలగించి, భక్తులకు సుఖసంతోషాలను ప్రసాదిస్తాడని, ఈ ఉత్సవాలు ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి,

ఐశ్వర్యాన్ని తెస్తాయని ఆకాంక్షించారు. జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీ రామ్ రాజగోపాల్ (తాతయ్య) గారు కూడా గణనాథుని దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, నందిగామ పట్టణంలో ఈ వినాయక చవితి ఉత్సవాలు భక్తులకు ఆనందాన్ని, ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని అందిస్తున్నాయని, నిర్వాహకుల కృషిని ప్రశంసించారు.

# రైల్వే యాంత్రిక విభాగంలో 15మందికి గ్రూపు 'బి' అధికారులుగా పదోన్నతి

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 30,ప్రభాతవార్త** భారతీయ రైల్వేలో ఖాళీగా ఉన్న గ్రూప్ 'బి' పోస్టుల భర్తీకి జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో 15మంది అభ్యర్థులు ఎంపిక చేసినటు 2025ప్యానల్‌ను రైల్వే బోర్డు డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్ సింగ్ విడుదల చేశారు. వీరిలో చెన్నైలోని ఐసిఎఫ్ ఉత్పత్తి కర్మాగారానికి చెందిన వారు ముగ్గురు, ఈశాన్య రైల్వే జోన్‌కు చెందిన వారు ఇద్దరు, ఆగ్నేయ రైల్వే జోన్‌కు చెందిన వారు మరో ఇద్దరు, దక్షిణ మధ్య రైల్వే నుంచి నలుగురు సెంట్రల్ రైల్వే నుంచి ఇద్దరు, నార్థన్ రైల్వే నుంచి మరో ఇద్దరు చొప్పున మొత్తం 15మంది అభ్యర్థులు రైల్వే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో గ్రూప్ బి అధికారులుగా నియమించబడ్డారు.

# చంద్రగ్రహణం రోజున శివయ్యకు శాంతి అభిషేకాలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 30 ప్రభాతవార్త** సెప్టెంబర్ నెలలో రెండు గ్రహణాలు రానున్నాయి. సెప్టెంబర్ 7 పౌర్ణమి రోజు సంపూర్ణ చంద్రగ్రహణం, 21న సూర్యగ్రహణం చోటు చేసుకోనుంది. ఈ రెండు కూడా భారత దేశం దర్శనమిస్తాయి. ఈ నేపధ్యంలో గ్రహణాలకు అతీతంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాంతి అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. సెప్టెంబర్ 7న చంద్రగ్రహణం రాత్రి 9.58గంటలకు ప్రారంభం అవుతుందని శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పండితులు చెబుతున్నారు. 8వ తేది వేకువ జాము 1.26గంటలకు ముగుస్తుందని వివరించారు. 7వ తేది రాత్రి 11.42గంటలకు చంద్రుడు పూర్తిగా కనబడదని వివరించారు. సాధారణంగా గ్రహణం అంటే ఇబ్బంది అని అర్థం. ఈ సమయంలో శాంతింపజేయాలి కాబట్టి ఆ సమయంలో ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుడు తనకు అలంకరించే కవచంలో తొమ్మిది గ్రహాలను 27 నక్షత్రాలను పొందుపరచుకున్నారు కాబట్టి ఆ స్వామికి శాంతి అభిషేకాలు నిర్వహిస్తారు. గ్రహణ కాల అభిషేకం దర్శించుకోవటం శుభప్రదమంటారు.

ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తీశ్వరాయలంలో పూజలు నిర్వహిస్తారు. అలాగే 21న సంపూర్ణ సూర్యగ్రహణ సందర్భంగా కూడా శాంతి అభిషేకాలు జరుపుటకు నిర్ణయించినట్లు సమాచారం.

# కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి పట్టువస్త్రాలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 30, ప్రభాతవార్త** శ్రీకాణీపాకం వరసిద్ధి వినాయక స్వామివారి కి బెజవాడ దుర్గమ్మవారి తరపున పట్టువస్త్రాలు ఇఓ వికె శీనా నాయక్ బృందం శనివారం కాణీపాకం ఇఓ పెంచల కిషోర్‌కు అందించారు. పట్టువస్త్రాలను తీసుకుని కాణీపాకం ఆలయానికి చేరుకున్న దుర్గమ్మఆలయ ఇఓ బృందంకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, మంత్రపఠనాల నడుమ అపూర్వ స్వాగతం పలికి శ్రీ స్వామివారి సన్నిధికి తోడ్కొని వెళ్ళారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి పట్టువస్త్రాలను స్వామివారి చెంత వుంచారు. అనంతరం దుర్గమ్మ ఆలయ ఇఓ వికె శీనా నాయక్ బృందానికి శ్రీ కాణీపాకం వినాయక స్వామివారి జ్ఞాపిక, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించి వేదాశీర్వచనాలం



కాణీపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం ఇఓ దుర్గగుడి ఇఓ బృందానికి మెమెంటో అందిస్తున్న దృశ్యం



కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో దుర్గగుడి ఇఓ, తదితరులు పట్టువస్త్రాలు అందిస్తున్న దృశ్యం

పలికారు. కార్యక్రమం లో దుర్గమ్మ ఆలయ ప్రధాన అర్చకులు ఎల్ దుర్గాప్రసాద్, ఇఇ బి రాంబాబు, అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్ రంగారావు, ఏఇఓ డా కె గంగాధర్, వైదిక కమిటీ సభ్యులు శ్రీధర్ శర్మ, దేవస్థానం అర్చకులు ఆర్ శ్రీనివాస శాస్త్రి, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. దుర్గమ్మ వారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం రు.1,00,116ల విరాళాన్ని తాడేపల్లికి చెందిన డి శివనాగరాజు, దుర్గారాణి దంపతులు అందించారు. అదేవిధంగా వేద పరిరక్షణ ట్రస్టుకు రు.1లక్ష విరాళాన్ని, గో సంరక్షణకోసం రు.50వేలను అమెరికాలోని టెక్సాస్ కు చెందిన భక్తురాలు సాయి సౌమ్య కామ రాజు, భర్త యశ్వంత్ రావు, కుమారుడు ఇషాన్‌కృష్ణ పేరిట తన కుటుంబసభ్యులతో కలిసి అందించారు. అలాగే రు.5లక్షల విరాళాన్ని హైదరాబాద్ లోని మేఘమాల ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జగన్ మోహన్‌రెడ్డి, భార్య అనుపమలు శనివారం అందించారు.

# నెల్లూరు పురవీధుల్లో మహిళల స్త్రీ శక్తి భారీ ర్యాలీ

## - థాంక్యూ సిఎం సార్ అంటూ నినాదాలు

## - సూపర్ సిక్స్- సూపర్ హిట్ అంటూ ముందుకు నడిచిన మహిళలు




**నెల్లూరు, ఆగస్టు 30, ప్రభాతవార్త-వైద్యం** సంక్షేమ పథకాలను అమలు చేయడం అన్ని ప్రభుత్వాలు చేసే పనే, కానీ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పలా మార్చినా, ఖజానా ఖాళీ చేసి వెళ్లినా, ఏ మాత్రం తడబడకుండా పథకాల అమలు విషయంలో తన చిత్తశుద్ధి నిరూపించుకుంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే సూపర్‌సిక్స్ హామీలను పట్టాలెక్కించింది. అధికారంలోకి వచ్చి రాగానే పెన్షన్ల పెంపు ద్వారా తన చిత్తశుద్ధి నిరూపించుకుంది. పెన్షన్లు పెంచడమే కాదు, బకాయిలు కూడా చెల్లించి మంచి మనసు చాటుకున్నారు. సీఎం చంద్రబాబు, వృద్దులు, వితంతువులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రతస్తులు, ఇలా అందరికి పెన్షన్లు పెంచారు. ఏడాదికి రూ.33వేల కోట్లు కేవలం పెన్షన్ల కోసమే ఖర్చు చేయడం ఈ ప్రభుత్వం ఘనత అనే చెప్పుకోవాలి. తల్లికి వందనం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అందరికి పథకాన్ని వర్తింపచేయడం మరో సాహసం అనే చెప్పాలి. ప్రతి పిల్లవాడికి రూ.15వేలు చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ రైతులకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ.20వేలకు పెంచింది. ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తోంది. స్త్రీ శక్తి పథకం ద్వారా మమిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వెంటనే తొలి సంతకాన్ని మెగా డీఎస్సీ పైలుపై చేసి ఏడాదిన్నరలోనే రిక్రూట్‌మెంట్ కూడా పూర్తి చేసి 16వేల మందికి పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వబోతోంది. కూటమి ప్రభుత్వం ఇవన్నీ ప్రచారం కోసం చెబుతున్న మాటలు కాదు, ప్రచార ఆర్భాటాలు ఎంత మాత్రం కాదు, హామీలు అమలైన వేళ మహిళామణులు స్వచ్ఛందంగా తరలి వచ్చి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. నెల్లూరు పురవీధుల్లో మహిళలు ప్రభుత్వానికి ధన్యవాద ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మొదలైన ఈ ర్యాలీ పప్పుల వీధి వరకు సాగింది. దారి పొడవునా మహిళలు నినాదాలతో హోరెత్తించారు. సూపర్ సిక్స్- సూపర్ హిట్ అంటూ ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. నెల్లూరు నగరంలో జరిగిన ఈ ర్యాలీ కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం అయింది. 5వేల మంది వస్తారని అంచనా వేస్తే దాదాపు 10 వేల మందికి పైగా ర్యాలీలో పాల్గొన్నారని సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ఆధ్వర్యంలో మహిళా నేతలు కదం తొక్కారు. మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్ళపాక అనురాధ, నెల్లూరు సిటీ నియోజకవర్గ మహిళా క్లస్టర్లు కపిర రేవతి, విజయమ్మ, శ్రీలక్ష్మీ, అంచురు జానకి, మంజుల, శిల్పా, చందన, గౌసున్నీసా, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, బీజేపీ, జనసేన నేతలు , మహిళా కార్పొరేటర్లు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నెల్లూరు పురవీధుల్లో సూపర్‌సిక్స్ - సూపర్ హిట్ అంటూ నినాదాలు చేస్తూ మహిళలు ముందుకు కదిలారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేపట్టారు. ర్యాలీ అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

అనంతరం ఈ కార్యక్రమంలో మహిళా నేతలు ప్రసంగించారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా కూడా సూపర్‌సిక్స్ పథకాలను అమలులో పెట్టిన సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్‌గా ఆర్‌డి విల్సన్

**విజయవాడ,ఆగస్టు 30,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ గా విల్సన్ తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ గా ఆర్. డి. విల్సన్ శరత్ చంద్ర ని నియమాకం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 156 విడుదల చేసింది. విల్సన్ బీజేపీ అధికార ప్రతినిధి గానూ,గతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. దశాబ్ద కాలం పైగా బీజేపీ కి సేవలు అందించారు. అంతకు ముందు ఆయన కాంగ్రెస్ పార్టీ హయాం లో ఉమ్మడి రాష్ట్రములో ఎస్. సి కార్పొరేషన్ చైర్మన్ గా పని చేశారు. విల్సన్ ఉన్నత విద్యావంతుడు. ఈనాడు, ఆంధ్ర జ్యోతి లో ఏడేళ్లు పని చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 9 ఏళ్ళు పని చేసి తన ఉద్యోగం కి రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. సృజన శీలి శరత్ చంద్ర కలం పేరుతో నాలుగు వందలకు పైగా కథలు, 20 పైగా నవలలు రాసారు. ప్రస్తుతం ఉషా సాహితీ పత్రికలకు సంపాదకులు గా వ్యవహరిస్తున్నారు. తానా సభల్లోనూ, అంతర్జాతీయ తెలుగు మహాసభల్లోనూ వక్త గా పాల్గొని తన బాణీ వినిపించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తనని నమ్మి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడి గారికి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ గారికి,జనసేన నేత పవన్ కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాషా వికాసం కొరకు కృషి చేస్తాను అన్నారు.



# వైద్య విద్య ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రఘునందన్

**విజయవాడ,ఆగస్టు30,ప్రభాతవాక్తప్రతినిధి:** వైద్య విద్య ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా జి రఘునందన్‌ను రాష్ట్రప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జివో 550ను వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు శనివారం విడుదల చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా ఉన్న అడిషనల్ డైరెక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం ఈ నెల 31వ తేదితో పదవి విరమణ చేయనున్నారు. ప్రస్తుతం నియమించిన రఘునందన్ కూడా అడిషనల్ డైరెక్టర్‌గా వైద్య విద్య డైరెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

# రోగులను పరీక్షిస్తూ గుండెపోటుతో చనిపోయిన కార్డియాక్ సర్జన్!

**చెన్నై, ఆగస్టు 30:** హృద్రోగ బాధితులకు చికిత్స చేసి ప్రాణాలు కాపాడే వైద్యుడు అదే గుండెపోటుతో మరణిం చాడు. ఆసుపత్రిలో రోగు లను పరీక్షిస్తూ ఒక్క సారిగా కుప్పకూలాడు. ఆయనను కాపాడేందుకు తోటి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తమిళనాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సేవలందిస్తున్న యువవైద్యుడు బుధవారం రాత్రి కన్ను మూశాడు. ఓ కార్డియాక్ సర్జన్ గుండెపోటుతో చనిపోవడంపై వైద్య వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డాక్టర్ గ్రాడ్లిన్‌రాయ్ (39) కార్డియాక్ సర్జన్ గా సేవ లందిస్తున్నారు. బుధవారం రాత్రి ఆసుపత్రిలో విధుల్లో ఉన్నారు. హృ ద్రోగ వార్డులోని పేషెంట్లను పరీక్షిస్తుండగా రాయ్ గుండెపోటుకు గుర య్యారు. అకస్మాత్తుగా కుప్పకూలిన డాక్టర్ రాయ్ ను వెంటనే ఐసీ యూకు తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని గ్రాడ్లిన్ రాయ్ ప్రాణాలు కోల్పోయారని ఆసుపత్రి అధికారులు తెలిపారు. హృద్రో గాలపై పూర్తి అవగాహన కలిగిన కార్డియాక్ సర్జన్ అదే గుండెపోటుతో మరణించడంపై వైద్య వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రాడ్లిన్ రాయ్‌కు ఎలాంటి అనారోగ్య సమస్యలు కూడా లేవని ఆయన సహచర వైద్యుడు సుధీర్ కుమార్ పేర్కొన్నారు. వైద్యులు రోజుకు 1218 గంటలు పనిచేయాల్సి వస్తుందని, అందువల్ల వారిపై ఒత్తిడి అధికంగా ఉంటుం దని అన్నారు. రాయ్ మరణానికి ఇదే కారణమై ఉంటుంది.

# అవినీతి, అక్రమాలకు పాల్పడే వైద్యుల ప్రవర్తనపై నిఘా నేత్రాలు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 30,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని కొన్ని డివిజన్‌లలో అవినీతి, అక్రమాలకు అలవాటు పడిన కొందరు వైద్యాధికారుల ప్రవర్తనపై రైల్వే నిఘా నేత్రాలు జోన్‌వ్యాప్తంగా ఉన్న రైల్వే ఆసుపత్రులలో దీర్ఘకాలంగా కనీసం ఆరేడు మాసాల మొదలు ఏడాది కాలానికి పైగా లాంగ్ సిక్ లీవ్‌లో ఉన్న కేటుగాళ్లపై రైల్వే నిఘా వర్గాలు డేగా కన్నులతో దృష్టి సారించాయి. విజయవాడ రైల్వే డివిజన్‌లో సీనియర్ పాసింజర్ ట్రైన్ 2 మేనేజర్‌గా పనిచేస్తున్న శివ నాగప్రసాద్ లైట్ జాబ్ నిమిత్తం మెడికల్ డి-క్యాటగిరైజేషన్ చేసుకొనేందుకు ఆసుపత్రిలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న హస్మత్ అలీ, అతని బావమరిది ఎస్‌కె రసూల్ ద్వారా ప్రయత్నించి లాలాగూడ రైల్వే సెంట్రల్ ఆసుపత్రిలో సిబిఐకి పట్టుబడిన విషయం పాఠకులకు విధితమే. ఈక్రమంలో కేంద్రీయ నిఘా వర్గాలు హైదరాబాద్,సికింద్రాబాద్, విజయవాడ,గుంటూరు,గుంతకల్లు, నాందేడ్, లాలాగూడ, మెట్టుగుడ,తిరుపతి సిఆర్‌ఎస్,రాయనపాడు వర్క్‌షాప్‌లలో పనిచేసే సిబ్బంది వాస్తవంగా అనారోగ్యం కారణంగా సీక్ లీవ్‌లో ఉన్నారా,లేక కొందరు అవినీతి అక్రమాలకు అలవాటు పడిన వైద్యాధికారులను మ్యానేజ్ చేసుకుని సిక్‌లో ఉంటున్నారా అనే అంశాలపై వివరాలు సేకరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మెడికల్ అన్‌ఫిట్‌లకు భారతీయ రైల్వేలోనే పేరుగాంచిన గుంతకల్లు రైల్వే డివిజన్‌లో దాదాపుగా మూడు నుంచి ఐదుగురు సిక్‌లీవ్‌పై ఉన్నట్లు గుర్తించారు. లాంగ్ సిక్ లీవ్‌లో ఉన్నవారు నిజంగానే చికిత్స నిమిత్తం సిక్ లీవ్‌లో ఉన్నారా..?లేక మెడికల్ డీ-క్యాటగిరైజేషన్ నిమిత్తం ఉద్దేశపూర్వకంగా పైరవీదారుల మాటలునమ్మి లాంగ్ సిక్ లీవ్‌లో కొనసాగుతున్నారా అనే కోణంలో కూడా సమాచారాన్ని రాబడుతున్నట్లు తెలిసింది. ఉమ్మీద్ కార్డ్,సిఆర్ నంబర్‌లు ఆధారంగా ఎవరు ఎన్నెన్ని రోజుల నుంచి సిక్ లీవ్‌లో ఉన్నారు తదితర అంశాలపై అంతర్గత విచారణ కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో ఫేక్ సిక్ లీవ్‌లో ఉన్నవారు, వారికి సహకరిస్తున్న వైద్యాధికారులు సైతం సమస్యల వలయంలో చిక్కుకొన్నట్లే..

# టిటిడిలో అక్రమంగా సస్పెండ్ చేసిన దళిత ఉద్యోగులను తిరిగి విధుల్లో చేర్చుకోండి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ.ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల, తిరుపతి దేవస్థానంలో అక్రమంగా సస్పెండ్ చేసిన ఎనిమిది మంది దళిత ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. టిటిడిలో 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఎనిమిది మంది షెడ్యూల్డు కులాలకు చెందిన ఉద్యోగులను ఇటీవల సస్పెండ్ చేశారని తెలిపారు. టిటిడి ఒక ధార్మిక సంస్థ అని, దేవుని దృష్టిలో ప్రజలందరూ సమానమేనని, టిటిడి చర్య పూర్తిగా రాజ్యాంగస్ఫూర్తికి వ్యతిరేకమైనదని పేర్కొన్నారు. హిందూమతేతర ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గన్నారనే పేరిట వీరిపై చర్యలు తీసుకున్నారని, 2007కు ముందు వీరు టిటిడి ఉద్యోగాల్లో నియమించబడ్డారని వివరించారు. ఆ నాటికి ఇతర మతస్తులకు కూడా టిటిడి ఉద్యోగాల్లో అర్హత ఉందని, గత వందేళ్లుగా ఆలయ నిర్వహణలో వివిధ డిపార్ట్‌మెంట్లలో అన్ని తరగతులకు చెందిన వేలాదిమంది ఉద్యోగులు నియమించ బడుతున్నారని వివరించారు. కొందరు కారుణ్య నియామకాల ద్వారా నియమించబడ్డారని, అన్యమతస్తుల పేరిట కొంత మందిని సస్పెండ్ చేయడం సరైంది కాదని, టిటిడి సంప్రదాయానికి భిన్నమైనదని తెలిపారు. 2007 తరువాత హిందువులు మాత్రమే టిటిడిలో ఉద్యోగాలకు అర్హులని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, అప్పటి నుంచి ఇతర మతస్తులను ఉద్యోగాల్లోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. తొలగించబడిన ఉద్యోగులు కొందరు రెండు, మూడు ఏళ్లలో పదవీ విరమణ కూడా చేయనున్నారని, 30 ఏళ్లకు పైగా టిటిడి, భక్తుల సేవలో వీరు ఉన్నారని తెలిపారు. సంస్థ పట్ల నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ సస్పెండ్ చేయడం సరైంది కాదని తెలిపారు. టిటిడిలో పనిచేస్తున్న 29 మంది ఇతర మతస్తులను రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉద్యోగాల్లోకి తీసుకోవాలని గతంలో టిటిడి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించగా, సాంకేతిక కారణాలతో ఈ విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించిదని వివరించారు. టిటిడి పరిధిలో విద్యాలయాలు, ఆస్పత్రులు, ఇంజినీరింగ్ వంటి సెక్షన్లలో పని చేయించుకోవాలని సూచించిందని, రాష్ట్ర ప్రభుత్వం జనవరి 24, 2025న మెమో నెం.174396 0/337/2022 దేవాదాయశాఖ3 ద్వారా పై ఉత్తర్వులను జారీ చేశారని తెలిపారు. 29 మంది హిందూయే తరులను గతంలో తొలగించాలని టిటిడి యాజమాన్యం నిర్ణయించినపుడు హైకోర్టు మంద లించి నిలుపుదల చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం టిటిడి యాజ మాన్యం వ్యవహరించిన తీరు హక్కుల ఉల్లం ఘనగా కనిపిస్తోందని, ఉద్యోగులందరికీ భద్రత కల్పించాల్సిన టిటిడి యాజమాన్యం మతం పేరుతో విభజన తీసుకురావడం అన్యాయమని తెలిపారు. ముఖ్యమంత్రిగా జోక్యం చేసుకుని, ఉద్యోగులను ఆదుకోవాలని,

సస్పెన్షన్ ఎత్తి వేసి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.



# క్లాస్‌గా కనపడినా.. మాగంటి గోపీనాథ్ మాస్ లీడర్

## సభలో సంతాపం ప్రకటిస్తూ తీర్మానం ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

### ఆదివారం ఉదయం 9 గంటలకు శాసనసభ వాయిదా : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ చూడటానికి క్లాస్‌గా కనిపించినా మాస్‌లీడర్ అని, నాకు మంచి మిత్రుడని విద్యార్థి నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా, నిర్వాహ్యగా ఆయన రాణించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. అసెంబ్లీ సమావేశం తొలిరోజైన శనివారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాపం తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు.

గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని, సౌమ్యుడు, మితభాషి అని గుర్తుచేసుకొన్నారు. రాజకీయ విధానాలు మార్చుకున్నా తన వ్యక్తిత్వం మార్చుకోలేదని జూబ్లీహిల్స్ నుంచి మూడుసార్లు వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించడం అంటే అంత ఆషామాషి విషయం కాదని, ఆయన విలువలతో వ్యవహరించడాని చెప్పడానికి ప్రబల నిదర్శనం అని వివరించారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని అరుదైన ఒక ప్రజా ప్రతినిధిని కోల్పోయామని గోపీనాథ్ కుటుంబానికి ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుండే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. గోపీనాథ్ ఆకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

**అందరితో కలసిపోయే ఆయన లేనిలోటు స్పష్టంగా తెలుస్తోంది : మంత్రి శ్రీధర్‌బాబు**



మాగంటి గోపినాథ్ నిజాయితీగా, అందరితో కలిసి మెలసిపోయే గుణం కలిగిన వ్యక్తి అని అసెంబ్లీలో ఆయన లేనిలోటు స్పష్టంగా తెలుస్తోందని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ముఖ్య మంత్రి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని ఆయన బలపరుస్తూ గోపీనాథ్ అన్నగా నాకు మార్గదర్శి వ్యక్తి చనిపోవడం దిగ్భ్రాంతి కలిగిందని, మన హృదయాలను ద్రవింపచేస్తోందని ఆయన అన్నారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన తమ్ముడు రాజకుమార్ చనిపోతే అప్పుడు వారి కుటుంబం సంవత్సరాలు ఆ విషాదం నుంచి కోలుకోలేదని ఆయనకు ఇద్దరు అన్నలు ఉన్నారని కుటుంబ నేపథ్యం సభకు వివరించారు. హైదరాబాద్‌లో 1963లో పుట్టిన గోపినాథ్ ఇక్కడే తన చదువులు పూర్తిచేసుకొన్నారు.

**గోపన్నగా ప్రజలకు అనురాగం పంచారు: ఎమ్మెల్యే కెటిఆర్**



బతుకమ్మ చీరెలు తెలంగాణ ప్రభుత్వం 2016లో పంపిణీ చేయడం మొదలు పెడితే, మాగంటి గోపినాథ్ మాత్రం అంతకుముందే తన నియోజకవర్గం పరిధిలోని వారికి బతుకమ్మ సందర్భంగా చీరెలు పంపిణీచేశారని ఎమ్మెల్యే తారక రామారావు గుర్తుచేశారు. ఈ సభలో సోదరుడు, సహచరుడు, హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోపీనాథ్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టాల్సి వస్తదని కలలో కూడా అనుకోలేదు. జీవించి ఉన్నంత కాలం ఆయన అనారోగ్యం గురించి చెప్పుకోలేదు. పబ్లిక్ పరంగా చాలా యాక్టివ్‌గా ఉండేవారు. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ అంటేనే సంపన్నులు నివసించే ప్రాంతం అని పేరు. కానీ అక్కడ ఉండేది మొత్తం పేద ప్రజలు. బస్తీలతో కూడిన ఏరియా. అలాంటి ఏరియాను మాగంటి గోపీనాథ్ ఎంతో అభివృద్ధి చేశారని కెటిఆర్ కొనియాడారు. హైదరాబాద్‌లోని హైదర్ గూడలో జన్మించిన గోపీనాథ్ కటౌట్ సంస్కృతికి పునాది వేశారని గుర్తుచేసుకొన్నారు. ఎన్టీఆర్‌కు వీరాభిమానికిగా టిడిపి అడుగుపెట్టారు. హ్యాట్రిక్ కొట్టడం ఎమ్మెల్యేలకు అంత సులువు కాదు. అది గోపీనాథ్‌కు సాధ్యమైంది. మాదాపూర్ ఏరియాలో చాలా చిన్న ఇంట్లో గోపీనాథ్ నివాసం ఉన్నారు. బతికినంత కాలం మాస్ లీడర్‌గా డైనమిక్‌గా ఉన్నారు. స్పందించే గుణం ఎక్కువ. కేసీఆర్‌కు నమ్మిన విధేయుడిగా పని చేశారు. ఆయన మరణం పార్టీకి, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి తీరని లోటు. గోపీనాథ్ కుటుంబానికి మా పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**క్రమశిక్షణగల నేత మాగంటి : సభలో ప్రజాప్రతినిధుల నివాళులు**

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గోపినాథ్ మృతిచెందడం దురదృష్టం అని అన్నారు. జూబ్లిహిల్స్ ప్రజలను ఆయన ఆశించిన రీతిలో అభివృద్ధి పరిచేబాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకొంటారని తెలిపారు. బిసివెల్ఫ్‌ర్ మంత్రి హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలమనిషి మాగంటి అని కొనియాడారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజలను ప్రేమించే నాయకుడు ఆయన విషయాలు ఎప్పుడు బయటకు చెప్పుకోలేదు గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన మంచి వ్యక్తి అని అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్వర్లు, గోపాల్ మాట్లాడుతూ గోపినాథ్ వివాదరహితుడని అభివర్ణించారు. బిజెపి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు గుర్తుంచుకొనే పనులు చేయాలని ఆయన మనందరికి మార్గనిర్ధేశం చేశారని అని కొనియాడారు. ఎంఐఎం ఎమ్మెల్యే, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సున్ని తంగా మర్యాదగా వ్యవహరించే వ్యక్తి అని అన్నారు. సిపిఐ తరుపున ఆయన కుటుంబానికి సంతాపం తెలుపుతున్నానని చెప్పారు.

**అరుదైన నేత మాగంటి : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

అరుదైన నాయకుడు మగంటి గోపీనాథ్ మృతికి సంతాప తీర్మానం చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆ తర్వాత సభను ఆదివారం(మార్చి 31) ఉదయం 9 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

# గత ప్రభుత్వంలో లేని పిపిటి సంప్రదాయం ఇప్పుడెందుకు?: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చే సంప్రదాయంలేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పిపిటి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పిపిటికి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల స్టేషన్‌లలో వందేభారత్ హాల్ట్

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** సికిందరాబాద్-నాగపూర్ మధ్య నడుస్తున్న వందేభారత్ రైలుకు రెండు హాల్టింగ్‌లు ఇచ్చినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాన స్టేషన్‌లు సిర్పూర్ కాగజ్ నగర్, మంచిర్యాల స్టేషన్లలో హాల్టింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి ఈ రెండు స్టేషన్లలో హాల్టింగ్ ఏర్పాటు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో రైల్వే మౌలిక వసతులకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాని ప్రధాని మోడీ రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు తెలంగాణ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

# పదవీ విరమణ చేసిన అదనపు కార్యదర్శులు


**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర సచివాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది శనివారం పదవి విరమణ చేశారు. సాధారణ పరిపాలన విభాగంలో పని చేస్తున్న అదనపు కార్యదర్శులు బండి యాదగిరి, నిర్మల, అరుణ్ కుమార్, ఏఎస్ఓ అశోక్ కుమార్, జమేదార్ అబ్దుల్లా పదవీ విరమణ సందర్భంగా శనివారం నాడు జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సంయుక్త కార్యదర్శి శివ లింగయ్య(ప్రొటోకాల్) వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిఎడి కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడుతూ, పదవీ విరమణ చేసిన అధికారులు అంకితభావంతో పని చేశారని వారిని ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి, అత్యున్నత సేవలు అందించారని అన్నారు. సచివాలయ అధికారులు, సిబ్బంది కూడా వారిని ఆదర్శంగా తీసుకొని అంకితభావంతో పనిచేయాలని, సేవా దృష్టితో విధులు నిర్వహించాలని అన్నారు.

# శాసనమండలిలో మాజీ సభ్యులు రత్నాకర్‌రావు, మాగం రంగారెడ్డికి సంతాపం

## ఆ తరువాత సోమవారానికి సభ వాయిదా

## కొత్త సభ్యులను సభకు పరిచయం చేసిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనమండలి సమావేశాలు శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే సభ్యులకు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వినాయక చవితి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం కొత్తగా శాసనమండలికి ఎన్నికైన సభ్యు లను సభకు పరిచయం చేశారు. కొత్తగా మండలికి ఎన్నికైన అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్, విజయశాంతి, దాసోజు శ్రవణ్ కుమార్, సత్యం నెల్లికంటి, పింగిలి శ్రీపాల్ రెడ్డి, సి.అంజిరెడ్డి, మల్క కొమరయ్యను పరిచయం చేయగా రెండోసారి రియాజుల్ ఎఫెండి ఎన్నిక కాగా ఆయనను కూడా సభకు పరిచయం చేశారు. అనంతరం గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు సభ్యులుగా కొనసాగి ఈ మధ్య కాలంలో మరణించిన డాక్టర్ టి రత్నాకర్‌కి, తెలంగాణ శాసన పరిషత్తుకి రెండుసార్లు ఎన్నికై మరణించిన మాగం రంగారెడ్డికి సంతాపం తెలుపుతూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. మౌనం పాటించిన అనంతరం సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.



సచివాలయం వద్ద మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు

# బిసి రిజజర్వేషన్లు పెంచే చట్టానికి ప్రతిపక్షాలు మద్దతు తెలపాలి

## లేదా బిసి ద్రోహులుగా ప్రటిస్తాం: జాజుల

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** సామాజిక రిజర్వేషన్ల పరిమితిని 50 పరిమితిని ఎత్తివేస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచడానికి ఈ అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలని నిర్ణయించడం అభినంద నీయమని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈమేరకు శనివారం సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాతనే ప్రత్యేక జీవోను తీసుకురావాలన్నారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ చేయబోయే చట్టంపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు బెషరతుగా మద్దతు తెలపాలన్నారు. బీసీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో రాజకీయం చేస్తే ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టానికి మద్దతు ఇవ్వని రాజకీయ పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాన్నారు. బిసిలు ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు అంటే, దేశంలో సిక్కు మతానికి రిజర్వేషన్లు ఇవ్వడం లేదా? అని ప్రశ్నించారు. మోకాలుకు బోడిగుండుకు మెలిక పెట్టి రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూసే పార్టీలను రాజకీయంగా బొంద పెడతామని హెచ్చరించారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాత రెండోసారి గవర్నర్‌కు ఆపే అధికారం లేదని గవర్నర్ ఆమోదించకుంటే బిజెపి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 రిజర్వేషన్లు పెంపుకు అన్ని రాజకీయ పార్టీలు, శాసనసభ పక్ష నేతలు శాసనసభ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బిక్షపతి, జాజుల లింగం తదితరులు మాట్లాడారు.

# యాదిగిరిగుట్ట ఆలయ ఇఒగా వెంకటరావు

## 31న పదవీవిరమణ చేస్తున్నందున.. పునర్నియామకం

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** యాదగిరి గుట్ట దేవాలయం ఎక్జిక్యూటివ్ ఆఫీసర్(ఈవో)గా ఎస్ వెంకట రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న 2015 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి ఎస్.వెంకటరావును యాదగిరిగుట్ట ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటి ప్రత్యేక అధికారిగా నియమిస్తూ జీవో ఆర్‌టి నంబర్ 1179ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నియామక నిబంధనలు, షరతులు విడిగా జారీ చేయబడతాయని ఉత్తర్వులో పేర్కొన్నారు.

# సమస్యలను చర్చించే ధైర్యంలేని కాంగ్రెస్ సర్కారు

## బిజెపి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను 30 రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరామని బిజెపి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకో ప్రజాసమస్య చొప్పున 30 రోజుల పాటు చర్చించాల్సిన 30 అంశాల జాబి తాను ప్రభుత్వానికి ఇచ్చామని, కానీ కాంగ్రెస్ సర్కారుకు ప్రజాసమస్యలపై చర్చించే చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే సమావేశాలను మూడు రోజుల్లోనే ముగిస్తామంటుందన్నారు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యం. ప్రజాసమస్యలపై పలాయన వాదమన్నారు. భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం, రోడ్లు తెగడం, చెరువులకు గండ్లు పడడం రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలు, పెన్షనుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు చేనేత, కల్లుగీత వంటి వృత్తిదారుల కష్టాలు, ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు, విద్యా, వైద్య, ఇరిగేషన్, వ్యవసాయం, రెవెన్యూ, ఆర్థిక రంగాల్లోని సమస్యలు ఉన్నాయన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న భూముల అన్యాక్రాంతం, దేవాలయాలపై దాడుల వంటి అంశాలను అసెంబ్లీలో చర్చించాలని, అందుకే 30 రోజుల పాటు సమావేశాలను నిర్వహించాలని కోరామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు అప్పటి బిఆర్ఎస్ సర్కారు అసెంబ్లీ సమావేశాలను తక్కువ రోజులు నిర్వహించడాన్ని తప్పుపట్టిందని, తాము అధికారంలోకి వస్తే అసెంబ్లీని ఎక్కువ రోజులు నిర్వహిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ అన్ని హామీల మాదిరే ఈ హామీ కూడా ఎగవేతనే అని, కాంగ్రెస్ సర్కార్ గత బడ్జెట్ సమావేశాలను కేవలం 11 రోజులే నిర్వహించిందన్నారు గత శీతాకాల సమావేశాలు (2024 డిసెంబరులో) జరిగింది ఏడు రోజులే అన్నారు. అసెంబ్లీ సమావేశాలను ఇలా తక్కువ రోజుల పాటు నిర్వహించడమనేది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల హాయంలో అసెంబ్లీ తక్కువ రోజులే సమావేశమైందని, ఒక్క యేడాది మాత్రమే 30 రోజులకు పైగా నడిచింది. మిగిలిన సంవత్సరాలన్నీ కూడా 30 రోజుల్లోపే అసెంబ్లీ నడిచింది. కెసిఆర్ బాటలోనే రేవంత్ సర్కార్ నడుస్తూ సమావేశాలను తక్కువ రోజులు నిర్వహించడం ద్వారా శాసనసభ ఔన్నత్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకుని వినాయక నిమజ్జనం తర్వాత అసెంబ్లీని తిరిగి సమావేశ పరిచి ప్రజాసమస్యలను చర్చించి, పరిష్కారాలను చూపాలన్నారు. ప్రజాసమస్యలను చర్చించే పరిష్కరించాలనే చిత్తశుద్ధిలేని సర్కారులే ఇలా వ్యవహరిస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాసమస్యలను చర్చించే దమ్ము, ధైర్యం ఉంటే వినాయక నిమజ్జనం తర్వాత అసెంబ్లీని 30 రోజుల పాటు నడపాలని డిమాండ్ చేశారు. సభలో ప్రజాసమస్యలను చర్చిస్తే ప్రభుత్వ వైఫల్యాలు, డొల్లతనం బయట పడుతుందని సిఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నారు. అందుకే సమావేశాలను మూడురోజుల్లోనే ముగిస్తున్నారు. తమ సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించకుండా దాటవేస్తున్న దగాకోరు కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు వచ్చే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

# వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సవ్యసాచిఘోష్‌కు అదనపు బాధ్యతలు

## గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు కూడా..

## ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** పశు సంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్ అండ్ ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొనసాగుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి సభ్యసాచి ఘోష్‌కి అదనపు బాధ్యతలు అప్పగిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెల్ఫేర్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అలాగే గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన జీవో ఆర్‌టి నంబర్ 1180ను జారీ చేశారు. ఇప్పటి వరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా డాక్టర్ విఎస్ అలగు వర్షిణికి ఇచ్చిన అదనపు బాధ్యతల నుంచి తొలగించారు. అలుగు వర్షిణి రెండు సంవత్సరాల పాటు డిప్యూటేషన్‌లో కేంద్ర సర్వీసులకు వెళ్తున్న నేపథ్యంలో అదనపు బాధ్యతలను ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**సంక్షేమ శాఖల సమన్వయంపై ప్రత్యేక మెమో జారీ**

వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సభ్యసాచి ఘోష్‌కి అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం.. బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ సంక్షేమ శాఖలను సమన్వయం చేస్తారని పేర్కొంటూ మెమో నంబర్ 1279ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేశారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల అంతటా సమన్వయాన్ని బలోపేతం చేయడానికి, పథకాల కలయికను నిర్ధారించడానికి, వ్యూహాత్మక దిశానిర్దేశం చేయడానికి, ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కేడర్‌లో ఒక అధికారిని సంక్షేమం కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించాలని నిర్ణయించింది.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




యూసుఫ్‌గూడలో నిర్వహించిన బిజెపి బూత్ స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), ఆగస్టు 30, ప్రభాత వార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో బీజేపీ పార్టీ గెలుపునకు బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు అన్నారు. శనివారం యూసుఫ్ గూడ మహ్మద్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ సెంట్రలల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం భారతీయ జనతాపార్టీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచందర్‌రావు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు పాల్గొన్నారు. రామచందర్‌రావు మాట్లాడుతూ నగరంలో బలమైన పార్టీ బీజేపీ పార్టీ అని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు గెలవటం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయం అన్నారు. రాష్ట్రాన్ని గత పదేళ్లలో బీఆర్ఎస్ కుటుంబపాలన సాగిస్తే 22 నెలల్లో కాంగ్రెస్ అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్, ఎమ్ఐఎమ్ మద్దతుతో ముందుకు వెళ్తున్నారని ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. బీహార్‌లో ఎమ్ఐ ఎమ్‌తో కలిసి రాహుల్‌గాంధీ ఓట్ చోర్ జరిగిం దంటూ ప్రచారం చేస్తున్నారని కానీ హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ఎమ్ఐఎమ్ కలిసి ఓట్ చోర్ అధికారులను కలుపుకుని చేస్తున్నార న్నారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిని ఆరు గ్యారెంటీలను అమలు చేశాకే ఓట్లు అడగాలని ఓటు అడిగే నైతిక హక్కు ను వారు కోల్పోయారన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు, గ్రామాలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాల న్నారు. ఆరు గ్యారెంటీలలో మహి ళలకు రూ.2,500, తులం బంగారం, కాలేజి వెళ్లే విద్యా ర్థినులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి ఏమ య్యాయని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మహిళలకు పొదుపు సంఘాల పేరుతో రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నా మని కాంగ్రెస్ మాత్రం రుణాలకు వడ్డీ చెల్లించలేని పరిస్థితి ఉందని ఉద్యోగులకు డీఏలు లేవని ఉద్యోగాల పంచన్లు ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నా రు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అడుగడుగున కాంగ్రెస్‌ను అడ్డుకోవాలన్నారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను చూస్తుంటే 2020లో బీహార్ ఎన్నికల సమయంలో దుబ్బాక ఎన్నికలు నిర్వహించారని అదే పరిస్థితి ప్రస్తుతం బీహార్ ఎన్నికల సమయంలోనే జూబ్లీహిల్స్ ఎన్నికలు రావడం బీజేపీ గెలుపునకు నాందిగా పలుకుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షులు గౌతమ్‌రావు, భరత్‌గౌడ్, శ్యామ్ సుందర్‌గౌడ్, డాక్టర్ పద్మా వీరపనేని, అట్లూరి రామకృష్ణ, నగర కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, కొలన్ సత్యనారాయణతోపాటు డివిజన్ల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్టీలుగా లంబాడా, బంజారాలు రాజ్యాంగ విరుద్ధం

## సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమని, వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల నుండి పిటిషన్ దాఖలైంది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపూరావుతోపాటు మరికొందరి తరఫున సీనియర్ న్యాయవాది అల్లంకి రమేశ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉత్తర్వుల సవరణ చట్టం 1976 మేరకు ఆ మూడు వర్గాలను ఎస్టీలుగా గుర్తించడం ఆర్టికల్ 342ని ఉల్లంఘించడమేనని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. బంజారా, లంబాడాలు, సుగాలీలు గిరిజనులు కాదని, 1976 వరకు పాత ఆంధ్ర ప్రదేశ్‌లోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వలస వచ్చి అక్కడి అసలైన గిరిజనులకు ఉద్దేశించిన హక్కులను కొల్లగొట్టారని వెల్లడించారు. అంతకుముందు వారు బీసీ జాబితాలో ఉన్నారన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన సందర్భంలో ఆంధ్రా ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉందని, ఆ సమయంలో లంబాడా, సుగాలీలను ఆంధ్రా ప్రాంతంలో ఎస్టీలుగా గుర్తించారని, కానీ హైదరాబాద్ స్టేట్‌లో కాదని తెలి పారు. కాసు బ్రహ్మానందరెడ్డి కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో ఒక రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఒక కులానికి చెందిన వారు ఎస్టీలు, మరికొన్ని జిల్లాల్లో బీసీలుగా ఉండడం సరికాదని ఆ మూడు కులాలను ఎస్టీ జాబితాలో చేర్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు ఐఎఎస్ శివశంకర్ కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి శివశంకర్ లోతేటిని కేంద్రం ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించింది. ఈ మేరకు ఆయనను ఏపీకి రిలీవ్ చేయాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఏకే మిశ్రా తెలంగాణ ప్రభుత్వానికి ఉత్తర్వులు పంపించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను ఏపీకి కేటాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. విజయనగరం జిల్లాలోని ధర్మవరం శివశంకర్ సొంతూరు. కానీ రంగారెడ్డి జిల్లాలోని తన మామగారి నివాసంలో ఉండి ఆయన సివిల్ సర్వీసెసు సాధించారు. యూపీఎస్సీకి చేసిన దరఖాస్తులో తన శాశ్వత చిరునామాగా రంగారెడ్డి జిల్లానే పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో క్యాడర్‌ను నిర్ణయించేటప్పుడు చిరునామా ఆధారంగా కేంద్రప్రభుత్వం ఆయనను తెలంగాణకు కేటాయించింది.

# యూరియా అంశం కేంద్ర పరిధిలోనిది

## విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి చైర్మన్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** యూరియా అంశం కేంద్రం పరిధిలోనిదని విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో లేకపోతే బీజేపీ కార్యాలయం ముందు ధర్నా చేయాలన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో తెలంగాణ రైతాంగాన్ని కేంద్రం నిండా ముంచిందని చెప్పారు. రాష్ట్రానికి ఈ సీజన్ లో కేటాయించిన యూరియా కోటాలో 60 కూడా సరఫరా చేయలేదని వెల్లడించారు. రామగుండం ఎరువుల కర్మాగారం రెండు నెలల నుంచి మూతపడినా, ఇప్పటి వరకు కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సీజన్‌లో రాష్ట్రానికి ప్రణాళిక ప్రకారం రావాల్సింది 8.30 లక్షల టన్నులు అయితే కేంద్రం ఇచ్చింది 5.95 లక్షల టన్నులు మాత్రమేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చనిపోయిన రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదని, వీరిలో 141 మంది రైతులకు తమ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని వివరించారు.

# యూరియాపై ఆందోళనలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలంటూ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళనలు చేశారు. ధర్నాకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయా పోలీసు స్టేషన్లకు వారిని తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అంతకుముందు వ్యవసాయ శాఖ కమిషనర్‌కు యూరియా కొరతపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వినతిపత్రం అందించారు. యూరియా కొరత తీర్చాలని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు సూచించారు.

తాము రాజకీయాలు చేయడం లేదని, రైతుల తరపున మాట్లాడుతున్నామని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టిందని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గణపతి బప్పా మోరియా – కావాలయ్యా యూరియా" అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## ఆట

# వన్డే, టి-20ల్లో..
# సిక్సర్ తెలియని స్టార్స్
## ఒక్కటి కూడా కొట్టని ప్లేయర్స్

**న్యూఢిల్లీ:** వన్డే, టీ20 క్రికెట్ అంటేనే సిక్సర్లు, ఫోర్లు కొట్టడం. అటువంటి ఈ ఫార్మాట్లలో ఇప్పటివరకు ఒక్క సిక్స్ కూడా కొట్టని టీమిండియా ప్లేయర్లు కూడా ఉన్నారు. వన్డే, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక్క సిక్స్ కూడా కొట్టని ముగ్గురు దిగ్గజ భారత క్రికెటర్లు ఉన్నారు. టీమిండియా చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ భారత జట్టు తరపున టెస్ట్, వన్డే, టీ20 అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్లలో ఆడుతున్నాడు. టెస్ట్ క్రికెట్‌తో తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించిన కుల్దీప్ ఇంకా వన్డే, టీ20లలో ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు. కుల్దీప్ యాదవ్ వన్డేలలో 113 మ్యాచ్‌లు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 40 మ్యాచ్‌లు ఆడాడు. అలాగే యుజ్వేంద్ర చాహల్ 2016లో భారత జట్టు తరపున వన్డేల్లో అరంగేట్రం చేశాడు. అప్పటి నుంచి చాహల్ బ్యాటింగ్ కోసం తనకు లభించిన అన్ని బంతుల్లోనూ సిక్స్ కొట్టలేకపోయాడు. అతను ఇప్పటివరకు టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 13 బంతులు ఆడాడు. వన్డేల్లో 141 బంతులు ఎదుర్కొన్నాడు. మరో ప్రత్యేకత ఏమిటంటే చాహల్ లిస్ట్ ఏ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మొత్తం 3 సిక్స్‌లు కొట్టాడు. అతను ఒడిఐ, టి20లలో కలిపి మొత్తం 152 మ్యాచ్‌లు ఆడాడు. అతనికి ఇంకా టెస్ట్‌లలో అవకాశం రాలేదు. యుజ్వేంద్ర చాహల్ ఆగస్టు 2023లో భారత జట్టు తరపున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ప్రస్తుతం టీమ్ ఇండియాకు దూరంగా ఉన్నాడు. ఇక ఇషాంత్ శర్మ ఇప్పటివరకు భారత జట్టు తరపున టీ20 అంతర్జాతీయ, వన్డే క్రికెట్‌లో ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు. ఇషాంత్ ప్రస్తుతం భారత్ తరపున ఏ ఫార్మాట్‌లోనూ క్రికెట్ ఆడటం లేదు. 2007లో భారత జట్టు తరపున టెస్ట్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన ఇషాంత్, పొడవైన ఫార్మాట్‌లో ఒకసారి కూడా సిక్స్ కొట్టాడు. అతను ఇప్పటివరకు టెస్ట్ క్రికెట్‌లో 2568 బంతులు ఆడాడు. అందులో తన పేరు మీద అర్ధ సెంచరీని కలిగి ఉన్నాడు. మూడు ఫార్మాట్‌లను కలిపి, మొత్తం 199 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. ఇషాంత్ శర్మ నవంబర్ 2021లో భారత జట్టు తరపున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ప్రస్తుతం టీమిండియాకు దూరంగా ఉన్నాడు.




## కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# మెహక్, లవ్‌ప్రత్‌కు రజతం, కాంస్యం



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ వెయిట్ లిఫ్టర్లు రజతం, కాంస్యంతో ముగించారు. దీంతో ఈ ఛాంపియన్‌షిప్‌లో 13 పతకాలతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. సీనియర్ కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో చివరి రోజు శనివారం భారత వెయిట్‌లిఫ్టర్లు హెవీవెయిట్ విభాగాలలో రెండు పతకాలు సాధించారు. మెహక్ శర్మ (86+ కిలోలు) మరియు లవ్‌ప్రీత్ సింగ్ (110+ కిలోలు) వరుసగా రజత మరియు కాంస్య పతకాలను గెలుచుకున్నారు, దీనితో భారత పతకాల సంఖ్య 13కి చేరుకోగా, ఇందులో 4 స్వర్ణాలు, 6 రజతాలు మరియు 3 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇక మీరాబాయి చాను (48 కిలోలు), రిషికాంత సింగ్ (60 కిలోలు), అజిత్ నారాయణ (71 కిలోలు), మరియు అజయ బాబు (79 కిలోలు) అనే నలుగురు బంగారు పతక విజేతలు 2026 కామన్వెల్త్ క్రీడలకు తమ స్థానాలను నిర్ధారించుకోవడంతో భారతదేశం నైజీరియాను అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. అలాగే చివరి రోజు పురుషుల 110 కిలోల ఫైనల్‌తో ప్రారంభమైంది. ఇక్కడ హర్చరణ్ సింగ్ కేవలం 1 కిలోల తేడాతో పతకాన్ని కోల్పోయాడు. మొత్తం 355 కిలోలు ఎత్తి ఫిజియన్, సమోవాన్ మరియు న్యూజిలాండ్ వెయిట్‌లిఫ్టర్ల కంటే నాల్గవ స్థానంలో నిలిచాడు. ఆ తర్వాత, భారతదేశపు సూపర్ హెవీవెయిట్ జాతీయ రికార్డు హోల్డర్ మెహక్ శర్మ మైదానంలోకి ప్రవేశించి, తన జాతీయ రికార్డులను తిరగరాసి, వ్యక్తిగత ఉత్తమ మొత్తం 253 కిలోల ఎత్తి రజత పతకాన్ని సాధించింది.



ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్:

# భారత్ షూటర్లు అద్భుత ప్రదర్శన
## ఐశ్వరీ, సిఫ్ట్‌కౌర్, ఎలావెనిల్‌లకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** భారత షూటర్లు గత కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయ సర్క్యూట్‌లో అద్భుతమైన విజయాన్ని ప్రదర్శించారు. ఇప్పుడు వారు కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో శనివారం జరిగిన 2025 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, సిఫ్ట్ కౌర్ సమ్రా, ఎలావెనిల్ వలరివన్ స్వర్ణ పతకాలను సాధించారు. దీంతో భారత్ ఖాతాలో 30కి పైగా పతకాలు చేరి షూటర్లు తమ ఆధిపత్యాన్ని పునరుద్ఘాటించారు. 14 స్వర్ణాలు, 8 రజతాలు, 9 కాంస్య పతకాలతో 31 భారీ పతకాల రికార్డుతో భారతదేశం ఈ ఖండాంతర పోటీలలో తమ అత్యుత్తమ పతకాల సంఖ్యను నమోదు చేసింది. పతకాల పట్టికలో చైనా తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. భారతదేశం చాలా కాలంగా రైఫిల్ షూటింగ్‌కు గుర్తింపు పొందింది. కానీ ఇటీవలి సంవత్సరాలలో కొంత అసమానత కనిపించింది. అయితే, ఈ ఈవెంట్‌లో రైఫిల్ ఈవెంట్లలో వారు ఆరు బంగారు పతకాలను సాధించడం బలమైన ప్రదర్శనగా నిలిచింది. అదనంగా, ఈ ఆరు బంగారు పతకాలలో నాలుగు ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ (50 మీ 3 పి), సిఫ్ట్ కౌర్ సమ్రా (50 మీ 3 పి), ఎలావెనిల్ వలరివన్ (ఎయిర్ రైఫిల్) మరియు ఎయిర్ రైఫిల్ మిశ్రమ జట్టు గెలుచుకున్న ఒలింపిక్స్ విభాగాలలో ఉన్నాయి. మిగతా రెండు బంగారు పతకాలు ఎయిర్ రైఫిల్ పురుషుల జట్టు మరియు మహిళల 50 మీటర్ల 3 పి జట్టు దక్కించుకున్నాయి.

# ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో రచ్చ రచ్చ
## సౌత్ ఢిల్లీపై 7 వికెట్ల తేడాతో వెస్ట్ ఢిల్లీ విక్టరీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2025 ఎలిమినేటర్ మ్యాచ్‌లో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్, వెస్ట్ ఢిల్లీ లయన్స్ మధ్య తీవ్రమైన గొడవ జరిగింది. క్రిష్ యాదవ్ అవుట్ అయిన తర్వాత ఇరు జట్ల ఆటగాళ్ళు ఒకరిపై ఒకరు దూసుకెళ్లారు. వెస్ట్ ఢిల్లీ లయన్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించి క్వాలిఫయర్ 2కు చేరుకుంది. సౌత్ ఢిల్లీ, వెస్ట్ ఢిల్లీ మధ్య మ్యాచ్‌లో పెద్ద గొడవ జరిగి ఇరు జట్లకు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఒకరిపైకి ఒకరు దూసుకెళ్లారు. 11వ ఓవర్‌లో 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్ట్ ఢిల్లీ లయన్స్ ఓపెనర్ క్రిష్ యాదవ్ అమన్ భారతి బౌలింగ్‌లో అవుట్ అయిన తర్వాత ఈ రచ్చ జరిగింది. 11వ ఓవర్ తొలి బంతికి పేసర్ భారతిని లాంగ్‌ఆఫ్ కోసం సిక్స్ కొట్టడానికి క్రిష్ ప్రయత్నించాడు. అయితే సరిగ్గా టైమ్ కాకపోవడంతో బౌండరీ రోప్ దగ్గర అన్మోల్ శర్మ చేతిలో క్యాచ్ అవుట్ అయ్యాడు. ఆ సమయంలోనే రెండు వైపుల ఆటగాళ్లు ఒకరినొకరు తోసుకుంటూ తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సూపర్‌స్టార్జ్ తరపున కీలకమైన వికెట్ తీసుకున్న ఈ పేసర్, అవుటైన బ్యాటర్ వైపు చూస్తూ ఏదో అన్నాడు. దాంతో క్రిష్ యాదవ్ వికెట్ దగ్గరకు తిరిగి వచ్చి కొన్ని మాటలతో ఎదురుదాడికి దిగాడు. సూపర్ స్టార్స్‌కు చెందిన సుమిత్ మాథుర్ క్రిష్ వైపు దూసుకుపోతూ వేలు చూపిస్తూ ఏదో అన్నాడు. పరిస్థితి చాలా తీవ్రంగా మారడంతో వెస్ట్ ఢిల్లీ కెప్టెన్ నితీష్ రాణా ఆన్‌ఫీల్డ్ అంపైర్లతో కలిసి జోక్యం చేసుకుని సుమిత్, క్రిష్ లను విడదీయాల్సి వచ్చింది. లేడీ అంపైర్ క్రిష్‌ను ఫీల్డ్ నుంచి వెళ్లిపోవాలని కోరగా, నితీష్ రాణా సుమిత్ భుజం చుట్టూ చేయి వేసి వెనక్కి తీసుకెళ్లడంతో గొడవ సద్దుమణిగింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే నితీష్ రాణా నేతృత్వంలోని జట్టు 202 పరుగుల లక్ష్యాన్ని ఇంకా 17 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. కెప్టెన్ 55 బంతుల్లో 8 ఫోర్లు, 15 సిక్సర్లతో అజేయంగా 134 పరుగులు చేయడంతో ఈ విజయం సాధ్యమైంది. ఎడమచేతి వాటం రాణా 243.64 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. అంతకుముందు కెప్టెన్, వికెట్ కీపర్‌బ్యాటర్ తేజస్వి దహియా 60 పరుగులతో చెలరేగడంతో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ నిర్ణీత ఇరవై ఓవర్లలో 201/5 పరుగులు చేసింది.



## హాకీ ఆసియా కప్‌లో..
# బంగ్లాదేశ్‌ను ఓడించిన మలేసియా
## కొరియా చేతిలో చైనీస్ తైపీ చిత్తు




**న్యూఢిల్లీ:** హాకీ ఆసియా కప్-2025, తొలి మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్‌ను మలేషియా ఓడించగా, కొరియా చేతిలో చైనీస్ తైపీ చిత్తయింది. పురుషుల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో మలేషియా, డిఫెండింగ్ ఛాంపియన్స్ దక్షి ణ కొరియా తమ పూల్ బి ప్రచారాలను విజయాలతో ప్రారంభించాయి. అయితే విభిన్న శైలిలో ప్రపంచ 12వ ర్యాంక్ మలేషియా తొలి దశలో వెనుకబడినా, తదుపరి కోలుకుని 29వ ర్యాంక్ ఉన్న బంగ్లాదేశ్‌ను 4-1 తేడాతో ఓడించింది. అలాగే హోల్డర్ కొరియా ఏకపక్ష పోటీలో చైనీస్ తైపీని 7-0 తేడాతో చిత్తు చేసింది. 16వ నిమిషంలో అష్రఫుల్ ఇస్లాం పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచినప్పుడు బంగ్లాదేశ్ ఆట ప్రారంభంలోనే స్కోరు చేసింది. అయితే, అష్రాన్ హంసాని చక్కటి ఫీల్డ్ గోల్‌తో జట్టు స్కోరును తిరిగి సాధించడంతో బంగ్లాదేశ్ ఆధిక్యం 25వ నిమిషం వరకు మాత్రమే కొనసాగింది. విరామం తర్వాత, మలేషియా గోల్ చేసింది. అఖిముల్లా అనువార్ (36) వారికి ఆధిక్యాన్ని అందించగా, ముహాజిర్ అబ్దుల్ రౌఫ్ (48), సయ్యద్ చోళన్ (54, పెనాల్టీ కార్నర్) ఆధిక్యాన్ని పెంచి 3 పాయింట్లు సాధించారు. మలేషియా వారి 4 పెనాల్టీ కార్నర్లలో ఒకదాన్ని గోల్‌గా మార్చగా, బంగ్లాదేశ్ వారి 2కార్నర్లలో ఒకదాని నుండి గోల్ చేసింది. తరువాత, దక్షి ణ కొరియా డైన్ సన్ హ్యాట్రిక్ (17, 29, 58)తో ఆధిక్యాన్ని ప్రదర్శించగా, జిహున్ యాంగ్ పెనాల్టీ కార్నర్‌ల ద్వారా (27, 50) రెండుసార్లు గోల్స్ చేశాడు. సెయోంగ్ ఓహ్ (53) మరియు యూన్హో కాంగ్ (54) స్కోరు రేఖకు మరింత మెరుపులు జోడించారు. చివరి నిమిషాల్లో సన్ తన ట్రెబుల్‌ను పూర్తి చేయడంతో కొరియా 7-0 తేడాతో

# రూ.లక్ష దాటిన తులం బంగారం



**ముంబయి, ఆగస్టు 30:** దేశంలో బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. తగ్గినట్లే తగ్గి ఒక్కసారిగా రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. తులం బంగారం ధర ఇప్పుడు లక్షా 5 వేల రూపాయల వరకు ఉంది. స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గ చూపుతుండటంతో బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పసిడి ధరలు ఊగిసలాడుతున్నాయి. శనివారం మధ్యాహ్నం సమయానికి బంగారం ధరల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. తులం బంగారంపై ఏకంగా 1640 రూపాయలు పెరిగింది. దీని బట్టి చూస్తే ఇంకా ఎంత పెరుగుతుందో ఊహించవచ్చు. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1640 పెరిగి 1,04,950కు చేరుకుంది. అంటే దాదాపు రూ.లక్షా 5వేల వద్ద నమోదైనట్లే. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై రూ.1200 పెరిగి 96,200 రూపాయల వద్ద ఉంది. ఇక వెండి విషయానికొస్తే ఇది కూడా నేనెందుకు తగ్గాలి అన్నట్లు 1100 రూపాయలు పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర 1,21,000 ఉంది. ఇక హైదరాబాద్, కేరళ, చెన్నై నగరాల్లో అయితే మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ కిలో సిల్వర్ ధర 1,31,000 ఉంది. బంగారం ధరల పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని బులియన్ నిపుణులు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరగడం, డాలర్ విలువలో మార్పులు రావడం, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం డిమాండ్ అధికంగా ఉండటం ఇవన్నీ ప్రధాన కారణాలు అని చెబుతున్నారు. అంతేకాదు ద్రవ్యోల్బణం పెరిగిన సందర్భాల్లో చాలా మంది పెట్టుబడిదారులు బంగారం వైపు మళ్లడం వల్ల ధరలు ఇంకా ఎగబాకుతున్నాయి. ఇక రానున్న పండుగ సీజన్‌లో భారత్‌లో బంగారం డిమాండ్ మరింత పెరుగుతుందని అంచనా.



## సెప్టెంబరు నుంచి
# వెండిపైనా హాల్‌మార్క్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** ఈ ఏడాది సెప్టెంబరుమాసం ప్రారంభంలోనేసామాన్యులకు అనేక కొత్త మార్పులను తీసుకువస్తోంది. ఈ మార్పులు గృహ ఖర్చులు, బ్యాంకింగ్, పెట్టుబడి, రోజువారీ అవసరాలకు సంబంధించినవి. సెప్టెంబర్ 1 నుండి అమలు చేయబోయే 5 ప్రధాన మార్పు ముఖ్యమైనవే ఉన్నాయి. ఇప్పటివరకు బంగారు ఆభరణాలపై మాత్రమే హాల్‌మార్కింగ్ అనే నియమం ఉండేది. కానీ సెప్టెంబర్ 1 నుండి ఈ నియమం వెండిపై కూడా వర్తిస్తుంది. అంటే ఇప్పుడు మీరు ఏ వెండి ఆభరణాలు లేదా పాత్రలను కొనుగోలు చేసినా దానికి ఖచ్చితంగా హాల్‌మార్క్ ముద్ర ఉంటుంది. ఇది వినియోగదారులకు స్వచ్ఛమైన నమ్మకమైన ఉత్పత్తులను అందిస్తుంది. నకిలీ వస్తువుల నుండి వారిని రక్షిస్తుంది. దేశంలోని అతిపెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కార్డుదారులకు ఛార్జీలను పెంచాలని నిర్ణయించింది. కొత్త నిబంధనల ప్రకారం, ఒక కస్టమర్ ఆటోడెబిట్ విఫలమైతే అతనిపై 2శాతం జరిమానా విధించనుంది. దీనితో పాటు పెట్రోల్ పంపులలో అంతర్జాతీయ లావాదేవీలు, కార్డ్ చెల్లింపులకు మరిన్ని ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఆన్‌లైన్ షాపింగ్‌లో అందుకున్న రివార్డ్ పాయింట్ల విలువ కూడా తగ్గవచ్చు. సిలిండర్ ధరలు ప్రతి నెల ఒకటో తేదీన నిర్ణయిస్తారు. చమురు కంపెనీలు సెప్టెంబర్ 1న కొత్త ధరలను కూడా విడుదల చేస్తాయి. ఈ ధరలు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర, డాలర్, రూపాయి కదలికలపై ఆధారపడి ఉంటాయి. ధర పెరిగితే వంటగది బడ్జెట్ ఎటిఎం నుండి నగదు తీసుకోవడం ఖరీదైనదే. బ్యాంకింగ్ రంగం క్రమంగా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో అనేక బ్యాంకులు నుండి నగదు ఉపసంహరణపై కొత్త నియమాలను అమలు చేయనున్నట్లు ప్రకటించాయి. నిర్ణీత పరిమితి కంటే ఎక్కువ నగదు తీసుకుంటే వినియోగదారులు అధిక ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఇప్పుడు మీరు ఎటిఎం నుండి ఎప్పుడు ఎన్నిసార్లు డబ్బు తీసుకోవాలో ఆలోచించాల్సి ఉంటుంది. సెప్టెంబర్‌లో చాలా బ్యాంకులు తమ నీదీ పథకాలపై వడ్డీ రేట్లను సమీక్షిస్తాయి. ఇప్పటివరకు చాలా బ్యాంకులు 6.5శాతంనుండి 7.5శాతంవరకు వడ్డీని ఇస్తున్నాయి. ఇండియా పోస్ట్ రిజిస్టర్డ్ పోస్ట్‌ను స్పీడ్ పోస్ట్‌తో విలీనం చేయనున్నట్లు ప్రకటించింది. దీని తర్వాత సెప్టెంబర్ 01 నుండి పంపిన రిజిస్టర్డ్ మెయిల్ ఇప్పుడు నేరుగా స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతారు.

# ఐదేళ్లలో రూ.1.66 లక్షలకోట్ల పెట్టుబడులు
## విస్తరణ బాటలో చమురు కంపెనీ ఐఒసి




**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** ప్రభుత్వరంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వచ్చే ఐదేళ్లలో 1.66 లక్షలకోట్లను పెట్టుబడులుపెట్టేందుకు నిర్ణఇంచింది. ఈ పెట్టుబడులు చమురుశుద్ధి, ఇంధన మార్కెటింగ్, పెట్రోకెమికల్స్ వెంచర్స్, సహజవాయువు, పునరుత్పత్తి విద్యుత్ విభాగాల్లో ఉంటాయని ఛైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ వెల్లడించారు. కంపెనీ వాటాదారుల వార్షిక సదస్సు శనివారం జరిగింది. ప్రస్తుతం ముడి చమురుశుద్ధి సామర్థ్యం 80.75 మిలియన్ టన్నుల నుంచిసాలీనా 98.4 మిలియన్ టన్నులకు పెంచాలని నిర్ణయించింది. 2028నాటికి ఈ సామర్థ్యం పెరుగుతోంది. పానిపట్, గుజరాత్, బరౌని ప్రాంతాల్లోని ప్లాంట్లను ఈ సామర్థ్యం పెంపునకు వినియోగిస్తోంది. మొత్తం 22 వేల కిలోమీటర్ల మేర 21 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. కొత్త నిల్వ సౌకర్యం నేపాల్‌లో కూడా ఏర్పాటుచేయాలనినిర్ణయిస్తోంది. పెట్రోకెమికల్స్ సామర్థ్యం 4.3 మిలియన్ టన్నులనుంచి 2030 నాటికి 13 మిలియన్ టన్నులకు పెంచుతోంది. దిగుమతులను తగ్గించుకుని స్వయం సమృద్ధిపైనే ఫోకస్ పెడుతోంది. దేశవ్యాప్తంగా 40 వేలకుపైగా ఇంధన స్టేషన్లు ఉన్నాయి. ఈవీ ఛార్జర్లు, బ్యాటరీ స్వాపింగ్ పాయింట్లు సిఎన్‌జి ఎల్ఎన్‌జి యూనిట్లు అధికంగా ఉన్నాయి. ఐఒసి ఇప్పటికే ఇంధన పరివర్తన ప్రాజెక్టుల్లో 2.5 లక్షలకోట్లు కేటాయించింది. 2046కల్లా కర్బన ఉద్గారాలు లేని వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. గ్రీన్ హైడ్రోజెన్, ఏవియేషన్ ఇంధనం, పునరుత్పత్తి విద్యుత్ కెపాసిటీని ఒక గిగావాట్‌నుంచి 18 గిగావాట్లకు మూడేళ్లలోనే పెంచాలనినిర్ణఇంచింది. ప్రస్తుతం సహజవాయు ఉత్పత్తి సాలీనా 7.9 మిలియన్ టన్నులు ఉంది. 21 రాష్ట్రాల్లో 49 కేంద్రాల్లో అన్వేషణ సాగుతోంది. రష్యా ఉక్రెయిన్ భౌగోళిక వివాదాలతో మధ్యప్రాచ్యంలో అనేక అడ్డంకులు వస్తున్నాయి. దీనికితోడు అమెరికానుంచి వస్తున్న సుంకాల అడ్డంకులు కూడా విస్తరణకు బ్రేకులు వేస్తునానననయని తెలుస్తోంది.




# ఎస్‌బ్యాంకులో ఎస్ఎంబిసి రూ.16వేల కోట్ల పెట్టుబడులు!

**ముంబయి, ఆగస్టు 30:** ప్రైవేటురంగంలోని ఎస్‌బ్యాంకు షేర్లు నాలుగుశాతంపెరిగాయి. సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్ప్ (ఎస్ఎంబిసి) అదనంగా 16 వేల కోట్లు బ్యాంకులో పెట్టుబడులుపెట్టేందుకు ముందుకువచ్చింది. అంతకుముందు ఇదేనెలలోనే 13,483 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చింది. బ్యాంకు స్టాక్స్ 4.66శాతంపెరిగి 19.55కు చేరింది. ఇంట్రాడేలో స్టాక్ 3.8శాతంపెరిగింది. బ్యాంకు షేర్లు రెండురోజులు పాటు నష్టాల్లో నడిచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 3.5రెట్లు సగటున పెరిగాయి. 30 రోజుల రటేడింగ్ వాల్యూమ్‌నపు పరిశీలిస్తేభారీ పెరుగుదల నమోదుచేసింది. ఎస్‌బ్యాంకు మొత్తం మార్కెట్ విలువలు లక్ష కోట్లకు చేరువగా ఉన్నట్లు నిపుణులు అంచనావేస్తున్నారు. అదేవిధంగా జపాన్ ఆర్థికరంగ దిగ్గజం ఎస్ఎంబిసి బ్యాంకులో 16 వేల కోట్లు పెట్టుబడులుపెడుతోంది. యెన్ ఆధారిత బాండ్లరూపంలో 8500 కోట్లు రానున్నాయి. రెండుశాతం వడ్డీకే ఈ నిధులు అందచేసేందుకు నిర్ణయించింది. ఈక్విటీలో 7500 కోట్లు విదేశీ కరెన్సీ బదలీబాండ్ల రూపంలో ఈ పెట్టుబడులు ఉంటాయనితేలింది. ఎస్ఎంబిసి అంతకుముందు ఇచ్చిన13,500 కోట్లహామీతో బ్యాంకులో 20% వాటా సాధించగలుగుతోంది. ఎస్‌బిఐ కూడా బ్యాంకులో బాటాతో ఉంది. ఆర్బీఐ ఎస్ఎంబిసికి బ్యాంకులో 24.99 శాతం వాటా కొనుగోలుకు ఆమోదం తెలిపింది. జపాన్ బ్యాంకు భారత్‌లో తన విస్తరణ ప్రణాళికలను ఈ బ్యాంకులో పెట్టుబడులతో స్పష్టం అవుతోంది.

## మెహుల్‌చోక్సీ బెయిల్ తిరస్కరించిన
# బెల్జియం కోర్టు!

**బ్రస్సెల్స్, ఆగస్టు 30:** పంజాబ్‌నేషనల్ బ్యాంకు ను మోసంచేసిన కేసులో ఉద్దేశ్యపూర్వక ఎగవేత నిందితునిగా ఉన్న ఆభరణాల వ్యాపారి మెహుల్‌చోక్సీ బెయిల్ అభ్యర్థనను బెల్జియంలోని అప్పీల్స్ కోర్టు తిరస్కరించింది. ఇప్పటికే చోక్సీని భారత్‌కు అప్పగించే పిటిషన్ విచారణచేస్తున్న కోర్టుచోక్సీ బెయిల్‌ను తిరస్కరించింది. భారత్‌లోని సిబిఐ ఆయన బెయిల్‌పై అభ్యంతరాలు చెపుతూ పటిష్మైన ఆధారాలు చూపించింది. అంతకుముందే చోక్సీ అనేక దేశాలనుంచి తప్పించుకున్నారని, న్యాయ పరమైన విచారణను తప్పించుకునేందుకు ఇపుడు మళ్లీ ఇంకో దేశం పరారయ్యేందుకు బెయిల్‌కోరుతున్నారని వాదించింది. ఏప్రిల్‌లోనే బెల్జియంలో చోక్సీని సిబిఐ అభ్యర్థన మేరకు అరెస్టుచేసారు. అంతకుముందు బెల్జియంలోని సెస్సెషన్ కోర్టు చోక్సీ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈనెల 22న మరో బెయిల్‌పిటిషన్ దాఖలుచేసారు. ఆయన్ను హౌస్ అరెస్టుచేయడంపై అభ్యంతరాలు వ్యక్తంచేసారు. గృహనిర్బంధంలో ఉంచి మాపై నిఘా ఉంచారని చేసిన వాదనలను కూడా ఈవారంలోనే కోర్టు తిరస్కరించింది. 66 ఏళ్ల చోక్సీ గీతాంజలి గ్రూప్ అధినేత. ఇపుడు ఆయన్ను భారత్‌కు అప్పగించాలన్న సిబిఐ వాదనలను బెల్జియం కోర్టు విచారణచేస్తోంది. మరోసారి సెప్టెంబరు మధ్యస్తంలో కూడా విచారణకు రావచ్చని అంచనా. పంజాబ్‌నేషనల్ బ్యాంకును రూ.13వేల కోట్లు మోసం చేసిన కేసులో ఆభరణాల వ్యాపారి నీరవ్‌మోడీతోపాటు మెహుల్‌చోక్సీని కూడా సిబిఐ నిందితునిగా చేర్చింది.



# 4 స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో భారీ రిటర్నులు!

**ముంబయి, ఆగస్టు 30:** భారత్ స్టాక్ మార్కెట్లలో నాలుగు స్మాల్‌క్యాప్ స్టాక్స్ మంచి రిటర్నులు ఇచ్చాయి. బిఎస్ఇలో వారాంతంలోని ఇంట్రాడే ట్రేడింగ్‌లోనే భారీ మొత్తాలకు కొనుగోళ్లుచేసింది. ఈ నాలుగు సంస్థల షేర్లు భారీ స్థాయిలో పెరిగాయి. అపోలో మైక్రోసిస్టమ్స్, హెచ్‌బిఎల్ ఇంజనిరింగ్, షైలీ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్, టైమ్స్‌గ్రూప్ ఇండియా షేర్లు మంచి రాబడులు సృష్టించినట్లు చెపుతున్నారు. 36 నుంచి 56శాతంవరకూ పెరిగినట్లు తేలింది. బిఎస్ఇ సెన్సెక్స్, స్మాల్‌క్యాప్‌సూచీలు వరుసగా ఒకటిశాతం, మూడుశాతం చొప్పున డౌన్ అయిన స్థితిలో ఈస్టాక్స్ భారీ వృద్ధినమోదుచేసాయి. అపోలో మైక్రో 12శాతంపెరిగి 271.60కి చేరింది. 34 మిలియన్ల వాటాలు చేతులుమారాయి. ఆగస్టులోనే 56శాతంపెరిగాయి. డిఆర్‌డిఒనుంచి 25.12 కోట్లమేర ఆర్డరు సాధించడంతో కంపెనీ ఆర్డరుబుక్ ప్రస్తుతం రూ.735 కోట్లుగా ఉంది. అలాగే షైయిలీ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్ ఆరుశాతంపెరిగి 2230.15కు ఇంట్రాడేలో పెరిగాయి. కంపెనీ స్టాక్స్ 41శాతంపెరిగాయి. అలాగే హెచ్‌బిఎల్ ఇంజినీరింగ్ స్టాక్స్ కూడా ఐదుశాతంపెరిగి 819.80కి పెరిగాయి. హెచ్‌బిఎల్‌కంపెనీకి సర్వే, డిజైన్, సరఫరా, వ్యవస్థ ఏర్పాటు, టెస్టింగ్, ట్రాక్‌సైడ్ కవచ్ వ్యవస్థ ఏర్పాటుకు పశ్చిమమధ్యరైల్వే అంగీకార పత్రం ఇవ్వడంతో కంపెనీ షేర్లు జూమ్ అయ్యాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.